అనుదినం... జనస్వరం

www.navatelangana.com

మంగళవారం 01-04-2025

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక



మదురైలో జరుగుతున్న సీపీఐ(ఎం) 24వ అఖిల భారత మహాసభలకు బయలుదేరిన తెలంగాణ ప్రతినిధి బృందం

సంపుటి : 11 | సంచిక : 90 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



వేధిస్తే కఠిన చర్యలు

- సన్‌రైజర్స్, హెచ్‌సీఏ ఐపీఎల్ పాస్‌ల వ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డి
- ఆరోపణలపై విజిలెన్స్ విచారణకు ముఖ్యమంత్రి ఆదేశం

నవతెలంగాణ-హైదరాబాద్

హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) మధ్య కొనసాగుతున్న ఐపీఎల్ టికెట్ల వివాదంపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉప్పల్ స్టేడియం వేదికగా జరిగిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మ్యాచులకు అధిక టికెట్లు ఇవ్వాలని హెచ్‌సీఏ అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్‌రావు వేధిస్తున్నారని, మైదానంలో తమ సిబ్బందితో అనుచితంగా ప్రవర్తించారని సన్‌రైజర్స్ హైదరాబాద్ జనరల్ మేనేజర్ శ్రీనాథ్ ఇటీవల ఈమెయిల్‌లో పేర్కొనగా.. ఆ విషయం మీడియాలో ప్రముఖంగా వచ్చింది. ఐపీఎల్ మ్యాచ్ టికెట్ల కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై ఒత్తిడి, బెదింపులకు పాల్పడినట్టు వచ్చిన వార్తలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీరియస్‌గా తీసుకున్నారు. ఈ అంశంపై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించిన సీఎం.. ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాల్సిందిగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ డైరెక్టర్ జనరల్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డిని ఆదేశించారు. సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ సిబ్బందిని వేధింపులకు గురి చేస్తే వదిలిపెట్టేది లేదని, కఠినంగా శిక్షిస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఐపీఎల్18 ...13లో

హైదరాబాద్‌లో వాన్‌గార్డ్ జీసీసీ

ఏఐ, డేటా అనాలసిస్, మొబైల్ టెక్నాలజీ సెంటర్

ఈ ఏడాది చివరి నాటికి ప్రారంభం 13లో.

నాలుగేండ్లలో 2,300 ఉద్యోగావకాశాలు



వామపక్షాలకు పూర్వ వైభవం తెస్తాం

మహిళల ప్రాతినిధ్యమూ పెంచుతాం

పార్టీలో కొత్త వారికీ బాధ్యతలు

వ్యూహాలతో ముందుకు సాగుతాం

రాష్ట్రాలను బట్టే పొత్తులు : సీపీఐ (ఎం) సమన్వయకర్త ప్రకాశ్‌కరత్

న్యూఢిల్లీ : పార్టీ రాజకీయ ప్రభావాన్ని, ప్రజల మద్దతును విస్తరించుకోవడంపై దృష్టి సారిస్తామని సీపీఐ (ఎం) సీనియర్ నేత, సమన్వయకర్త ప్రకాశ్‌కరత్ చెప్పారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత ఇండియా బ్లాక్‌లో సంప్రదింపులు లోపించాయని, అవి కొనసాగాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. పార్టీలో పాతతరంతో పాటు కొత్త తరానికీ బాధ్యతలు అప్పగిస్తామని, పాత కొత్తల కలయికగా కమిటీల కూర్పు ఉంటుందని చెప్పారు. పార్టీ కమిటీలలో మహిళలకు ప్రాతినిధ్యం పెంచుతామని అన్నారు. జాతీయ మహాసభలలో ఎన్నికల వ్యూహాలు, ఎత్తుగడలు రూపొందించుకొని వాటి ప్రకారం ముందుకు సాగుతామని తెలిపారు. పూర్వ వైభవం కోసం వామపక్షాలన్నీ కలసికట్టుగా కృషి చేయాలని కోరారు. ఎన్నికల పొత్తులు అనేవి రాష్ట్రాలను బట్టి మారుతుంటాయని చెప్పారు. తమిళనాడులోని మదురైలో పార్టీ జాతీయ మహాసభలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో 'ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ప్రతినిధి పర్వేజ్ సుల్తాన్‌కు కరత్ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన అనేక అంశాలపై తన అభిప్రాయాలు వ్యక్తపరిచారు. ఆ వివరాలు....

మదురై మహాసభలలో పార్టీ నాయకత్వంలో ఎలాంటి మార్పులు జరుగుతాయి? కేంద్ర కమిటీలో ఎక్కువ మంది యువ నేతలకు స్థానం కల్పిస్తారా?

ముఖ్యమైన కమిటీలకు సంబంధించి పార్టీలో మాకు ఓ విస్తృత విధానం ఉంది. కొనసాగింపులు, మార్పుల మధ్య మేము సమతూకం పాటిస్తాము. అన్ని పార్టీ మహాసభలు లేదా జాతీయ మహాసభలలో కొందరు వృద్ధ నేతలు బాధ్యతల నుండి తప్పుకుంటారు. కొందరు కొత్త వ్యక్తులు వస్తారు. అంటే దాని అర్థం వృద్ధ నేతలు బయటికి పోతారని కాదు. నేను చెప్పినట్లు పాత తరం వారిని కొనసాగిస్తూనే మార్పులు చేసుకుంటాం. అంటే పాత కొత్తల కలయిక అన్న మాట. ఈ జాతీయ మహాసభలలో మేము ఈ సూత్రాన్ని అనుసరిస్తాము. కేంద్ర కమిటీకి, పొలిట్‌బ్యూరోకు జరిగే ఎన్నికలకు కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. మా ప్రధాన కార్యదర్శి లేకుండానే ఈసారి జాతీయ మహాసభలు జరుపుకుంటున్నాము. గత ఏడాది సెప్టెంబరులో ఆయన హఠాత్తుగా కన్నుమూశారు. కాబట్టి ప్రధాన కార్యదర్శిని కూడా ఎన్నుకోవాల్సి ఉంటుంది.

కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ సహా కొందరు నేతల వయో పరిమితి నిబంధనను మారుస్తారా?

పినరయి విజయన్ కేరళ ముఖ్యమంత్రిగా ఉన్నందున గత మహాసభలలో మినహాయింపు ఇవ్వడం జరిగింది. ఆయన ప్రభుత్వంలో కొన్ని ముఖ్యమైన బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంది. కాబట్టి ఆయన పార్టీలో ఉన్నత నాయకత్వ స్థానంలో ఉండాలి. ఆ విషయాన్ని అప్పుడు పరిగణనలోకి తీసుకోవడం జరిగింది. ఇప్పుడు దానిని తాజాగా పరిశీలిస్తాం. ఏదైనా మినహాయింపు ఇవ్వాల్సి ఉంటే మదురై సమావేశాలలో చర్చిస్తాం.

ఎన్నికల రాజకీయాలలో ఏది ముఖ్యమని అనుకుంటున్నారు? పిడివాదమా? లేక ఆచరణాత్మక వైఖరా?

ఏదీ కాదు. మాకు, మా పార్టీకి సంబంధించినంత వరకూ రాజకీయ వ్యూహాత్మక వైఖరితోనే వెళతాం. దానిని మా పార్టీ మహాసభలు నిర్ణయిస్తాయి. మా ఎన్నికల వ్యూహాలు దాని పైనే ఆధారపడి ఉంటాయి. పట్టు విడుపులు లేని వైఖరి కావచ్చు లేదా ఆచరణాత్మకమైనది కావచ్చు ...3లో

సమీప భవిష్యత్తులో మీ పార్టీకి మహిళా ప్రధాన కార్యదర్శి ఉంటారా?

పురుషుడు లేదా మహిళ, వయసు ఇవేవీ అర్హతలు కాబోవు. ఆ బాధ్యతను చేపట్టడానికి అత్యంత సమర్థులు ఎవరనే అంశాన్నే కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో స్థాయిలో పార్టీ పరిశీలిస్తుంది.

ప్రస్తుతం కేంద్ర కమిటీలో 85 మంది సభ్యులు ఉంటే వారిలో 15 మంది మహిళలు. ఈసారి కమిటీలో మహిళలకు మరింత ప్రాతినిధ్యం ఉంటుందా?

అవును. సంఖ్య కాకుండా మహిళల శాతాన్ని పెంచాలని కేంద్ర కమిటీలో మేము నిర్ణయించాం. కమిటీ పరిమాణాన్ని, అందులో మహిళల సంఖ్యను, మహిళల శాతాన్ని పెంచుతాం.

ఇండియా బ్లాక్ పరిస్థితి ఏమిటి? భాగస్వాముల మధ్య చర్చలను తిరిగి ప్రారంభించేందుకు మీ పార్టీ చొరవ తీసుకుంటుందా?

లోక్‌సభ ఎన్నికల తర్వాత ఇండియా బ్లాక్‌తో ఎలా ముందుకు సాగాలన్న విషయంపై స్పష్టత లేదు. పార్లమెంటులో ఇండియా బ్లాక్ పార్టీలు అన్ని అంశాలు, విధానపరమైన విషయాలలో సహకరించుకుంటున్నాయి. కానీ బయట మాత్రం సంప్రదింపులు జరగడం లేదు. అలాంటి సంప్రదింపులు అవసరం. అన్ని విషయాలూ నిర్ణయించే పని మాది కాదు. మేము అలాంటి బలమైన శక్తిగా లేము. కానీ అన్ని పార్టీలు కలిసి కూర్చొని చర్చించుకొని ఎలా ముందుకు సాగాలన్న దానిపై కొంత ఉమ్మడి అవగాహనకు రావాలని మేము కోరుకుంటున్నాము. అది ఇప్పటి వరకూ జరగలేదు. అందుకే ఇండియా బ్లాక్‌కు ఓ దిశ అంటూ లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎందుకంటే భాగస్వామ్య పక్షాలన్నీ కలిసి చర్చలు జరపడం లేదు.



ఇది ప్రజా పాలన కాదు

నిరసన వ్యక్తం చేసే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది

400 ఎకరాల భూమి విక్రయాలను విరమించుకోవాలి

నేడు హెచ్‌సీయూ వద్ద ధర్నా : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

నవతెలంగాణ-బంజారాహిల్స్

పోలీసుల నిర్బంధాలతో నిరసనలు, పోరాటాలను ఆపడం ప్రజాపాలన కానే కాదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. నిరసన వ్యక్తం చేసే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని తెలిపారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వవిద్యాలయాలను, విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన దశలో రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నదని అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన 400 ఎకరాల భూమిని ప్రభుత్వం అమ్మకానికి పెట్టే ప్రయత్నాలను విరమించాలని అన్నారు. ఆ భూమిని యూనివర్సిటీ అభివృద్ధికే వినియోగించాలని, యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ నాయకత్వంలో కొద్ది రోజులుగా విద్యార్థులు పోరాడుతు న్నారని అన్నారు. కానీ, ఉన్నట్టుండి పెద్ద ఎత్తున పోలీసులు యూనివర్సిటీ తూర్పు క్యాంపస్‌లోకి ...13లో

ఓ వైపు బుల్డోజర్లు.. మరో వైపు ఆందోళనలు

అట్టుడుకుతున్న హెచ్‌సీయూ 3లో..

శరవేగంగా భూమి చదును పనులు

వ్యతిరేకంగా విద్యార్థుల నిరసనలు

భారీగా బలగాల మోహరింపు



ఆ 400 ఎకరాల భూమి ప్రభుత్వానిదే

ప్రాజెక్టులో సెంట్రల్ యూనివర్సిటీ భూమి లేదు

21 ఏండ్ల కిత్రం కేటాయించిన భూమిని కోర్టు ద్వారా దక్కించుకున్నాం

అభివృద్ధికి ఇచ్చిన భూమిలో చెరువు లేదు

హెచ్‌సీయూ భూములపై టీజీఐఐసీ వివరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాలపై యాజమాన్య హక్కు తమదేనని తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ (టీజీఐఐసీ) వివరణ ఇచ్చింది. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో చట్టపరంగా గెలవడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆ భూమిపై యాజమాన్యాన్ని దక్కించుకుందని పేర్కొంది. "కంచె గచ్చిబౌలి గ్రామంలోని సర్వేనంబర్ 25లో 400 ఎకరాల భూమిని 2004లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం క్రీడా వసతుల అభివృద్ధికి ఐఎంజీ అకడమీస్ భారత ప్రయివేట్ లిమిటెడ్‌కు కేటాయించింది. వారు ప్రాజెక్టును ప్రారంభించకపోవడంతో 2006లో ఆ కేటాయింపును రద్దు చేసి ఏపీ యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం అండ్ కల్చరల్ శాఖకు కేటాయించింది. దాంతో ఐఎంజీ సంస్థ 2006లో హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత 2024లో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చింది. దాంతో ఐఎంజీ సుప్రీంకోర్టుకు వెళ్లింది. అక్కడ కూడా ఆ సంస్థకు చుక్కెదురైంది. ఆ భూమి ప్రభుత్వానిదేనని ...13లో

మయన్మార్ భూకంప మృతులు 2056 మంది

అందులో 700 మందికిపైగా ముస్లింలే



మరో 270 మంది గల్లంతు

శిథిలాల కింద సజీవంగా గర్భిణీ

వారం రోజులు సంతాప దినాలు ప్రకటించిన ప్రభుత్వం

మాండలే : శిథిలాల నుంచి పలు మృతదేహాల వెలికితీతతో మయన్మార్ భూకంప మృతుల సంఖ్య 2056కి చేరిందని ఆ దేశ సైనిక ప్రభుత్వం ప్రకటించింది. ఇక శిథిలాల్లో చిక్కుకున్న వారు జీవించి వుండే అవకాశాలు లేవని భావిస్తోంది. ఈ ప్రమాదంలో 270మందికిపైగా గల్లంతయ్యారని, 3900 మంది వరకు గాయపడ్డారని ప్రభుత్వ ప్రతినిధి మేజర్ జనరల్ జా మిన్ మీడియాకు తెలిపారు. దేశాన్ని అతలాకుతలం చేసిన భూకంపం భారీ నష్టాన్ని కలిగించిన నేపథ్యంలో సోమవారం మయన్మార్ ప్రభుత్వం వారం రోజుల పాటు సంతాప దినాలను ప్రకటించింది. ఏప్రిల్ 6వ తేదీ వరకు జాతీయ పతాకాలను అవనతం చేస్తారని జుంటా ఒక ప్రకటనలో తెలిపింది. పరిస్థితులు చాలా దయనీయంగా వున్నాయని మాండలేలోని ఒక మసీదు చీఫ్ అడ్మినిస్ట్రేటర్ వ్యాఖ్యానించారు. ఇంకా ప్రకంపనలు కొనసాగుతుండడంతో ప్రజలు వరుసగా మూడో రోజూ వీధుల్లోనే మకాం వేశారు. మరోవైపు బ్యాంకాక్‌లో మృతుల సంఖ్య 19కి పెరిగింది. మయన్మార్‌లో కమ్యూనికేషన్ వ్యవస్థ చాలా వరకు ...2లో

ఆర్థిక, సామాజిక పోరాటాలే సీఐటీయూకి నిజమైన బలం



కార్పొరేట్, మతోన్మాదానికి వ్యతిరేకంగా రాజీలేని ఉద్యమాలు

పని ప్రదేశాల్లో చాపకింది నీరులా కుల వివక్ష

ప్రయివేటీకరణతో రిజర్వేషన్లకు ముప్పు

మతం పేరుతో కార్మిక వర్గ ఐక్యతకు చిచ్చు

ఈ నెల ఆరు నుంచి 14వరకు సామాజిక న్యాయ క్యాంపెయిన్ : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆర్థిక, సామాజిక పోరాటాలే సీఐటీయూకి నిజమైన బలం. సమాజంలోని అన్ని రకాల పీడన, దోపిడీల నుంచి సంపూర్ణ విముక్తి కోసం అది నిలబడుతుంది. ఈ విషయాన్ని తన నిబంధనావళిలో కూడా ప్రకటించింది . ఆ లక్ష్య సాధన కోసం అహర్నిశలు పనిచేస్తున్నది. కార్మిక వర్గంలో విశాల ఐక్యతను సాధించాలని ...3లో

రేపే సుంకాల పిడుగు!

ప్రతీకార టారిఫ్‌లకు సిద్ధమైన అమెరికా

- ప్రతిఘటిస్తున్న పలు దేశాలు
- బతిమాలుతోన్న భారత్
- ఇప్పటికే కొన్ని సుంకాలలో కోత విధించిన మోడీ సర్కార్



న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రేపటి నుండి వాణిజ్య భాగస్వాములపై ప్రతీకార సుంకాలు విధించబోతున్నారు. ఈ దిగుమతి సుంకాలు ఆసియా దేశాలకు....ముఖ్యంగా భారతదేశానికి పెను సవాలు విసరబోతున్నాయి. వాణిజ్య భాగస్వామ్య దేశాలన్నింటి పైన దిగుమతి సుంకాలు విధిస్తామని ట్రంప్ ఇప్పటికే ప్రకటించారు. దీంతో ఆయా దేశాలలో అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయి. ప్రారంభంలో సుంకాల విధింపు పరిమితంగానే ఉంటుందని ట్రంప్ చెబుతున్నారు. అయితే వర్ధమాన దేశాల ఆర్థిక వ్యవస్థలన్నీ అమెరికాకు చేస్తున్న ఎగుమతుల పైనే ఆధారపడి ఉన్నాయి. ఇప్పటి వరకూ వాటికి పెద్దగా అవరోధాలు ఎదురు కాలేదు.

నిధుల కోసం...

అన్ని దేశాలపై ఒకేసారి సుంకాలు విధించబోమని ట్రంప్ విలేకరులకు చెప్పారు. 'ఏం జరుగుతుందో చూద్దాం. పదిహేను దేశాలపై సుంకాలు విధిస్తామని వస్తున్న వదంతులను నేను వినలేదు. పదా లేక పదిహేనా' అని నర్మగర్భంగా అన్నారు. ఎన్ని దేశాలపై సుంకాల పిడుగు పడుతుందో తెలియడం లేదు కానీ పడడం మాత్రం ఖాయంగా కన్పిస్తోంది. అంతర్జాతీయ వాణిజ్యాన్ని తిరిగి సమతూకం చేసేందుకు, దేశీయ తయారీ రంగానికి ఊతమిచ్చేందుకు సుంకాలు విధిస్తామని ట్రంప్ ఇప్పటికే ప్రకటించారు. దేశీయ విధాన ప్రాధాన్యతలకు నిధులు సమకూర్చడం కోసం సుంకాలు వసూలు చేస్తామని ఆయన తెలిపారు. అధ్యక్ష ఎన్నికల ప్రచారం సందర్భంగా ఇచ్చిన అదనపు పన్ను హామీలను నెరవేర్చడానికి నిధులు అవసరమని చెప్పారు.

బుజ్జగింపు చర్యలు ఫలించేనా?

ఎలాంటి సుంకాలు విధిస్తారు, వాటిని ఎలా లెక్కిస్తారు, మినహాయింపులు కోరుతున్న దేశాలు ఏం చేయాలి వంటి విషయాలపై శ్వేతసౌధం ఇంకా వివరాలు వెల్లడించలేదు. ప్రతీకార సుంకాలు సహా దిగుమతి సుంకాలను ప్రకటించాలని ట్రంప్ భావిస్తున్నారని రాయిటర్స్ వార్తా సంస్థ తెలిపింది. అమెరికా ఉత్పత్తులపై ఇతర దేశాలు ఏ విధంగా సుంకాలు విధిస్తున్నాయో తాము కూడా అలాగే వసూలు చేస్తామని ట్రంప్ ఇదివరకే స్పష్టం చేశారు. భారత్, యూరోపియన్ యూనియన్, దక్షిణ కొరియా, బ్రెజిల్ సహా పలు దేశాలపై సుంకాలు విధించబోతున్నామని ఆయన చెప్పారు. అమెరికా విధించబోయే టారిఫ్‌లను ఎదుర్కొనేందుకు చైనా, కెనడా, యూరోపియన్ యూనియన్ సిద్ధంగా ఉన్నాయి. కానీ భారత్ ...13లో

ప్రొఫెసర్లు కావలెను

56 శాతానికి పైగా ఖాళీలు

ఐఐటీ, ఐఐఎం, ఎన్ఐటీ, ఐఐఎస్ఈఆర్‌లలో ఇదీ పరిస్థితి

ఫ్యాకల్టీ నియామక ప్రక్రియను వేగవంతం చేయాలి

ఉన్నత విద్యలో పారదర్శకత ఏదీ?

పార్లమెంటరీ ప్యానెల్ నివేదిక వివరాలు 3లో

"ఆ వాక్యమే అధ్యయనానికి పురికొల్పింది"



ఎప్పుడూ చిరునవ్వుతో కనబడే సీతారాం ఏచూరి నిరంతర అధ్యయనశీలి. జేఎన్‌యూ నాయకుడి నుంచి సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి వరకు సాగిన ఆయన ప్రస్థానంలో అధ్యయనం ప్రాధాన్యతపై ఇంటర్వ్యూ... 14లో.



ఖమ్మంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఐదో మహాసభలు

● పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర ఐదో మహాసభలను ఈ నెల 25 నుంచి 27 వరకు ఖమ్మం నగరంలో నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టి నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రజనీకాంత్, రాష్ట్ర సహాయ కార్యదర్శి డి కిరణ్, రాష్ట్ర కమిటీ సభ్యులు జె. రమేష్‌లతో కలసి వారు పోస్టర్‌ను ఆవిష్కరించారు. మూర్తి, నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో 10 లక్షల సభ్యత్వంతో అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఎస్ఎఫ్ఐ ఉందనీ, నిత్యం విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని పోరాడుతున్నదని గుర్తు చేశారు. విద్యారంగంలో కార్పొరేటీ కరణ, ప్రయివేటీకరణ, కేంద్రీకరణ, వ్యాపారీకరణకు వ్యతిరేకంగా అనేక సమరశీల పోరాటాలను చేస్తున్నదని తెలిపారు. నూతన విద్యాసంస్కరణల ఎరుతో ఆ రంగంలో తీసుకొస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ, విద్యార్థులందరినీ ఐక్యం చేసి పోరాటాలు నిర్వహిస్తున్నదని తెలిపారు.

హెచ్‌సీయూ భూముల వేలాన్ని ఆపాలి

● హ్యూమన్ రైట్స్ ఫోరం డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)కి చెందిన 400 ఎకరాల భూమి వేలాన్ని వెంటనే ఆపాలని హ్యూమన్ రైట్స్ ఫోరం హైదరాబాద్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. సురేష్, సంజీవ్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 1973లో సదరు భూమిని భారత ప్రభుత్వం విద్యా, పరిశోధన అవసరాల నిమిత్తం హెచ్‌సీయూకు కేటాయించిందని గుర్తు చేశారు. భూమి పరిధిలో 232 రకాల వృక్షజాతులు, 14 అరుదైన జాతులు, ఐదు ప్రత్యేకమైన జంతుజాతులు ఉన్నాయని పేర్కొన్నారు. పీకాక్, బఫెలో సరస్సులు, మెసోలిథిక్ రాతి నిర్మాణాలు వంటి ప్రత్యేకమైన పర్యావరణం విశ్వవిద్యాలయంలో ఉందని అన్నారు. ఈ భూమిని వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తే పర్యావరణానికి తీరని నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

హెచ్‌సీయూ ఘటనపై తక్షణమే విచారణ జరపాలి

● బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలి : కేంద్ర మంత్రి బండి సంజయ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ కేంద్రీయ విద్యాలయంలో చోటు చేసుకున్న ఘటనపై తక్షణమే విచారణ జరిపించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షుల సమావేశంలో పాల్గొన్నారు. అంతకు ముందు మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. అనంతరం మాట్లాడుతూ దాడికి బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఏబీవీపీ విద్యార్థులు ఆందోళన చేస్తుంటే రూంలలోకి వెళ్లి దాడి చేస్తారా? అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డికి, కే.ఏ.పాల్‌కు తేడా లేదనీ, పాల్‌కు అధికారమిచ్చినా ఇదే పని చేస్తారని విమర్శించారు. సన్నబియ్యం పంపిణీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రధానమంత్రి ఫొటో లేకపోవడంతో అభ్యంతరం తెలిపారు. సన్నబియ్యం కార్యక్రమానికి కేంద్రం వాటా రూ.10 వేల కోట్లైతే, రాష్ట్ర వాటా రూ.2 వేల కోట్లు మాత్రమేనని చెప్పారు. జీహెచ్ఎంసీ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం ఒక్కటయ్యాయనీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి హైదరాబాద్‌ను ఎంఐఎంకు అప్పగించేందుకు పోటీకి దూరంగా ఉంటున్నాయని ఆరోపించారు. గ్రూప్ 1 పరీక్షల్లో అవకతవకలపై విద్యార్థులు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల ఆరాటం గొప్పది : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్ నగరం, విశ్వవిద్యాలయ భవిష్యత్ కోసం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు పడుతున్న ఆరాటం చాలా గొప్పదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం పాటుపడుతున్న విద్యార్థులపైన ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గమైన అణచివేతకు పాల్పడుతుందని విమర్శించారు. యూనివర్సిటీకి చెందిన విద్యార్థులు కేటీఆర్‌ను తెలంగాణ భవన్‌లో కలిశారు. వారి పోరాటానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. 'తొలి దశ తెలంగాణ ఉద్యమం తర్వాత హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఆ యూనివర్సిటీ కాలక్రమంలో అనేక పేరు ప్రఖ్యాతలు సాధించుకుందని గుర్తు చేశారు. అక్కడ చదివిన విద్యార్థులు దేశ విదేశాల్లో గొప్ప సేవ చేస్తున్నారని తెలిపారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ దేశానికి తలమానికంగా ఉన్న విద్యాసంస్థల్లో ఒకటిగా ఉన్నదనీ, దాని కోసం ఎలాంటి స్వార్థం లేకుండా సమాజ హితం కోసం చేస్తున్న గొప్ప పోరాటమని పేర్కొన్నారు.

మహిళా హక్కుల కోసం పోరాడారు

● మోటూరు ఉదయం వర్థంతి కార్యక్రమంలో మల్లు లక్ష్మి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహిళల హక్కుల కోసం నిరంతర ఉద్యమాలు నిర్వహించిన గొప్ప నాయకురాలు మోటూరు ఉదయం అని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి తెలిపారు. సోమవారం ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్ అరుణజ్యోతి అధ్యక్షతన ఉద్యమ నిర్మాత మోటూరు ఉదయం 23వ వర్ధంతిని హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి కేఎన్ ఆశాలత, పీవోడబ్ల్యూ జాతీయ నాయకురాలు సంధ్య, రాష్ట్ర అధ్యక్షులు అనసూయ, చైతన్య మహిళా సంఘం నాయకురాలు జయ, ఏఐఎంఎస్ఎస్ నుంచి హేమలత, పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు స్వరూప పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో మహిళా ఉద్యమాన్ని నిర్మించడంలో మానికొండ సూర్యవతి, మోటూరు ఉదయం, మల్లు స్వరాజ్యం కీలక పాత్ర పోషించారని తెలిపారు. మహిళల హక్కుల కోసం బుర్రకథల ద్వారా వారిని చైతన్యం చేశారని గుర్తు చేశారు.

హెచ్‌సీయూ భూముల వేలాన్ని ఆపాలి

కేవీపీఎస్-డీవైఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలోని 400 ఎకరాల భూముల వేలాన్ని ఆపాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్), భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు సోమవారం కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేశ్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ భూముల వేలాన్ని అడ్డుకున్న విద్యార్థులపై పోలీసులు పాశవికంగా దౌర్జన్యం చేసి అరెస్టులు చేశారని తెలిపారు. అరెస్టయిన విద్యార్థులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను అమ్మడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలని ప్రభుత్వ ఆలోచన సరికాదని తెలిపారు. ప్రభుత్వ భూముల్లో పేదలు గుడిసెలేసు కుంటే వాటిని తగలబెట్టి, పేదలపై నిర్బంధాన్ని ప్రయోగిస్తుందని గుర్తు చేశారు. ప్రభుత్వమే రియల్ ఎస్టేట్ వ్యాపారానికి ఒడిగడితే ప్రజల ఆస్తులకు రక్షణ ఎక్కడిదని ప్రశ్నించారు. హెచ్‌సీయూ భూముల అంశంపై అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని డిమాండ్ చేశారు.

మందుల దందాకు అడ్డాగా వెల్‌నెస్ కేంద్రాలు

నిర్వహణ, అవినీతిపై వెంటనే విచారణ జరపాలి

ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీపై ఆధారాలతో ఫిర్యాదు చేసినా చర్యలేవీ?

వెల్‌నెస్ కేంద్రాల్లో అవినీతి బాగోతంపై సర్కారు దృష్టి పెట్టాలి : సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి వెంకటేష్

డిప్యూటీ ఈవోపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

వెల్‌నెస్ కేంద్రాల్లో జరుగుతున్న మందుల దందాను అరికట్టాలని, అస్తవ్యస్త నిర్వహణ, అవినీతిపై తక్షణమే విచారణ జరపాలని సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ గోల్కొండ క్రాస్ రోడ్డులోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల కోసం నగదు రహిత ఉచిత వైద్య సదుపాయం అందించేందుకు ఏర్పాటు చేసిన వెల్‌నెస్ కేంద్రాలు సరైన వైద్యం అందించకపోగా కొందరు కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దండుకోవడానికి కేంద్రాలుగా మారిపోయాయని వివరించారు. వైద్యం కోసం సుదూర ప్రాంతాల నుంచి ఆటోల్లో, ట్యాక్సీల్లో వచ్చే పెన్షనర్లకు వైద్యం అందకపోగా మందులూ సరిపడా అందక ఉసూరుమంటూ తిరిగి వెళ్లిపోవాల్సి వస్తోందన్నారు. రాష్ట్రంలోని 12 వెల్‌నెస్ కేంద్రాల్లో నిర్వహణ అస్తవ్యస్తంగా తయారవడం, పర్యవేక్షణ లేకపోవడం దీనికితోడు మందులూ రోగులకందకుండా అక్రమార్కులు కాజేస్తున్న దుస్థితి ఏర్పడిందని వాపోయారు. ప్రతి ఏటా భారీ మొత్తంలో మందుల కోసం అవసరానికి మించి ఇండెంట్లు పెట్టి తెప్పిస్తున్నారని, అవి రోగులకు సక్రమంగా అందడం లేదని అన్నారు. ఫార్మా డిస్ట్రిబ్యూటర్లతో కుమ్మక్కై, ఉన్నతాధికారులు అడ్డగోలుగా మందులు తెప్పిస్తున్నారని, 2023-24 ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.19.19 కోట్లు మందుల కోసమే ఖర్చయిందని అన్నారు. రోగులతో సంబంధం లేకుండానే వాళ్ల హెల్త్ కార్డు నెంబర్లపై ఖరీదైన మందులను కొందరు ప్రయివేట్ క్లినిక్‌లకు పెద్దఎత్తున తరలిస్తున్నారన్నారు. జర్నలిస్ట్ కార్డు కలిగిన కొందరు సిబ్బంది ఆ పేరుతో మందులను కాజేస్తున్నారన్నారు. జర్నలిస్ట్ కార్డు కలిగిన సిబ్బంది ప్రతి కేంద్రంలోనూ ఒకరో ఇద్దరో ఉన్నారన్నారు. ఈ మొత్తం మందుల దందా, కుంభకోణం వెనుక ఒక డిప్యూటీ ఈవో కీలకంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. వెల్‌నెస్ కేంద్రాల్లో మందుల దందా, అవినీతిపై విచారణ జరపాలని, డిప్యూటీ ఈవోపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) తరపున డిమాండ్ చేశారు.

పార్టీ నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ.. 12 వెల్‌నెస్ కేంద్రాల్లో 253 మంది స్టాఫ్ పనిచేస్తున్నారని, వీరంతా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులేనని అన్నారు. ఏ కేంద్రంలోనూ ఒక్క శాశ్వత ఉద్యోగిగానీ, శాశ్వత అధికారిగానీ లేరన్నారు. ఉద్యోగులు, డాక్టర్లు, ఫార్మసిస్టులు, నర్సులు, నిర్వాహకులు అందరూ ఔట్‌సోర్సింగ్ విభాగంలో పనిచేస్తున్న వారేనని, స్పెషలిస్ట్ డాక్టర్లు సంతకాలు చేసి వెళ్లిపోతున్నారని చెప్పారు. దంత రోగులు లేకపోయినా దంత వైద్యులు మాత్రం డజన్ల కొలది ఉన్నారన్నారు. వీటిపై కనీస పర్యవేక్షణ జరగడం లేదన్నారు. ఉన్నతాధికారులు ఏ వెల్‌నెస్ సెంటర్‌నూ ఏడాదిలో ఒక్కసారీ పరిశీలించిన దాఖలాలు లేవన్నారు. వెల్‌నెస్ కేంద్రాల డాక్టర్లు, ఉద్యోగులు డ్యూటీకి హాజరు కాకపోతే వేతనం కట్ చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ శ్రీకార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థ.. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ నుంచి మాత్రం డబ్బులు క్లెయిమ్ చేసుకుని సొంత అకౌంట్‌లో జమ చేసుకుంటోందని వివరించారు. నిర్దిష్టమైన ఆధారాలతో ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌కు సీపీఐ(ఎం) ఫిర్యాదు చేసినప్పటికీ ఆ ఏజెన్సీపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. వెల్‌నెస్ కేంద్రాల్లో ఉద్యోగుల రిక్రూట్‌మెంట్ నుంచి మందుల కొనుగోళ్లు, మొత్తం వ్యవస్థ నడుస్తున్న తీరు ప్రతిదీ అవినీతిమయంగా కొనసాగుతోందన్నారు. ఈఎస్ఐలో జరిగిన భారీ కుంభకోణం తరహాలోనే వెల్‌నెస్ కేంద్రాల్లోనూ స్కామ్ జరిగిందని గతంలోనే విచారణలు జరిగాయని, ఆ తర్వాత సద్దుమణిగాయని, అవినీతి బాగోతాలు మాత్రం కొనసాగుతున్నాయని తెలిపారు. వెల్‌నెస్ కేంద్రాల్లో అవినీతి బాగోతంపై దృష్టిపెట్టి తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.దశరథ్, ఆర్.వెంకటేష్ ఉన్నారు.

ఆ సొసైటీలో ఏం జరుగుతోంది?

నోటిఫికేషన్ ఇచ్చి క్యాన్సిల్ ఎందుకు చేశారు?

థర్డ్ పార్టీకి అప్పగించడం వెనుక మతలబేంటి?

రూ. కోట్లకు కొలువుల అమ్మకం

టీశాక్స్‌లో ఆందోళన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ నిత్యం ఏదో ఒక ఆరోపణల్లో మునిగిపోతున్నది. గతంలోనూ అనేకసార్లు సొసైటీలో తీసుకున్న నిర్ణయాలు వివాదాస్పదం కాగా ఉద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైన సంగతి తెలిసిందే. తాజాగా టీశాక్స్‌లో తీసుకున్న మరో నిర్ణయం అనేక అనుమానాలకు తావిస్తోంది. టీశాక్స్‌లో మూడు క్యాటగిరీల్లో ఖాళీ అయిన 77 పోస్టుల భర్తీకి సంబంధించి జరుగుతున్న తతంగం ఈ అనుమానాలకు కారణమైంది. టెక్నికల్ ఆఫీసర్స్ ఇన్ ల్యాబ్ సర్వీసెస్ 2, కౌన్సెలర్స్ పోస్ట్స్ ఇన్ తెలంగాణ స్టేట్ 17, ల్యాబ్ టెక్నీషియన్స్ 58 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో వరసగా నెలకు పారితోషికం రూ.35 వేలు, రూ.21 వేలు, రూ.21 వేలుగా నిర్ణయించారు. వీటి భర్తీ కోసం గతంలో నోటిఫికేషన్ ఇచ్చారు. సాధారణంగా నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ నిబంధనల ప్రకారం రాష్ట్రాల ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీల్లో పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేస్తారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే పద్ధతి కొనసాగుతున్నది. అదే తరహాలో తెలంగాణాలోను కాంట్రాక్ట్ ప్రాతిపదికన పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చారు. దీంతో నిరుద్యోగులు దాదాపు 3,600 మందికిపైగా దరఖాస్తులు సమర్పించినట్టు సమాచారం. ఆ దరఖాస్తులను పరిశీలించి అర్హమైన వాటిని తేల్చారు. అర్హులైన వారికి రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేయాల్సి ఉంటుంది. సరైన సర్టిఫికెట్లు కలిగిన వారి నుంచి అనుభవం, అర్హత, ఇతర అంశాలను చూసి టీశాక్స్ అందించే సేవలకు ఎక్కువగా ఉపయోగపడే వారిని ఎంపిక చేయాల్సి ఉంటుంది. అయితే అధికారులు మాత్రం అలా కాకుండా దరఖాస్తుదారుల్లో 55 మందిని ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో పోస్టుల భర్తీకి సంబంధించి ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేయడంతో నిరుద్యోగులు తీవ్ర నిరాశకు గురయ్యారు. నోటిఫికేషన్ రద్దు చేసిన టీశాక్స్, శ్రీకార్తీకేయ సెక్యూరిటీ సర్వీసెస్‌తో థర్డ్ పార్టీ ఒప్పందం చేసుకుని, ఎంపికైన 55 మందిని ఆ ఏజెన్సీకి అప్పగించింది. ఇప్పటికే దాదాపు 9 మందికి ఆ సెక్యూరిటీ సర్వీసెస్ అపాయింట్ మెంట్ లెటర్లు కూడా అందజేసింది.

ఉద్యోగుల్లో ఆందోళన

థర్డ్ పార్టీ నుంచి అపాయింట్ మెంట్ లెటర్లు అందుకున్న వారు గాంధీ, ఉస్మానియా, బోధన్ తదితర ప్రాంతాల్లో సెంటర్లకు వెళ్లి రిపోర్ట్ చేశారు. సరైన అవగాహన, శిక్షణ, పాత అనుభవం రీత్యా అభ్యర్థులు అంతంత మాత్రంగానే ఉన్నట్టు టీశాక్స్‌లో ఉద్యోగులు చెబుతున్నారు. అనుభవజ్ఞులకు, అర్హులకు కాకుండా ఎలాంటి రాతపరీక్ష లేకుండా కేవలం ఒకరిద్దరు అధికారులు ఇంటర్వ్యూ రూపంలో ఎంపిక చేసి, వారిని థర్డ్ పార్టీకి అప్పగించడం ఏంటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ నిబంధనల మేరకు టీశాక్స్ పీడీ ఆధ్వర్యంలో లేదా ఆయా ఆస్పత్రుల సూపరింటెండెంట్ల ఆధ్వర్యంలో మాత్రమే ఇంటర్వ్యూలు జరగాల్సి ఉంటుంది. అలా కాకుండా అంత కన్నా కింది స్థాయి ఉద్యోగులు ఇంటర్వ్యూ చేయడం, ఎంపికైన వారిని థర్డ్ పార్టీకి అప్పగించడం కేవలం అవినీతి కోసమేననే ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో అభ్యర్థి నుంచి రూ.3 నుంచి రూ.4 లక్షల వరకు, అంటే దాదాపు రూ. కోటిన్నరకు ఈ పోస్టులను అమ్ముకున్నట్టు విశ్వసనీయ సమాచారం. పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలనీ, ఈ తతంగం వెనుక ఉన్న వారిపై చర్యలు తీసుకోవాలనీ, నిరుద్యోగులకు న్యాయం చేయాలనీ, ప్రస్తుతం కొనసాగుతున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యసాధనకు

జేఏసీ ఆవిర్భావం

ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, జేఏసీ సమన్వయకర్త డాక్టర్ విశారదన్ మహరాజ్

నవ తెలంగాణ - ముషీరాబాద్

తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడానికి ఆనాడు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలను ఒక్కటిగా చేయడానికి తెలంగాణ రాష్ట్ర జేఏసీని స్థాపించారని, ఇప్పుడు అదే తెలంగాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యం కోసం జేఏసీ అవసరం ఉందని భావించి ఈ వేదికని ప్రారంభిస్తున్నామని జేఏసీ సమన్వయకర్త, సభాధ్యక్షులు డాక్టర్ విశారదన్ మహరాజ్ తెలిపారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ రైట్స్ రాజ్యాధికార సాధన జేఏసీ ఆవిర్భావ సభ విశారదన్ మహరాజ్, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవి, ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ తిరుమలి, జస్టిస్ ఈశ్వరయ్య, ఏపీ రిటైర్డ్ చీఫ్ జస్టిస్, నేషనల్ బీసీ కమిషన్ చైర్మెన్ చేతులమీదుగా ఘనంగా జరిగింది.

ఈ సందర్భంగా విశారదన్ మహరాజ్ మాట్లాడుతూ.. తెలంగాణలో 93 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీల హక్కులు, అంతిమంగా రాజ్యాధికారం కోసం ఈ జేఏసీ ప్రధాన లక్ష్యంగా పని చేస్తుందని తెలిపారు. రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవి మాట్లాడుతూ.. రాష్ట్రం వచ్చిందే నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతోనన్నారు. పన్నులు కట్టేది బీసీ, ఎస్సీ, ఎస్టీలు కానీ ఆ పన్నుల ద్వారా వచ్చిన సొమ్మును మాత్రం అగ్రవర్ణాలు దోచుకుంటున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో దాసోజు లలిత, అశోక్, రాంబాబు నాయక్, తెలంగాణ విఠల్, ప్రొఫెసర్‌లు, బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు పాల్గొన్నారు.

తగ్గిపోతున్న భూగర్భ జలాలు

అడుగంటుతున్న బోర్లు

ఐదు లక్షల ఎకరాల్లో ఎండుతున్న పంటలు

ఆందోళనలో రైతులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో నానాటికీ భూగర్భజలాలు తగ్గిపోతున్నాయి. నీరు అడుగంటి పోవడంతో బోర్లు కూడా ఎండిపోతున్నాయి. దీంతో రాష్ట్రంలో దాదాపు ఐదు లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. నల్లగొండ, భువనగిరి, సూర్యాపేట్, జనగాం, వనపర్తి, నాగర్‌కర్నూల్, కరీంనగర్, వరంగల్ వంటి జిల్లాల్లో పంటలు చేతికంద కుండా పోయాయి. రిజర్వాయర్లలో పుష్కలంగా నీటి నిల్వలు ఉన్నప్పటికీ సకాలంలో పంటలకు నీటిని విడుదల చేయడంలో సర్కారు నిర్లక్ష్యమే కారణమని చెబుతు న్నాయి. నీటి నిర్వహణ లోపాల వల్లే పంటలు ఎండిపోతున్నాయి. సకాలంలో నీటిని విడుదల చేసినట్లైతే చెరువులు, కుంటలు, బోర్లలో ఊటలు పెరిగేవి. నీటిపారుదల శాఖ ఉన్న సమయంలో నీటిని కాలువల ద్వారా విడుదల చేయలేదు. దీంతో ఆ పంటలు ఎండిపోయాయి. పంటలకు నీరందక అవి ఎండిపోవడంతో రైతు పెట్టిన పెట్టుబడి కూడా రాని దుస్థితి నెలకొంది. కాల్వ నీళ్లపై నమ్మకం పెట్టుకుని వేసిన పంట సాగు జలాలు లేక ఎండితున్నాయి. బోర్లు, కాలువల ద్వారా నీళ్లొస్తాయనే నమ్మకంతో రైతులు పంటలు సాగు చేశారు. తీరా పంట చేతికొచ్చే సమయానికి వచ్చే నీళ్లు ఆగిపోయాయి. బోరుబావుల ద్వారా కాపాడుకుందామంటే భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. బోరుబావుల నుంచి సక్రమంగా జలాలు పారని పరిస్థితి ఏర్పడింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను కాపాడుకునేందుకు రైతులు తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారు.

వరి, మొక్కజొన్న, వేరుశనగ, మిరప పంటతోసహా పలు రకాల పంటలు సాగు చేశారు. ఆరుతడి పంటలకు, వారాబందీ విధానంలో సాగు నీరు అందిస్తామని నీటి పారుదల శాఖ అధికారులు ప్రణాళిక రచించారు. కానీ అటు గోదావరి, ఇటు కృష్ణా నదులపై ఉన్న ఆనకట్టల్లో నీరు పుష్కలంగా ఉన్నది. ఇప్పటికీ ఔట్ ఫ్లో బాగా ఉన్నది. యాసంగిలో వేసిన పంటలు చివరి దశలో ఎండిపోయాయి. ఎకరానికి రూ.50 వేల వరకు పెట్టుబడి రాగా... చివరి దశలోనే పంట ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాసంగిలో వేరుశనగ సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. సకాలంలో పంటకు నీరందక ఎండిపోయిన పంటలను పశువులకు మేతగా వదిలేస్తున్నారు. కొన్ని చోట్ల పొలాన్ని ట్రాక్టర్లతో తొక్కిస్తున్నారు. కొన్ని రోజులుగా నీళ్లు అందక పొట్ట దశకు వచ్చిన పంటలు ఎండిపోయాయి. నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతు సంఘాలు కోరుతున్నాయి.

పంటలు ఎండిపోవడానికి ప్రభుత్వమే కారణం
టి సాగర్, ప్రధాన కార్యదర్శి తెలంగాణ రైతు సంఘం

రాష్ట్రంలో పంటలు ఎండిపోవడానికి ప్రభుత్వమే కారణం. నీటి నిల్వలు ఉన్నప్పటికీ సకాలంలో ప్రభుత్వం నీటిని విడుదల చేయలేదు. ఇది చేసినట్లైతే సాగు, తాగు నీటికి ఎలాంటి ఇబ్బంది ఉండేదికాదు. ప్రభుత్వ తప్పిదం కారణంగా పంటలు ఎండిపోయాయి. ఎండిపోయిన పంటలను కూడా అధికారులు అంచనా వేయలేదు. వెంటనే ప్రభుత్వం పంటలకు పరిహారం ఇవ్వాలి.

హెచ్‌సీయూ విద్యార్థుల అరెస్టులు అప్రజాస్వామికం

సీపీఐ (ఎంఎల్) లిబరేషన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల రక్షణ కోసం విద్యార్థి సంఘాలు కొనసాగిస్తున్న పోరాటాలపై ప్రభుత్వం దమనకాండ ప్రయోగించడం అప్రజాస్వామ్యమనీ, అక్రమ అరెస్టులను ఆపాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 400 ఎకరాలను వేలం వేయడం ద్వారా కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూరుస్తూ వేల కోట్ల రూపాయలను దండుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోన్నదని విమర్శించారు. ఆ భూముల జోలికి వెళ్లడమంటే ప్రభుత్వం తన పతనాన్ని కోరుకోవడమేనని పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల్ని రక్షిస్తామని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి తీరు పచ్చి అవకాశవాదంగా ఉందని ఆరోపించారు.

ప్రజాస్వామ్యాన్ని ఏడో వాగ్దానంగా చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని విమర్శించారు. యూనివర్సిటీ భూములపై ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ (ఐసా), ఎస్ఎఫ్ఐ, ఇతర విద్యార్థి సంఘాల అక్రమ అరెస్టులను ప్రజాస్వామ్యవాదులు, ప్రజాతంత్ర శక్తులు కోరారు. విద్యార్థినిల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు అవమానకరంగా ఉందని తెలిపారు. విద్యార్థులను అవమానకరంగా వేధించిన అధికారుల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో శాంతియుత వాతావరణం కల్పించాలని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.

సీనియర్ రెసిడెంట్ పోస్టుల కౌన్సిలింగ్ వాయిదా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీనియర్ రెసిడెంట్ పోస్టుల కౌన్సిలింగ్‌ను వాయిదా వేసినట్టు ప్రభుత్వ దంత కళాశాల డీన్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం మార్చి 31న కౌన్సిలింగ్ నిర్వహించాల్సి ఉంది. అయితే షెడ్యూల్‌ను వాయిదా వేసిన అనంతరం, కౌన్సిలింగ్ విషయంపై హైదరాబాద్ కలెక్టర్‌తో చర్చిస్తున్నట్టు తెలిపారు. తిరిగి ఎప్పుడు కౌన్సిలింగ్ నిర్వహించేది త్వరలోనే వెల్లడిస్తామని పేర్కొన్నారు.

మయన్మార్ భూకంప మృతులు 2056 మంది



(మొదటి పేజీ తరువాయి)

తెగిపోవడంతో పూర్తి సమాచారం అందడం లేదని భావిస్తున్నారు. వెయ్యి పడకల ఆస్పత్రి కూలిపోవడంతో వెలుపలనే ఆస్పత్రిని ఏర్పాటు చేసి వందలాదిమంది రోగులకు చికిత్సనందిస్తున్నారు.

వచ్చే నెల రోజుల్లో అంటు వ్యాధులు చెలరేగకుండా నివారించేందుకు, ప్రాణాలను కాపాడే అత్యవసర సాయంగా తక్షణమే 80లక్షల డాలర్లు కావాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. బాధితులకు సాయమందించేందుకు 10కోట్ల డాలర్లకుపైగా మొత్తాలను సమకూర్చుకోవాల్సి వుందని అంతర్జాతీయ రెడ్‌క్రాస్ సమాఖ్య, రెడ్ క్రీసెంట్ సొసైటీలు పిలుపిచ్చాయి.

ప్రార్థనలు చేస్తూనే....

మయన్మార్ భూకంపంలో 700మందికి పైగా ముస్లింలు మృత్యువాత పడ్డారని మయన్మార్ ముస్లిం సంస్థ సోమవారం ప్రకటించింది. రంజాన్ మాసంలో శుక్రవారం ప్రార్థనలు చేసే సమయం కావడంతో వీరందరూ ప్రార్థనలు చేస్తూనే భూ సమాధి అయ్యారని తెలిపింది. అయితే మసీదుల్లో చనిపోయిన ఈ 700మందీ ప్రభుత్వం ప్రకటించిన 2056మంది జాబితాలో వున్నారా లేదా అనే విషయం వెంటనే తెలియరాలేదు.

దాదాపు 60 మసీదులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. భూకంపం సమయంలో పలు మసీదులు కూలిపోతున్న వీడియోలూ వైరల్ అవుతున్నాయి.

చాలావరకు మసీదులన్నీ బాగా పాతబడిన భవనాలేనని, అందువల్ల భూకంప ధాటికి తట్టుకోలేక పోయాయని ముస్లిం ఆర్గనైజేషన్ స్ప్రింగ్ రివల్యూషన్ మయన్మార్ ముస్లిం నెట్‌వర్క్‌కి చెందిన స్టీరింగ్ కమిటీ సభ్యుడు తున్ కియా చెప్పారు.

శిథిలాల నుండి సజీవంగా గర్భవతి..!

మూడు రోజుల అనంతరం సహాయక సిబ్బంది ఓ గర్భిణిని సజీవంగా శిథిలాల కింది నుంచి బయటకు తెచ్చారు. మాండలేలోని గ్రేట్‌వాల్ హోటల్ శిథిలాల నుంచి ఆమెను బయటకు తీసినట్టు అధికారులు సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ఆ మహిళను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్టు వివరించారు. ఈ నేపథ్యంలో శిథిలాల కింద చిక్కుకుపోయిన వారు సజీవంగా ఉండొచ్చనే ఆశతో అనేకమంది ఉత్త చేతులతోనే శిథిలాలను తొలగిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. కాగా శిథిలాలను పూర్తిగా తొలగించడానికి కనీసం రెండు నెలల సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే మృతదేహాలు కంపుకొడుతున్నాయి. ఎన్నో ఇబ్బందుల మధ్య సహాయకచర్యలు కొనసాగుతున్నాయి.. శిథిలాల కింద చిక్కుకుపోయిన వారిని రక్షించడానికి ప్రయత్నాలు సాగుతున్నాయి..

ఓ వైపు బుల్డోజర్లు.. మరో వైపు ఆందోళనలు

అట్టుడుకుతున్న హెచ్‌సీయూ

శరవేగంగా భూమి చదును పనులు

వ్యతిరేకంగా విద్యార్థుల నిరసనలు

భారీగా బలగాల మోహరింపు



నవతెలంగాణ-మియాపూర్

ఒక వైపు వందలాది బుల్డోజర్లు భూమిని చదును చేస్తున్నాయి. మరో వైపు ఆ భూమి తమదేనంటూ విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నారు. ర్యాలీలు, ధర్నాలు, నిరసనలతో విద్యార్థులు హోరెత్తిస్తుంటే.. ప్రభుత్వం తమ పని తమదంటూ జేసీబీలు, ట్రక్కులతో శరవేగంగా పనులు చేస్తోంది. బుల్డోజర్లు చెట్ల కూల్చివేతలు.. విద్యార్థులు ఉద్యమంతో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అట్టుడుకుతోంది. భారీగా పోలీసు బలగాలు యూనివర్సిటీలో మోహరించాయి. విద్యార్థుల ఉద్యమంపై ఉక్కుపాదం మోపుతున్నాయి. అంతే దీటుగా విద్యార్థులు పోరాడుతున్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని 400 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. దాంతో ప్రభుత్వ నిర్ణయాన్ని యూనివర్సిటీ విద్యార్థులు తీవ్రంగా ఖండించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి టీచింగ్ నాన్ టీచింగ్ ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ చేపట్టారు. యూనివర్సిటీలో వరుసగా ఆందోళనలు చేశారు. ఇదే క్రమంలో అసెంబ్లీలో సైతం సీఎం రేవంత్‌రెడ్డి ఈ భూముల వేలంపై ప్రకటన చేశారు. ఈ క్రమంలో విద్యార్థులపై చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. సీఎం వ్యాఖ్యలను ఖండిస్తూ శనివారం రాత్రి విద్యార్థులు సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమాన్ని అడ్డుకునే క్రమంలో కొందరు విద్యార్థులు గాయపడ్డారు. ఇదిలా ఉంటే ఆదివారం ప్రభుత్వ యంత్రాంగం.. జేసీబీలు, ట్రక్కులు తీసుకుని పోలీసు బలగాల మధ్య

యూనివర్సిటీలోకి వచ్చి సదరు భూమిని చదును చేసింది. దీన్ని విద్యార్థులు అడ్డుకొని తీవ్రంగా ప్రతిఘటించారు.

విద్యార్థులపై కేసు నమోదు

భూముల వేలానికి వ్యతిరేకంగా విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. నిరసనలో పాల్గొన్న విద్యార్థులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. పీహెచ్‌డీ విద్యార్థులు ఎర్రం నవీన్‌కుమార్, డాక్టర్ రోహిత్‌పై 329(3), 118(1), 132, 191(3), 351(3) ఆర్/డబ్ల్యు3(5) కేసులు నమోదు చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), మరో విద్యార్థి సంఘం నాయకునిపై కూడా కేసు నమోదు చేసినట్టు సమాచారం. తాము పోరాటం చేస్తున్నది కేవలం తమకోసం మాత్రమే కాదని.. భవిష్యత్తు తరాల కోసమని, ఉన్నత విద్య అందాలంటే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములు రక్షించాల్సిన అవసరం ఉందని విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు.

అర్ధరాత్రి కొనసాగిన ఆందోళనలు

విద్యార్థుల అరెస్టు.. వారిపై పోలీసుల జులుంను ఖండిస్తూ.. ఆదివారం అర్ధరాత్రి యూనివర్సిటీలో విద్యార్థులు ఆందోళనలు కొనసాగించారు. అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని డిమండ్ చేస్తూ పెద్దఎత్తున విద్యార్థులకు హాస్టల్స్ నుంచి బయటకు వచ్చి ఆందోళనలు చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రాత్రంతా ఆందోళనను కొనసాగించారు. విద్యార్థుల నిరసనల నేపథ్యంలో సోమవారం ఉదయం యూనివర్సిటీ మెయిన్ గేటు వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించారు. ప్రధాన గేట్లకు తాళాలు వేసి వేలాదిగా పోలీసులు కాపలా ఉన్నారు. విద్యార్థులు బయటకు, లోపలికి రాకుండా క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

శరవేగంగా భూమి చదును పనులు

ఒకవైపు విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతుంటే.. మరో వైపు ప్రభుత్వం పోలీసు బందోబస్తు మధ్య జేసీబీల సాయంతో భూమి చదును చేపట్టింది. యూనివర్సిటీలో చెట్లను తొలగిస్తున్నాయి. ఆదివారం నుంచి సోమవారం రాత్రి వరకు చెట్ల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది.

వామపక్షాలకు పూర్వ వైభవం తెస్తాం

(మొదటిపేజీ తరువాయి)

అది మా అవగాహనపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు బీజేపీని ఒంటరిని చేసి ఓడించడమే మా ప్రధాన లక్ష్యమని మేము నిర్ణయిస్తే ప్రతి రాష్ట్రంలో ఒక నిర్దిష్ట పరిస్థితికి దానిని వర్తింపచేస్తాము. మేము దానిని ఎలా వర్తింపజేస్తాము ఎలా అమలు చేస్తాం? మా ఎన్నికల వైఖరిని లేదా ఎత్తుగడలను రూపొందించుకొని దానికి అనుగుణంగా నడుచుకుంటాం.

ప్రాంతీయ స్థాయిలో కాంగ్రెస్‌తో ఏమైనా అవగాహన ఉన్నదా?

రాబోయే నాలుగు సంవత్సరాలలో లోక్‌సభకు ఎన్నికలు జరగవు. ఇప్పుడు రాష్ట్ర స్థాయి ఎన్నికలు మాత్రమే జరుగుతాయి. ఆయా రాష్ట్రాలలోని రాజకీయ శక్తుల మధ్య ఉన్న సంబంధాలను బట్టి బీజేపీ వ్యతిరేక లేదా బీజేపీ యేతర పార్టీలు చేరువయ్యేందుకు ప్రయత్నించాలి. పొత్తులు అనేవి అన్ని రాష్ట్రాలలో ఒకేలా ఉండవు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా ఉంటాయి. బీహార్‌లో ఎన్నికలు సమీపిస్తున్నాయి. అక్కడ ఇప్పటికే మహాగట్‌బంధన్ (మహా కూటమి) ఉంది. అది ఇండియా బ్లాక్‌లోనే ఉంది. ఆ కూటమి కొనసాగుతుంది. కొన్ని కొత్త శక్తుల చేరికతో మరింత బలపడవచ్చు కూడా. కాబట్టి రాష్ట్రాన్ని బట్టి పొత్తులు ఉంటాయి. వచ్చే సంవత్సరం తమిళనాడులో ఎన్నికలు జరుగు తాయి. డీఎంకే నేతృత్వంలో ఇప్పటికే అక్కడ కూటమి ఉంది. అది కొనసాగుతుంది. జాతీయ స్థాయిలో ఏం జరుగుతుందన్న దానిపై అది ఆధారపడి ఉండదు. కాబట్టి రాష్ట్ర స్థాయిలో అలాంటి అవగాహనలను కుదుర్చుకోవడం జరుగుతుంది.

కేరళలో ఆర్ఎస్ఎస్-బీజేపీ ప్రభావం పెరుగుతోందంటూ వస్తున్న నివేదికలపై ఏమంటారు?

అవును. లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై సమీక్ష జరిపినప్పుడు మొత్తంగా దక్షిణాదిలో అది కొన్ని విజయాలు సాధించిందని మేము గుర్తించడం జరిగింది. కేరళలో కూడా ఎన్డీఏకు వచ్చిన ఓట్ల శాతంలో అది కన్పించింది. బీజేపీ, కొన్ని చిన్న పార్టీలతో కూడిన ఎన్డీఏ 19 శాతం ఓట్లు సాధించింది. మొదటిసారిగా వారికి చాలా ఓట్లు వచ్చాయి. అయితే లోక్‌సభ ఎన్నికల ఫలితాల మాదిరిగానే రాష్ట్ర శాసనసభ ఎన్నికల ఫలితాలు కూడా ఉంటాయని మేము అనుకోవడం లేదు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకొని బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల కార్యకలాపాల ప్రభావాన్ని ఎలా ఎదుర్కోవాలన్న విషయంపై ఇప్పటికే చర్చించాం.


వామపక్షాల ఐక్యత గురించి సీపీఐ (ఎం) కొంతకాలంగా మాట్లాడుతోంది. ఆ ఐక్యతకు సీపీఐ, సీపీఐ (ఎంఎల్) అడ్డు వస్తాయని భావిస్తున్నారా?

లేదు. వారేమీ అడ్డు రారు. బెంగాల్, త్రిపురలో మేము బలహీనపడిన తర్వాత దేశ రాజకీయాలలో మా ప్రభావం తగ్గిపోయిందన్నది వాస్తవం. కాబట్టి అప్పుడు ఉన్న వామపక్షాల ఐక్యత ఇప్పుడు బలహీనపడింది. అందువల్ల ఇప్పుడు మొత్తంగా వామపక్షాలకు పూర్వ వైభవం తేవడానికి మేము ప్రయత్నించాల్సిన అవసరం ఉంది. అది సీపీఐ (ఎం) మాత్రమే చేసే పని కాదు. మాకు వామపక్షాల ఐక్యత కావాలి. ఉమ్మడి ప్రయత్నాలు, ఉమ్మడి కార్యకలాపాలు, ఉమ్మడి ఉద్యమాలు అవసరం. అందుకోసం కూడా మేము కృషి చేస్తున్నాము. బడ్జెట్ తర్వాత మేము దేశవ్యాప్త నిరసనలకు పిలుపు ఇచ్చాం. బడ్జెట్ కేటాయింపులపై ప్రచారం నిర్వహించాం. గాజాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను గతంలో కలిసే వ్యతిరేకించాం. అనేక అంశాలపై వామపక్ష పార్టీలు సంఘటితంగానే ముందుకు సాగుతున్నాయి. కానీ దానిని మరింత విస్తృతం చేయాలని భావిస్తున్నాము. మా జాతీయ మహాసభల అనంతరం నూతనోత్సాహంతో ఈ అంశాన్ని చేపడతాం.

ఆ చారలు, కోరలు దాచలేరూ..!

బీహార్ ఎన్నికలకు ఇంకా ఆరు నెలలు సమయం ఉండగానే, ఒకే దేశం-ఒకే ఎన్నిక అని ఊదరగొట్టిన బీజేపీ మిగతా అన్ని పార్టీలకంటే ముందుగా హడావుడి ప్రారంభించింది. మోడీ 2014లో అధికారంలోకి వచ్చాక నాగపూర్‌లోని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్శన బీహార్ ఎన్నికల్లో ఆర్ఎస్ఎస్ సహాయం కోసమే అని, దాని అధినేతలను ప్రసన్నం చేసుకోవటానికే అని కొన్ని పత్రికలు రాశాయి. ఆర్ఎస్ఎస్‌కు, మోడీకి మధ్య బేధాభిప్రాయాలున్నట్టు, వాటి పరిష్కారం కోసమే మోడీ నాగపూర్ వెళ్లినట్టు ఈ పత్రికలు భ్రమలు కల్పిస్తున్నాయి. ఈ ఇద్దరూ సమాన స్థాయి కలవారని చూపించటానికి తాపత్రయం పడుతున్నాయి. నిజం ఏమిటంటే, ఆర్ఎస్ఎస్ లేకుండా మోడీ లేరు, మైనార్టీల పట్ల విద్వేషం లేకుండా ఆర్ఎస్ఎస్ లేదు. ఆర్ఎస్ఎస్ మూల సిద్ధాంతమే మైనార్టీల పట్ల ద్వేషం పెట్టుబడిదారుల పక్షాన నిలిచి వారిని ఉద్ధరించాలంటే కమ్యూనిస్టుల పట్ల వర్గద్వేషం రాజేయాలి. ఆర్ఎస్ఎస్ శాఖలలో నూరిపోసేది ఇదే. మైనారిటీల పట్ల ద్వేషంపైనే దేశంలోని లౌకిక వాదులకు వీరితో వున్న అసలు తగాదా.

మోడీ ఆరెస్సెస్ నేతల దర్శనానికి నాగపూర్ పర్యటనలో వుంటే, అమిత్ షా బీహార్ ఎన్నికలలో సీట్ల సర్దుబాటు ప్రాథమిక చర్చల కోసం పాట్నా చేరారు. నితీష్ కుమార్ పార్టీ జేడీ (యూ) సహా అన్ని పార్టీలు తాము పోటీ చేయదల్చుకున్న స్థానాల జాబితాను అమిత్ షా చేతుల్లో పెట్టాయి. వచ్చే ఎన్నికలలో బీహార్ భవిష్యత్తునే కాదు, నితీష్ కుమార్ భవిష్యత్తునూ బీజేపీ నిర్ణయిస్తుంది. మహారాష్ట్రలో జరిగింది చూశాక దీనిని కాదనటం కష్టమే. దురదష్టవశాత్తు ఎన్డీఏ గెలిస్తే, ముఖ్యమంత్రి పీఠం మాత్రం నితీష్ కుమార్‌కు దక్కదు. నితీష్ కుమార్ కూడా, షిండే లాగానే బీజేపీకి అతుక్కుపోక తప్పదు, వారు ఇచ్చింది మహాప్రసాదంలా స్వీకరించకా తప్పదు.



మోడీ నాగపూర్ పర్యటన, అమిత్ షా పాట్నా పర్యటన ఇలా ఉండగా, బీజేపీ బహిరంగంగా అనకపోయినా బీహార్ ఎన్నికలలో ముస్లింల ఓట్లు కీలకం అని అనుకుంటు న్నది. పడవ ఎక్కే ముందు ఓడ మల్లన్న అన్నట్టుగా ముస్లింలను మంచి చేసుకోవటానికి ఒక్కొక్కటి రూ. 600 విలువ చేసే 32 లక్షల మోడీ కిట్లను రంజాన్ సందర్భంగా వారికి పంచింది. రాజస్థాన్‌లో నమాజ్‌కు వెళ్తున్నవారిపై పూల వర్షం కురిపించింది. అనేక చోట్ల ఇఫ్తార్ విందులు నిర్వహించింది. పులి తనకు కోరలు, చారలే లేవన్నట్టు నటిస్తున్నది. హిజాబ్ గొడవ, నాగపూర్‌తో సహా నిన్న మొన్నటి దాకా బుల్డోజర్లు పెట్టి ఇండ్లు కూల్చిన సంగతి, గుజరాత్‌లో బిల్కిస్‌బానుపై లైంగికదాడి చేసిన ఆగంతకులు ముందుగా విడుదలైనప్పుడు చేసిన సన్మానం, కావడి యాత్రలో ముస్లిం దుకాణాలు ఉండకూడదని, రోడ్డుపై నమాజ్ లు చేయకూడదని యోగి సర్కార్ ఇచ్చిన ఆదేశాలు- వీటన్నిటినీ మర్చిపొమ్మంటున్నది. తాను విష వక్షం కాదని, వటవక్షమని నమ్మ బలుకుతున్నది. తిరిగి బీహార్ గద్దె నెక్కించమని వేడుకుంటున్నది. మోడీ కిట్ల పంపిణీ ఒక విషయం స్పష్టం చేసింది. ముస్లింల బలం ఏమిటో ముస్లింలకే అర్థమయ్యేట్టు చేసింది. ఇప్పటిదాకా జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో ఎంతమంది ముస్లింలకు టికెట్ ఇచ్చారు? పని గట్టుకుని ముస్లింలను తమ అభ్యర్థుల జాబితాలో ఒక్క స్థానం కూడా లేకుండా చేసింది ఎందుకు?. అని వారు గనుక బీజేపీకి ఒక ప్రశ్న వేస్తే సమాధానం ఇవ్వగలదా?

మీ కిట్లు వద్దు, మీ పూలజల్లాటలూ వద్దు. బీహార్ ఎన్నికలలో ఎంతమంది ముస్లిం అభ్యర్థులకు టికెట్ ఇస్తారో బహిరంగంగా చెప్పండి. అది చాలు. మీరు ఎన్నికలు మ్యానేజ్ చేసి గెలిచారన్నా అపవాదు కూడా పడదు. ఆ సాహసం బీజేపీ చేయలేదు. ఎందుకంటే పులి చారలు కప్పిపెట్టటానికి ఉపాయాలు పన్నచ్చు గానీ, దాని మచ్చలు శాశ్వతం.

ప్రొఫెసర్లు కావలెను

56 శాతానికి పైగా ఖాళీలు

ఐఐటీ, ఐఐఎం, ఎన్ఐటీ, ఐఐఎస్ఈఆర్‌లలో ఇదీ పరిస్థితి

ఫ్యాకల్టీ నియామక ప్రక్రియను వేగవంతం చేయాలి

ఉన్నత విద్యలో పారదర్శకత ఏదీ?

పార్లమెంటరీ ప్యానెల్ నివేదిక



న్యూఢిల్లీ : భారత్‌లోని ప్రతిష్టాత్మక ఐఐటీలు, కేంద్ర విశ్వ విద్యాలయాలు సహా ఉన్నత విద్యా సంస్థలలో ప్రొఫెసర్ పోస్టులు పెద్ద మొత్తంలో ఖాళీగా దర్శనమిస్తుండటం ఆందోళన కలిగిస్తున్నది. ఈ ప్రొఫెసర్ పోస్టులు 56.18 శాతం ఖాళీగా ఉన్నాయని పార్లమెంటరీ ప్యానెల్ నివేదిక గుర్తించింది. అయితే, విద్యాసంస్థల్లో ఈ సమస్యను పరిష్కరించటానికి ఫ్యాకల్టీ నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని ప్యానెల్ సిఫారసు చేసింది. విద్య, మహిళలు, పిల్లలు, యువత, క్రీడలపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ.. పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఉన్నత విద్యా శాఖ 2025-26 డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్ నివేదికలో అన్ని నియామక ప్రక్రియలు పారదర్శకంగా, మెరిట్ ఆధారితంగా, లక్ష్యంతో ఉండాలని సూచించింది. సమాన అవకాశాలు, వివక్షత లేని సూత్రాలకు కట్టుబడి ఉండాలని పేర్కొన్నది.

ఖాళీలు ఇలా...

ఈ నివేదిక ప్రకారం.. ఈ ఏడాది జనవరి 31 నాటికి ఐఐటీలు, ఎన్ఐటీలు, ఐఐఎంలు, ఐఐఎస్ఈఆర్‌లు, కేంద్ర విశ్వవిద్యాలయాలు, ఇతర ఉన్నత విద్యా సంస్థలలో మంజూరు చేయబడిన మొత్తం బోధనా అధ్యాపక పోస్టులు 18,940 కాగా.. ఇందులో 28.56 శాతం ఖాళీగా ఉన్నాయి. 11,298 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులలో (ఎంట్రీ లెవల్ పోస్టులు) 17.97 శాతం ఖాళీగా ఉన్నాయి. 5,102 అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులలో (మిడ్-లెవల్ పోస్టులు) 38.28 శాతం భర్తీ కాలేదు. 2,540 ప్రొఫెసర్ పోస్టులలో 56.18 శాతం ఖాళీగా ఉన్నాయి. "సాంకేతిక సంస్థలతో సహా ఉన్నత విద్యా సంస్థలలో ఖాళీలు ఉండటం అధ్యాపక-విద్యార్థి నిష్పత్తిని ప్రభావితం చేస్తుంది. బోధనా నాణ్యత తగ్గుతుంది" అని పార్లమెంటరీ కమిటీ పేర్కొన్నది.

శ్రామిక శక్తి విశ్లేషణ అవసరం

విద్యాసంస్థల ప్రభావవంతమైన పనితీరుకు బలమైన, సమర్థవంతమైన శ్రామిక శక్తి కీలకమని నొక్కి చెప్పింది. విద్యా మంత్రిత్వ శాఖ క్రమం తప్పకుండా శ్రామికశక్తి విశ్లేషణను నిర్వహించాలని సిఫారసు చేసింది. నియామక ప్రక్రియల్లో బాహ్య జోక్యాన్ని నివారించటానికి ఆన్‌లైన్ దరఖాస్తులు, స్క్రీనింగ్, కమ్యూనికేషన్ ను సులభతరం చేయటానికి సాంకేతికతను ఉపయోగించటం ప్రాముఖ్యతను కూడా నొక్కి చెప్పింది.

కేంద్ర విశ్వ విద్యాలయాల్లో రిజర్వ్‌డ్ పోస్టులు ఖాళీ

కేంద్ర విశ్వవిద్యాలయాల్లో భర్తీ కానీ రిజర్వ్‌డ్ ఫ్యాకల్టీ పోస్టులు గణనీయంగా ఉన్నాయని నివేదిక వివరించింది. ముఖ్యంగా, ఓబీసీల కోసం మంజూరు చేయబడిన 3,652 పోస్టులలో 1521 ఖాళీగా ఉన్నాయి. అలాగే, ఎస్సీల కోసం అలాట్ చేసిన 2315 పోస్టులలో 788, ఎస్టీలకు కేటాయించిన 1154 పోస్టులలో 472 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే, నాన్-టీచింగ్ సిబ్బంది కొరత గణనీయంగా ఉన్నదని నివేదిక వివరించింది. ఓబీసీలకు మంజూరు చేయబడిన 4495 పోస్టులలో 1983 ఖాళీగా ఉన్నాయి. ఎస్సీలకు కేటాయించిన 2013 పోస్టులలో 1011, ఎస్టీలకు మంజూరు చేసిన 3409 పోస్టులలో 1491 ఖాళీగా ఉన్నాయి.

శాశ్వత నియామకాలకు ప్రాధాన్యతనివ్వాలి

ఈ ప్రయత్నం ఫలితంగా గతేడాది డిసెంబర్ నాటికి 26,751 ఖాళీలు భర్తీ అయ్యాయి. వీటిలో 15,637 అధ్యాపక పోస్టులు ఉన్నాయి. వీటిలో 1949 ఎస్సీలకు, 771 ఎస్టీలకు, 3261 ఓబీసీలకు రిజర్వ్ చేయబడ్డాయి. అధ్యాపక పోస్టుల నియామక ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కమిటీ సిఫారసు చేసింది. కాంట్రాక్టు ఉద్యోగాలను దశలవారీగా తొలగించి, అర్హత కలిగిన అధ్యాపకులను శాశ్వత ఉద్యోగాలలో నియమించటానికి ప్రాధాన్యతనివ్వాలని వివరించింది. ఉద్యోగ భద్రత, న్యాయమైన వేతనాలను నిర్ధారించటానికి మంత్రిత్వ శాఖ ఒక నిర్మాణాత్మక ప్రణాళికను రూపొందించాలని కూడా సూచించింది.

కాంట్రాక్టు నియామకాలపై ఆందోళన

ఈ ఖాళీలను కాంట్రాక్టు, స్వల్పకాలిక నియామకాల ద్వారా భర్తీ చేసే పద్ధతిపై కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి చర్యలు ప్రభుత్వ ఉద్యోగాలలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్, పీడబ్ల్యూడీ, ఇతర అణగారిన వర్గాలకు రాజ్యాంగ నిబంధనలను అణగదొక్కకూడదని నొక్కి చెప్పింది. తాత్కాలిక నియామక పద్ధతులు విద్యాస్వేచ్ఛకు రాజీపడకూడదని హెచ్చరించింది. సంస్థాగత స్థాయి రిజర్వేషన్లను ప్రవేశపెట్టిన కేంద్ర విద్యా సంస్థల (టీచర్ల క్యాడర్‌లో రిజర్వేషన్) చట్టం, 2019 అమలును కమిటీ పరిశీలించింది. మిషన్ మోడ్‌లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ ఖాళీల బ్యాక్‌లాగ్‌ను తొలగించటానికి ప్రత్యేక నియామక డ్రైవ్‌లను ప్రారంభించాలని అన్ని కేంద్ర ఉన్నత విద్యా సంస్థలు (సీహెచ్ఈఐ) సూచించబడ్డాయని ప్యానెల్ పేర్కొన్నది.

ఆర్థిక, సామాజిక పోరాటాలే సీఐటీయూకి నిజమైన బలం

కార్పొరేట్, మతోన్మాదానికి వ్యతిరేకంగా రాజీలేని

(మొదటిపేజీ తరువాయి)

పట్టుదలతో కృషి చేస్తున్నది. కానీ.. పెట్టుబడిదారుల లాభాల కోసం కార్మికవర్గాన్ని కులం, మతం, ప్రాంతం, జాతి, భాష, లింగం లాంటి అంశాలను ముందుకు తెచ్చి వారి ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్నది. అయినప్పటికి సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా సీఐటీయూ రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్నది. శ్రామిక వర్గాన్ని ఐక్యం చేసేందుకు కృషి చేస్తున్నది. సీఐటీయూ నిబద్ధతతో తన సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తున్నది. పని ప్రదేశాల్లో చాపకింది నీరులా ఉన్న కుల అసమానతలను తొలగించేందుకు ఓపికతో వారిలో చైతన్యాన్ని పెంపొందిస్తుంది. నిరంతరాయంగా జరుగుతున్న ఈ ప్రక్రియతోపాటు ఈ నెల ఆరు నుంచి 14వరకు ప్రత్యేకంగా సామాజిక న్యాయ క్యాంపెయిన్ నిర్వహించాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ భావించిందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ తెలిపారు. ఈ నేపథ్యంలో నవతెలంగాణతో ఆయన పలు విషయాలు వెల్లడించారు.



కార్మిక వర్గ అనైక్యతే కారణాలేంటి?

కార్మిక వర్గం ఐక్యంగాకుండా ఉంటేనే పెట్టుబడిదారులకు లాభాల పంట పండుతుంది. పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తున్న పాలకులు, వారికి ఎలాంటి నష్టం రాకుండా సామ, దాన, భేద, దండోపాయాలతో కార్మిక వర్గాన్ని అణచివేస్తారు. విచ్ఛిన్నం చేస్తారు. ఇదిలా ఉంటే.. మొత్తం సమాజ ఐక్యతకే ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. రాజ్యాంగ రక్షణ, రిజర్వేషన్ల పరిరక్షణ, ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవటం, ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సామాజిక న్యాయం, మత సామరస్యం, ఫెడరలిజం వంటి రాజ్యాంగంలోని మూల స్తంభాల రక్షణ కోసం కార్మికవర్గం నిరంతరం పోరాడాల్సిన బాధ్యత పెరిగింది. ఆ మేరకు కార్మిక వర్గాన్ని సీఐటీయూ చైతన్యం చేస్తున్నది. నేటికి అనేక చోట్ల పని ప్రదేశాల్లో, భోజనశాలల్లో కులవివక్ష, అంటరానితనం కొనసాగుతున్నది. నివాస ప్రాంతాల్లో నేటికి పలు చోట్ల హోటళ్లలో రెండు గ్లాసుల పద్ధతి, గుడిలోకి రానివ్వకపోవడం, పండుగలు, ఉత్సవాల్లో దళితులను అంటరానివారుగా దూరం పెట్టటం పరిపాటిగా సాగుతున్నది. వారు చైతన్యాన్ని ప్రదర్శిస్తే భౌతిక దాడులకు పాల్పడటం నిత్యకత్యమయ్యాయి. రాష్ట్రంలో కుల దురహంకార హత్యల పరంపర కొనసాగుతూనే ఉంది. గ్రామ అభివృద్ధి కమిటీల పేరుతో సాంఘిక బహిష్కరణలు చోటుచేసుకుంటున్నాయి. వీటికి వ్యతిరేకంగా జరిగిన అన్ని పోరాటాల్లో కార్మికవర్గం అగ్రభాగాన నిలబడుతున్నది.

పని ప్రదేశాల్లో వివక్ష ఉన్నదా?

రాష్ట్రంలో నేటికీ పరిశ్రమల్లో, విద్యాలయాల్లో, పని ప్రదేశాల్లో చాప కింద నీరులా కులవివక్ష కొనసాగుతున్నది. దళితులు, గిరిజనులు, మహిళలు, మైనార్టీ ఉద్యోగులూ వివక్ష, దాడులకు గురవుతూనే ఉన్నారు. సమాజంలో ఉన్న వివక్ష, సహచర ఉద్యోగులు, కార్మికులు పాటిస్తున్న వివక్ష ఈ రెండింటినీ వారు అనుభవిస్తున్నారు. ప్రమోషన్లలో, రిజర్వేషన్ల అమలులో జరుగుతున్న లోపం వల్ల పదోన్నతులు దక్కడం లేదు. దళిత ఉద్యోగుల ఎడల రిజర్వేషన్ కేటగిరీ అంటూ చిన్న చూపు చూస్తున్నారు.

డ్యూటీ చేస్తున్న పని ప్రదేశాలు మధ్యాహ్నం భోజనం చేసే దగ్గర వివక్ష కొనసాగుతుంది. ప్రత్యేకంగా కార్మికుడి సామర్థ్యం, హోదా నుంచి కాకుండా వారి కులం ఆధారంగా గౌరవిస్తున్న అమానుష స్థితి ఉంది. పట్టణ ప్రాంతాల్లో దళిత ఉద్యోగ, కార్మికులకు ఇండ్లు అద్దెకు ఇవ్వకపోవటం శోచనీయం. పాఠశాలల్లో దళితులు మధ్యాహ్న భోజనం వంట చేస్తే అగ్రవర్ణ విద్యార్థులు తినకపోవడం లాంటి ఘటనలు జరుగుతున్నాయి. కుల వివక్ష, అంటరానితనం, కుల దురహంకార హత్యలు, సాంఘిక బహిష్కరణలు నిత్యకృత్యమయ్యాయి. రాష్ట్రంలో 128 కులదురంహకార హత్యలు జరిగాయి.

రిజర్వేషన్లను నిర్వీర్యం చేసే కుట్ర?

క్రమంగా పాలకులు రిజర్వేషన్లను నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తున్నారు. ప్రభుత్వరంగ సంస్థలను సమాధి చేస్తున్నారు. వాటిని ప్రయివేటీకరిస్తున్నారు. ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో ఉద్యోగ నియామకాలు చేపట్టటం లేదు. బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయటం లేదు. దీంతో దళిత, గిరిజన, బలహీన వర్గాలకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను నీరుగారుస్తున్నది. పేదలకు రాజ్యాంగం కల్పించిన అన్ని హక్కులను కాలరాస్తున్నది. రిజర్వేషన్లకు పాతరేస్తున్నది. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్లను అమల్లోకి తెచ్చింది. తద్వారా కార్మిక హక్కులను హరిస్తున్నది. యూనియన్ ఏర్పాటు చేసుకునే హక్కు సంఘటిత శక్తి, బేరసారాల హక్కులపై దాడి చేస్తున్నది. కార్పొరేట్ల లాభాలకు కార్మికవర్గాన్ని బలి చేస్తున్నది. నయా ఉదారవాద ఆర్థిక విధానాల అమలుతో పాటు మనువాద మతోన్మాద విధానాలను ఏకకాలంలో అమలు చేస్తున్నది.తద్వారా సామాజిక న్యాయానికి తూట్లు పొడుస్తున్నది.

సాధించుకున్న హక్కుల అమలు కోసం పోరాటం

జాతీయోద్యమ కాలంలోనూ, స్వాతంత్ర్యానంతర కాలంలోనూ దేశంలో కొనసాగుతున్న కుల వివక్ష, అంటరానితనం, అణచివేత, మూఢనమ్మకాలు, స్త్రీల హక్కులు, ఆర్థిక, సామాజిక దోపిడీ, పీడనల నుండి విముక్తి కోసం హక్కుల పరిరక్షణ కోసం ఎందరో మహనీయులు అశేష త్యాగాలు చేశారు. వారు చేసిన కృషి ఫలితంగానే, ఆయా తరగతులకు కొన్ని హక్కులు, చట్టాలు, సౌకర్యాలు లభించాయి. ఆర్థిక, సామాజిక రంగాల్లో అనేక విప్లవాత్మక మార్పులు సంభవించాయి. అంటరానితనం, అణచివేత, దోపిడీలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప సంఘ సంస్కర్తలు, సామాజికవేత్తలు, విప్లవకారులు, దోపిడీ రహిత సమసమాజ స్థాపనను కాంక్షించే కార్మికోద్యమ నేతల వర్ధంతులు, జయంతులు వరుసగా ఈ నెలలోనే రావడం విశేషం. ఈ నేపథ్యంలో సమసమాజ స్థాపనకోసం జీవితాంతం పోరాడిన కార్మికోద్యమ నేత బీటి రణదివె వర్ధంతి ఈ నెల ఆరు కాగా, 10న భారత మహిళా కార్మికోద్యమ నేత కామ్రేడ్ విమలా రణదివె జయంతి కావటం విశేషం. ఈ నెల 11న అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనలతో పాటు మహిళా ఉద్ధరణ, హక్కుల కోసం కృషి చేసిన జ్యోతిరావ్ ఫూలే జయంతి, 14న రాజ్యాంగ నిర్మాత, అంటరానితనం, బానిసత్వంపై పదునైన ఆయుధాన్ని ఎక్కుపెట్టిన డాక్టర్ బీఆర్. అంబేద్కర్ జయంతి కావటం విశేశం. వారి స్ఫూర్తితో ఆర్థిక, సామాజిక ఉద్యమాలను ఉధృతం చేసే లక్ష్యంతో 6 నుంచి 14 వరకు సామాజిక న్యాయ వారోత్సవాలను నిర్వహించాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ నిర్ణయించింది.

సంపాదకీయం

స్ఫూర్తిదాయకం

కేరళలోని వయనాడ్ జిల్లాలో గతేడాది కొండ చరియలు విరిగిపడి భారీ విపత్తు బారినపడ్డ బాధితులను ఆదుకునేందుకు కేరళ రాష్ట్ర ప్రభుత్వం టౌన్‌షిప్ నిర్మాణం చేపట్టడం బహు ప్రశంసనీయం. గతేడాది జులై 30న మండక్కై, చూరాల్‌మల సహా పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడి 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా.. అనేకమంది గల్లంతయ్యారు. ఈ విలయానికి 402 కుటుంబాలు సర్వస్వం కోల్పోయాయి. ఇళ్ల నిర్మించాలని కోరిన 242 కుటుంబాల్లో... 175 కుటుంబాలకు తొలి దశగా కాల్పెట్టలోని ఎల్‌స్టన్ ఎస్టేట్‌లో ప్రభుత్వం నిర్మించనున్న టౌన్‌షిప్‌నకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ గురువారం శంకుస్థాపన చేశారు. రెండో దశలో మరో 70 మంది లబ్ధిదారులకు ఇళ్లను లేదా పరిహారాన్ని, మిగిలిన వారు కోరుకున్న విధంగా ఆర్థిక సాయాన్ని అందిస్తారు. ఒక్కో ప్లాటుకు ఏడు సెంట్లు చొప్పున వెయ్యి చదరపు అడుగుల విస్తీర్ణంతో రెండు పడక గదులు, అటాచ్డ్ బాత్ రూం, లివింగ్ రూమ్, డైనింగ్ ఏరియా, వర్క్ ఏరియా, సిట్ అవుట్, స్టడీ రూమ్‌తో నిర్మించనున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణ వ్యయం సుమారు రూ.20 లక్షలు కావచ్చునని అంచనా! కేంద్రం ఆదుకోకపోయినా ప్రజలంతా ఐక్యంగా మానవతతో అందిస్తున్న సహాయ, సహకారాలే పునరావాస చర్యలను కొనసాగించడంలో తమ ప్రభుత్వానికి స్ఫూర్తినిస్తున్నాయని విజయన్ తెలిపారు. నిరుపేదలు మొదలు సంపన్న వ్యాపారుల వరకు ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి అండగా నిలుస్తున్నారని, చిన్నారులు సైతం తాము దాచుకున్న చిన్నచిన్న మొత్తాలను విపత్తు బాధితుల సహాయార్థం అందించి గొప్ప మానవత్వాన్ని ప్రదర్శించారని వివరించడం ద్వారా విపత్తు సమయంలోనూ, తదనంతరమూ బాధితులను ఆదుకోవడంలో ప్రజల పాత్రను విజయన్ విశదపరిచారు. మహా విపత్తులో బాధితుల కోసం పెద్ద ఎత్తున కొనసాగుతున్న పునరావాస పనులు కేరళ ప్రజల ఐక్యతకు గొప్ప ఉదాహరణ అని, ప్రజా చైతన్య స్ఫూర్తిని ఏ ప్రకృతి విపత్తూ ఓడించజాలదన్న పినరయి మాటలు ప్రత్యక్షర సత్యాలు. 'ప్రజలు మనతో ఉంటే అసాధ్యమంటూ ఏదీ ఉండదు. మనం మనుగడ సాగించగలం. ఇక్కడ కొనసాగుతున్న పునరావాస పనులు ఇచ్చే సందేశమిదే' అని విజయన్ అన్నారు. 'ఏ ఒక్క బాధితుడు ఒంటరిననే బాధతో ఉండరాదని, ఆ దిశగా ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకునేందుకు కృషి చేస్తోందని, కోల్పోయిన ఆప్తులనైతే తిరిగి తీసుకురాలేం కానీ వారిని అన్ని విధాల ఆదుకుంటామ'ని ఆ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి కె రాజన్ చెప్పడం బాధితుల గుండె నిండా భరోసా నిలుపుతుంది.



కేంద్రం మొండిచెయ్యి చూపించిన నేపథ్యంలో పునరావాస పనుల్లో ప్రజలు సహాయ సహకారాలు అందించేందుకు వీలుగా సీఎం ఒక స్పాన్సర్‌షిప్ పోర్టల్‌ను ప్రారంభించడం ముదావహం. స్పందించే ప్రజలు సహాయమందించడానికి, ఆ నిధుల నిర్వహణ పారదర్శకంగా ఉండడానికీ అది దోహదపడుతుంది. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్‌ఐ), నేషనల్ సర్వీస్ స్కీమ్ కింద పాఠశాల, కళాశాల విద్యార్థులు సేకరించిన నిధుల వివరాలను ముఖ్యమంత్రి వెల్లడించడం మరింతమంది దాతలకు స్ఫూర్తినిస్తుంది.

ప్రపంచ నలుమూలల నుంచి ప్రజలు వివిధ రూపాల్లో సాయం అందించగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి స్పందించే హృదయం లేకపోయింది. ఇప్పటివరకు చిల్లిగవ్వ సాయం కూడా అందించకపోవడం కమలనాథుల పాషాణ హృదయానికి నిలువుటద్దం. పునరావాసం కోసం కేంద్రం తన మూలధన పెట్టుబడి పథకం నుంచి దాదాపు రూ.529.50 కోట్ల రుణం మాత్రమే మంజూరు చేసింది. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలపట్ల కేంద్ర ప్రభుత్వం ఎంత వివక్షాపూరితంగా వ్యవహరిస్తుందో చెప్పడానికిది గొప్ప నిదర్శనం.

వరదలు, కోవిడ్ ఇలా ఒకదాని వెంబడి ఒకటి వరుసగా ఇబ్బందులు రావడంతో ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించేందుకు రాష్ట్రం పోరాడుతున్న సమయంలో సంభవించిన ఈ ప్రకృతి విపత్తును తట్టుకొని, ధీరోదాత్తంగా నిలబడడం స్ఫూర్తిదాయకం. కేంద్రం మొండిచెయ్యి చూపించిన నేపథ్యంలో పునరావాస పనుల్లో ప్రజలు సహాయ సహకారాలు అందించేందుకు వీలుగా సీఎం ఒక స్పాన్సర్‌షిప్ పోర్టల్‌ను ప్రారంభించడం ముదావహం. స్పందించే ప్రజలు సహాయమందించడానికి, ఆ నిధుల నిర్వహణ పారదర్శకంగా ఉండడానికీ అది దోహదపడుతుంది.

కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్‌ఐ), నేషనల్ సర్వీస్ స్కీమ్ కింద పాఠశాల, కళాశాల విద్యార్థులు సేకరించిన నిధుల వివరాలను ముఖ్యమంత్రి వెల్లడించడం మరింతమంది దాతలకు స్ఫూర్తినిస్తుంది. శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ 'రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం భవితపై బాధితులందరికీ గొప్ప ఆశను కలిగిస్తోందని' కొనియాడడం కొసమెరుపు!

మెకార్థీయిజం వైపుగా...



ప్రభాత్ పట్నాయక్

ప్రస్తుతం ట్రంప్ ప్రభుత్వం స్వేచ్ఛగా భావాలను వ్యక్తం చేస్తున్నవారిని అణగదొక్కుతున్న తీరుచూస్తుంటే 1950 దశకంలో సెనేటర్ జోసెఫ్ మెకార్థీ నాయకత్వంలో ప్రజాస్వామ్యవాదులపై సాగిన వికృతమైన వేట గుర్తుకొస్తోంది. ఆ వేటలో ఒక తరానికి చెందిన మేధావులపై, కళాకారులపై కమ్యూనిస్టులన్న ముద్ర వేసి వారిని బలిపశువుల్ని చేశారు. అంతే కాదు. దాని ప్రభావం అమెరికా దేశపు సృజనాత్మక జీవితాన్ని దశాబ్దాలపాటు దెబ్బతీసింది. డేనియల్ హామ్మెట్, డాల్టన్ ట్రంబో, బెర్టోల్ట్ బ్రెక్ట్, చార్లీ చాప్లిన్ వంటి ప్రముఖ కళాకారులు, రచయితలు, లారెన్స్ క్లీన్, రిచర్డ్ గుడ్విన్, ఇ.హెచ్ నార్మన్, డేనియల్ థార్నర్, మోసెస్ ఫిన్లే, ఒవెన్ లాట్టిమోర్ వంటి విద్యావేత్తలనే గాక, అణుబాంబును తయారు చేయడం కోసం అమెరికా తలపెట్టిన మాన్‌హటన్ ప్రాజెక్టుకు నాయకత్వం వహించిన రాబర్ట్ ఒపెన్ హీమర్, జె.ఎం.కీన్స్‌తో కలిసి బ్రెట్టన్‌వుడ్ సంస్థలను స్థాపించడంలో ముఖ్య పాత్ర పోషించిన హారీ డెక్స్టర్ వైట్ వంటి వారిని సైతం మెకార్థీయిజం బలి తీసుకుంది. అమెరికాలో కమ్యూనిజం వ్యాప్తి కోసం సాగిన ప్రయత్నాలపై శోధించడానికి ఏర్పాటు చేసిన పలు కమిటీల ముందు వీరంతా హాజరై తమ సంజాయిషీలను ఇచ్చుకోవలసిన స్థితి ఏర్పడింది.

ఈ విధంగా నిరాధారమైన అనుమానాల ప్రాతిపదికన సాగిన వేధింపుల, అణచివేతల పర్యవసానంగా అమెరికా చాలా భారీగా కోల్పోయింది. మెకార్థీయిజం కారణంగా తూర్పు, ఆగ్నేయ ఆసియా దేశాల మీద విశేష పరిజ్ఞానం ఉన్న మేధావులను అమెరికా కోల్పోయింది కనుకనే ఆ దేశం వియత్నాం యుద్ధంలో ఇరుక్కుని చేదు అనుభవాలను చవి చూడవలసి వచ్చిందని కొందరు విమర్శకులు భావించారు. ఆ మేధావులనే గనుక కాపాడుకుని వున్నట్లయితే అమెరికా వియత్నాం ఊబిలో కూరుకుపోయి వుండేదికాదని వారు అభిప్రాయపడ్డారు. అప్పటి మెకార్థీయిజంతో పోల్చి ప్రస్తుతం ట్రంప్ చేపడుతున్న వేధింపు చర్యలూ అదేమాదిరిగా ఉన్నాయని చాలామంది భావిస్తున్నారు. కొలంబియా యూనివర్సిటీ ప్రొఫెసర్ బ్రూస్ హిగ్గిన్స్ ఈ అభిప్రాయాన్ని బలంగా వినిపిస్తున్నారు. కేవలం కొద్దిపాటి కేసుల్లో అరెస్టులు, స్వదేశాలకు తిప్పి పంపడాలు వంటివి జరిగినంత మాత్రాన ఏకంగా మెకార్థీయిజం తిరిగి వచ్చేసిందని భావించడం అతిగా చూడడమే అని మొదట అనిపించవచ్చు. పైగా ఇప్పటివరకూ ట్రంప్ ప్రభుత్వం తన దాడులకు అక్ష్యాలుగా అమెరికా పౌరులు కానివారిని మాత్రమే ఎంచుకుంది. కాని మెకార్థీ యిజం అమలు జరిగిన కాలంలో విదేశీయులే కాకుండా, అమెరికన్ పౌరులు కూడా దాని దాడులకు గురయ్యారు.

ట్రంప్ ప్రభుత్వం మెకార్థీయిజం కన్నా ఘోరంగా ఉండే విధానాలను చేపడుతోంది. ఇందుకు ఒక నిదర్శనం ట్రంప్ ప్రభుత్వం అక్కడి యూనివర్సిటీల మీద సాగిస్తున్న పెత్తనం. పూర్తిగా రాజ్యాంగ విరుద్ధంగా, యూనివర్సిటీల స్వయంప్రతిపత్తి మీద దాడికి పూనుకుంది. తమ ప్రభుత్వం చెప్పినట్టు నడుచుకోకపోతే కొలంబియా విశ్వవిద్యాలయానికి కేంద్ర ప్రభుత్వం నుంచి రావలసిన 450 మిలియన్ల డాలర్ల నిధులను నిలిపివేస్తామని బెదిరించింది. ఆ ఒత్తిడికి కొలంబియన్ యూనివర్సిటీ ఎట్టకేలకు తలొగ్గింది. ఈ విధంగా యూనివర్సిటీల అకడెమిక్ కార్యకలాపాలను, వాతావరణాన్ని కేంద్ర ప్రభుత్వ వైఖరికి అను కూలంగా తప్పనిసరిగా ఉండేలా చేయడం వలన అవన్నీ ప్రభుత్వ సంస్థలుగా మాత్రమే వ్యవహరించేలా దిగజారుతాయి. అక్కడ సృజనాత్మకతకు, విమర్శనాత్మక చర్చలకు ఇక తావు ఉండదు. ట్రంప్ విధానాలు ఈ కోణం నుండి చూసినప్పుడు మెకార్థీయిజం కన్నా మరో అడుగు ముందుకెళ్లాయి.

అయితే, ఇలా సర్దిచెప్పుకున్నంత మాత్రాన అంతా బాగానే ఉందనుకోలేం. ప్రస్తుతానికి మహమ్మద్ ఖలీల్ కేసు ఒక్కటిగానే కనిపించవచ్చు. కాని అటువంటి కేసులు వేలాదిగా తలెత్తే పరిస్థితి ఉంది. మహమ్మద్ ఖలీల్ ఒక అమెరికన్ విద్యార్థి. అతడికి గ్రీన్‌కార్డు ఉంది. అమెరికన్ పౌరురాలిని అతడు వివాహం చేసుకున్నాడు. అమె ఎనిమిదో నెల గర్భంతో ఉంది. కాని ఖలీల్‌ని అరెస్టు చేశారు. అతడిని స్వదేశానికి తిప్పి పంపేయబోతున్నారు. గాజా భూభాగం మీద సాగిన జాతి హన నాన్ని ఖండిస్తూ కొలంబియా విశ్వవిద్యాలయంలో జరిగిన ప్రదర్శనకు నాయకత్వం వహించడమే ఖలీల్ చేసిన నేరం అని ఆరోపిస్తున్నారు. ఇలా మొదట గ్రీన్ కార్డులు ఉన్నవారిని లక్ష్యంగా చేసుకుని తిప్పి పంపేయడం పూర్తయిన తర్వాత నిరసన ప్రద ర్శనల్లో పాల్గొన్న అమెరికన్ పౌరుల వంతు వస్తుంది. "విదేశీ ఉగ్రవాదాన్ని" సమర్థించినందుకు వానీ శిక్షిస్తారు. స్వేచ్ఛగా తమ భావాలను, నిరసనలను వ్యక్తం చేసినందుకు కొందరిపై వేధింపులకు, అణచివేతలకు పూనుకోవడం ఒకసారి మొదలయ్యాక ఆ అణచివేతలు ఏదో ఒక్క సెక్షన్ ప్రజానీకానికే పరిమితం అవుతాయని అనుకుని స్థిమితపడలేం. అందుచేత అమెరికాలో మెకార్థీయిజం తరహాలో అణచివేతలు, వేధింపులు మొదలయ్యాయని మనం భావించడంలో తప్పు లేదు.

వాస్తవానికి ప్రస్తుతం సాగుతున్న అనుమానితుల వేట ఆ నాడు సెనేటర్ జోసెఫ్ మెక్‌కార్థీ సాగించిన దాని కన్నా ఎక్కువ దుర్మార్గంగా ఉంది. ఇప్పుడు ఖలీల్ కేసులో అమెరికన్ ప్రభుత్వం 1952లో చేసిన 'ఇమ్మిగ్రేషన్ అండ్ నేషనాలిటీ యాక్ట్' లోని క్లాజులను ఉపయోగించడానికి తయారైంది. 'అమెరికాలో నివసించే ఏ విదేశీయుడైనా చేపట్టే కార్యకలాపాల వలన అమెరికా విదేశాంగ విధానం మీద ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని అమెరికా హోం శాఖ కార్యదర్శి భావిస్తే అటు వంటి వ్యక్తిని వెంటనే అమెరికా నుండి వెనక్కి పంపేయవచ్చు' అని ఆ చట్టంలో ఉంది. దాని ప్రకారం ఏ విదేశీయుడైనా, అతడికి లేదా ఆమెకు వీసా ఉన్నా, గ్రీన్ కార్డు ఉన్నా సరే అమెరికన్ ప్రభుత్వం అనుసరించే విదేశాంగ విధానాన్ని విమర్శిం చడానికి వీలు లేదు. ప్రస్తుతం ఖలీల్ కేసులో అతడు హమాస్ అనే 'ఉగ్రవాద' సంస్థతో సంబంధాలు కలిగివున్నట్టు ఆరోపిస్తున్నారు. అలా ఆరోపించడానికి వాళ్ల వద్ద ఏ ఆధారాలూ లేవు. దానితోబాటు ఖలీల్ 'యూదు వ్యతిరేకత'ను ప్రదర్శిస్తున్నాడని ఆరోపిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడైనా యూదు వ్యతిరేకత వ్యక్తం అయితే దానిపై అమెరికా పోరాడేందుకు కంకణం కట్టు కుంది. ఇప్పుడు ఇజ్రాయిల్ గాజాలో సాగిస్తున్న దారుణ మారణ కాండను గనుక విమర్శిస్తే అది 'యూదు వ్యతిరేకత'గా పరిగణి ంచడం జరుగుతుంది. దానివల్ల అమెరికా విదేశాంగ విదానానికి ఇబ్బంది కలుగుతుంది. అందుకే ఖలీల్‌ను వెనక్కి పంపే యాలని నిర్ణయించారు. ఖలీల్ మాదిరిగా ఎవరైనా అమెరికన్ పౌరుడు గనుక వ్యవహరిస్తే, ఇజ్రాయిల్-వ్యతిరేక ప్రదర్శనల్లో పాల్గొంటే, వాళ్లు కూడా అమెరికా విదేశాంగ విధానానికి భంగకరంగా నడుచుకున్నట్టే అవుతుంది. (అమెరికా విదేశాంగ విధానం అంటే ఇక్కడ ప్రపంచవ్యాప్తంగా అమెరికా సాగించే సామ్రాజ్యవాద పెత్తనం అని మనం గ్రహించాలి.). అప్పుడు అతడిని, అమెరికన్ పౌరుడు అయినప్పటికీ, నిర్బంధంలోకి తీసుకుంటారు.

అంటే, ఇప్పుడు కొనసాగుతున్న అనుమానితుల వేట ఆనాడు జోసెఫ్ మెకార్థీ సాగించిన వేట కన్నా చాలా విస్తృతంగా సాగుతోంది. ఈ వేట కేవలం కమ్యూనిస్టులకు మాత్రమే పరిమితం అయినది కాదు. అమెరికా విదేశాంగ విధానాన్ని విమర్శిం చడానికి సాహసించినవారు ఎవరైనా వారందరినీ వేటాడుతుంది. పశ్చిమాసియా ప్రాంతంలో ఇజ్రాయిల్ వలసదారులు సాగి స్తున్న దురాక్రమణ విధానాన్ని ప్రశ్నించేవారందరినీ లక్ష్యంగా చేసుకుంటుంది.

మెకార్థీయిజం ప్రచ్ఛన్న యుద్ధం (కోల్డ్‌వార్) కాలంలో ముందుకొచ్చింది. రెండవ ప్రపంచ యుద్ధం అనంతరం సోవియట్ యూనియన్ ప్రతిష్ట ప్రపంచవ్యాప్తంగా పెరిగింది. సోషలిస్టు భావాలకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరిగింది. ఆ యుద్ధంలో సోవియట్ యూనియన్ చాలా నష్టపోయింది. తన



దేశాన్ని మళ్ళీ పునర్నిర్మించుకోవాలన్నదే ప్రధాన లక్ష్యంగా అది పరిగణించింది. కాని సోవియట్ యూనియన్ ప్రతిష్టను దెబ్బ తీయడమే లక్ష్యంగా చేసుకున్న అమెరికన్ సామ్రాజ్యవాదం తీవ్ర స్థాయిలో దుష్ప్రచారానికి పూనుకుంది. సోవియట్ యూనియన్‌కు విస్తరణ కాంక్ష ఉందని, ఆ విస్తరణను అడ్డుకోవడమే తన లక్ష్యం అని ప్రచారం చేసింది. అంటే మెకార్థీయిజం అనేది ఒకానొక ప్రత్యేక పరిస్థితిలో సామ్రాజ్యవాదం అనుసరించిన వ్యూహంలో భాగంగా ముందుకొచ్చింది. కాని ఇప్పుడు అమెరికా ఆధిపత్యాన్ని కాని, సామ్రాజ్యవాదాన్ని కాని ప్రత్యేకంగా ఏ దేశమూ, ఏ శక్తీ సవాలు చేయడం లేదు. అమెరికాయే ప్రపంచంలో పలు దేశాల ప్రభుత్వాల సార్వభౌమాధికారాన్ని దెబ్బ తీసేందుకు దూకుడుగా వ్యవహరిస్తోంది. అనేక దేశాలు నయా ఉదారవాద విధానాల పర్యవసానంగా తలెత్తిన సంక్షోభంలో చిక్కుకున్నాయి. వాటికి ఆ సంక్షోభం నుంచి బయటపడే దారి తోచడం లేదు. వారిపై మోపబడ్డ ఆర్థిక దిగ్బంధనాల నుండి విమోచన కోరుకుంటున్నారు. ఈ పరిస్థితికి సామ్రాజ్యవాద దోపిడీయే కారణం. అయితే, ఆ దేశాలను సంక్షోభం నుండి బైటకు తేగల మార్గం ఏదీ సామ్రాజ్యవాదం దగ్గర లేదు. నయా ఉదారవాద విధానాల దివాళాకోరుతనానికి ఇది నిదర్శనం. దీనిని కప్పి పుచ్చుకోడానికి అమెరికా తన విమర్శకులందరి నోళ్ళు మూయించడానికి తంటాలు పడుతోంది.

ట్రంప్ ప్రభుత్వం మెకార్థీయిజం కన్నా ఘోరంగా ఉండే విధానాలను చేపడుతోంది. ఇందుకు ఒక నిదర్శనం ట్రంప్ ప్రభుత్వం అక్కడి యూనివర్సిటీల మీద సాగిస్తున్న పెత్తనం.

ఈ నయా ఉదారవాద సామ్రాజ్యవాద ప్రభుత్వాలన్నీ రాను రాను మరింత నియంతృత్వ రూపాన్ని సంతరించుకుంటున్నాయి. నయా ఫాసిస్టుల పాలనలో ఉన్న దేశాలలో భావప్రకటనా స్వేచ్ఛపై దాడి తీవ్ర స్థాయిలో జరుగుతోంది. అదే సమయంలో ఉదారవాదులని చెప్పుకునే బూర్జువా ప్రభుత్వాలు ఉన్న చోట కూడా పరిస్థితి భిన్నంగా లేదు. ఆ ప్రభుత్వాలు తమ సైనిక వ్యయాన్ని పెంచుకుపోతున్నాయి. తన ప్రభుత్వం సైనిక వ్యయాన్ని పెంచుకోడానికి వీలుగా బడ్జెట్ లో ద్రవ్యలోటుపై ఉన్న పరిమితిని ఎత్తివేస్తూ జర్మనీ ఇటీవల చట్టం చేసింది. ఫ్రాన్స్, బ్రిటన్ కూడా తమ సైనిక వ్యయాలను పెంచుకుపోతున్నారు. ఈ విధంగా ప్రపంచాన్ని అణచివేయడానికి సైనిక వ్యయాన్ని పెంచుకుపోయే ధోరణి సంపన్న పెట్టుబడిదారీ దేశాల్లో వ్యక్తం కావడం రెండవ ప్రపంచయుద్ధం తర్వాతకాలంలో ఎన్నడూ లేదు. ఇది ప్రపంచ ప్రజలందరికీ పెనుముప్పుగా పరిణమించగలదు.

పూర్తిగా రాజ్యాంగ విరుద్ధంగా, యూనివర్సిటీల స్వయంప్రతిపత్తి మీద దాడికి పూనుకుంది. తమ ప్రభుత్వం చెప్పినట్టు నడుచుకోకపోతే కొలంబియా విశ్వవిద్యాలయానికి కేంద్ర ప్రభుత్వం నుంచి రావలసిన 450 మిలియన్ల డాలర్ల నిధులను నిలిపివేస్తామని బెదిరించింది. ఆ ఒత్తిడికి కొలంబియన్ యూనివర్సిటీ ఎట్టకేలకు తలొగ్గింది. ఈ విధంగా యూనివర్సిటీల అకడెమిక్ కార్యకలాపాలను, వాతావరణాన్ని కేంద్ర ప్రభుత్వ వైఖరికి అను కూలంగా తప్పనిసరిగా ఉండేలా చేయడం వలన అవన్నీ ప్రభుత్వ సంస్థలుగా మాత్రమే వ్యవహరించేలా దిగజారుతాయి. అక్కడ సృజనాత్మకతకు, విమర్శనాత్మక చర్చలకు ఇక తావు ఉండదు. ట్రంప్ విధానాలు ఈ కోణం నుండి చూసినప్పుడు మెకార్థీయిజం కన్నా మరో అడుగు ముందుకెళ్లాయి.

ఇప్పుడు మనం చూస్తున్నది స్వేచ్ఛా భావనల మీద నయా ఉదారవాదం సాగిస్తున్న దాడిని. ఈ దాడి 1950ల నాటి మెకార్థీయిజం కన్నా విస్తృతమైనది. నయా ఫాసిస్టు శక్తుల పాలనలో లేని తక్కిన సామ్రాజ్యవాద వేశాలలో సైతం మనం భావ ప్రకటన మీద, విమర్శ మీద దాడులను చూస్తున్నాం. యూరప్‌లో ఇప్పుడు రష్యా విస్తరణవాదం గురించి బాజాలు మోగిం చేస్తున్నారు. వాస్తవానికి విస్తరణకు పూనుకున్నది నాటో దేశాలు. రష్యా సరిహద్దుల మీద మోహరించినవి నాటో సైన్యాలు. లిథువానియా సరిహద్దుల్లో మోహరించినవి జర్మన్ సైన్యాలు. కాని రష్యా దురాక్రమణకు పూనుకుంటోందని ప్రచారం చేస్తున్నారు. ఇంకోపక్క ఈ యూరోపియన్ సామ్రాజ్యవాద వేశాలన్నీ గాజా మీద ఇజ్రాయిల్ సాగిస్తున్న దుర్మార్గాలను పూర్తి స్థాయిలో బలపరుస్తున్నాయి. ఇజ్రాయిల్‌ను విమర్శించేందుకు ఎవరైనా ముందుకొస్తే వారిని "యూదు వ్యతిరేకులు" అని ముద్ర వేసి అణచివేస్తున్నాయి. జర్మనీలో అధికారికంగానే గాజాలో జరుగుతున్న మారణకాండ గురించిన చర్చ ఏ సమావేశాల్లోనూ జరపరాదని నిషేధించారు.

ఈ నయా ఉదారవాద సామ్రాజ్యవాద ప్రభుత్వాలన్నీ రాను రాను మరింత నియంతృత్వ రూపాన్ని సంతరించు కుంటున్నాయి. నయా ఫాసిస్టుల పాలనలో ఉన్న దేశాలలో భావప్రకటనా స్వేచ్ఛపై దాడి తీవ్ర స్థాయిలో జరుగుతోంది. అదే సమయంలో ఉదారవాదులని చెప్పుకునే బూర్జువా ప్రభుత్వాలు ఉన్న చోట కూడా పరిస్థితి భిన్నంగా లేదు. ఆ ప్రభుత్వాలు తమ సైనిక వ్యయాన్ని పెంచుకుపోతున్నాయి. తన ప్రభుత్వం సైనిక వ్యయాన్ని పెంచుకోడానికి వీలుగా బడ్జెట్ లో ద్రవ్యలోటుపై ఉన్న పరిమితిని ఎత్తివేస్తూ జర్మనీ ఇటీవల చట్టం చేసింది. ఫ్రాన్స్, బ్రిటన్ కూడా తమ సైనిక వ్యయాలను పెంచుకు పోతున్నారు. ఈ విధంగా ప్రపంచాన్ని అణచివేయడానికి సైనిక వ్యయాన్ని పెంచుకుపోయే ధోరణి సంపన్న పెట్టుబడిదారీ దేశాల్లో వ్యక్తం కావడం రెండవ ప్రపంచయుద్ధం తర్వాతకాలంలో ఎన్నడూ లేదు. ఇది ప్రపంచ ప్రజలందరికీ పెనుముప్పుగా పరిణమించగలదు.

(స్వేచ్ఛానుసరణ)

ఆటీజం థెరపి కేంద్రాల బాధ్యత సర్కారుదే..



ఆటీజంను ఆటీజం స్పెక్ట్రమ్ డిజార్డర్ (ఏఎస్‌డి) అని కూడా పిలుస్తారు.ఆటీజం మెదడు అభివృద్ధి చెంద డంలో వచ్చే సమస్యల వలన ఏర్పడే వైకల్యం. ఆటీజం కలిగిన వ్యక్తులు నిత్యాజీవితంలో జరుగుతున్న పరిణామాలను అర్థం చేసుకోవడంతో పాటు ప్రజలతో కలిసి మెలిసి ఉండలేకపోతారు. 2007 డిసెంబర్ 18న జరిగిన ఐక్య రాజ్య సమితి సాధారణ సమావేశం ఏప్రిల్ 2ని అంతర్జాతీయ ఆటీజం అవేర్ నెస్‌డేగా ప్రకటించింది. 2008 నుండి ప్రతి ఏడాది ఏప్రిల్ 2న ఆటీజం అవేర్‌నెస్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు..న్యూరో డైవర్సిటీని గుర్తించడం, ప్రోత్సహించడం అనే లక్ష్యన్ని ఐక్య రాజ్యా సమితి 2025 ప్రపంచ ఆటీజం అవగాహనా దినోత్సవం థీమ్‌గా ప్రకటించింది.

1912 సంవత్సరంలో స్విస్ మనోరోగి వైద్యుడు పాల్ బ్లీలర్ జర్మనిలో అటిస్మస్‌గా గుర్తించారు. దీన్ని ఆంగ్లంలో ఆటీజంగా అను వాదించారు. అటిజం అనేది పిల్లల్లో వయస్సుకు తగ్గ మానసిక పరమైన ఎదుగుదల రాకుండా ఉండే ఒక పరిస్థితి. ఇది వాస్తవానికి ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ (ఎఎస్‌డి)లో భాగం. ఆటిజం ఉన్న పిల్లలు ఆలస్యంగా మాట్లాడడం, మాటలు పునరావృతం చేయడం, ఇతరులతో మాట్లాడడంలో ఇబ్బంది పడుతుంటారు. ఆటీజం కలిగిన పిల్లల్లో ఇంద్రియ సున్నితత్వాలు సాధారణంగా ఉంటాయి. ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ ఉన్న వ్యక్తులు తరచుగా రొటీన్ మరియు ప్రిడిక్టిబిలిటీపై ఆధారపడతారు. వారి రోజువారీ పనులకు అంతరాయం కలిగితే ఇబ్బంది పడుతుంటారు.ఆటీజం కలిగిన వారు ఇతరుల మాదిరిగానే అనుకున్న లక్ష్యాలను సాధించే సామర్థ్యం కలిగి ఉంటారు.2023లో విడుదలైన సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సిడిసి) రిపోర్ట్ ప్రకారం చూస్తే 36 మంది పిల్లల్లో ఒకరు ఆటిజం వ్యాధితో బాధపడుతున్నారు.గతంలో ప్రతి 44 మందిలో ఒక్కరికి ఆటీజం ఉండేది.ఆటీజం కలిగిన పిల్లల ఇబ్బందులను అర్థం చేసుకోవడం చాలా కష్టంతో కూడుకున్నది.ఆటీజం కలిగిన పిల్లలకు సామాజిక సమస్యలతో పాటు భద్రత, గౌరవం కల్పించడం కష్ట సాధ్యంగా ఉంటుంది. పుట్టిన పిల్లలు 18 నెలల వయస్సు వచ్చేట ప్పటికి వారిలోని తప్పులను తల్లిదండ్రులు గుర్తిస్తారు.రెండేండ్ల వయస్సు వరకు సాధారణంగానే కన్పించిన తరువాత ఇతరులను గుర్తించక పోవడం, మాట్లాడలేక పోవడం వంటివి కన్పిస్తాయి.

ప్రపంచంలో ఖాతార్ దేశంలో అత్యధికంగా ఆటీజం ఉంది. అత్యాల్పంగా ఆటీజం ఉన్న దేశం ఫ్రాన్స్. ప్రపంచంలోనే ఫ్లోరిడా దేశంలో ఆటీజం వ్యాధి అత్యధికంగా నిర్ధారణ అవుతుంది. ప్రపంచ జనాభాలో 1శాతం మందికి ఆటీజం వ్యాధి ఉంది.2000 సంవత్సరం నుండి ప్రతి యేటా ఆటీజం వ్యాధి ప్రాబల్యం పెరుగుతున్నది.ఆటిజం అనేది ఆడపిల్లల కంటే అబ్బాయిలలో ఎక్కువగా నిర్ధారణ అవుతుంది, దాదాపు 4:1 మగ-ఆడ నిష్పత్తి ఉంటుంది. ఈ లింగ భేదానికి కారణాలు పూర్తిగా స్పష్టంగా లేవు. గడిచిన పదేండ్లకాలంలో 11.16 లక్షల మంది పిల్లలు పాఠశాలల్లో ఆటీజం వ్యాధికి అవసరమైన సేవలు పొందడం లేదు. ఆటీజం కలిగిన వారిలో 75శాతం మంది పెద్దలు ఉపాధి పొందడం లేదు. 25 ఏండ్ల లోపు వయస్సు కలిగిన వారిలో 50 శాతం మంది ఉద్యోగం చేయలేకపోతున్నారు. ఆటీజంతో బాధపడుతున్న ప్రతి పది మందిలో 8మంది జీవిత కాలంలో మానసిక ఆరోగ్య సమస్యలను కలిగి ఉంటున్నారు. ఆటీజం కలిగిన వారిలో సాధారణ ప్రజలతో పోల్చితే నాలుగు రేట్లు ఎక్కువగా నిరాశకు గురవుతున్నారు. ఆటీజం వ్యాధి కలిగిన యువకులు మూడింట ఒక్క వంతు మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అమెరికాలో ఆటీజం వ్యాధి కలిగిన వారి ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం సుమారుగా 461 బిలియన్ డాలర్స్ ఖర్చు పెడుతుందని అంచనా.

భారతదేశంలో సుమారు 18 లక్షల మంది వ్యక్తులు ఆటిజం సమస్యతో బాధపడుతున్నారు. ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ రెండు నుండి తొమ్మిది సంవత్సరాల వయస్సు గల పిల్లలలో 1 నుండి 1.5 శాతం వరకు ఉంటుంది. సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ ఆటిజం అండ్ డెవలప్‌మెంటల్ డిజేబిలిటీస్ మానిటరింగ్ (ఎడిడిఎం) నెట్‌వర్క్ అందించిన అంచనాల ప్రకారం, సుమారు 36 మంది పిల్లల్లో ఒకరు ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్‌తో బాధపడుతున్నారు.2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ఆటీజంను అంగవైకల్యంగా గుర్తించినప్పటికి వైకల్య ధ్రువీకరణ పత్రాలు జరిచేయడం లేదు. నేషనల్ ట్రస్ట్ ద్వారా ఆటీజం కలిగిన వారి సంక్షేమనికి కృషి చేయాల్సిన ఉన్న అమలవ్వడం లేదు.రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆటీజం వేగంగా వ్యాప్తి చెందుతున్నది. ప్రభుత్వ రంగలో ఆటీజం వ్యాధి కలిగిన వారికి మెరుగైన సౌకర్యాలు, వైద్యమందడం లేదు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆటీజం కలిగిన వారికి వైకల్య ధ్రువీకరణ పత్రాలు హైదరాబాద్ నగరంలోని నీలోఫర్ హాస్పి టల్లో మాత్రమే జారీ చేయాలని నిర్ణయం చేయడం వలన జిల్లాల నుండి వచ్చే వారికి తీవ్రమైన ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంటుంది. జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలల్లో ఆటీజం వ్యాది రుగ్మాతకు అవసరం అయిన వైద్యం అదించేందుకు చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వమే ప్రతి జిల్లా, నియోజకవర్గ కేంద్రంలో ఆటీజం రుగ్మాత కలిగిన వారికి థెరపి కేంద్రాలను ఏర్పాటు చేయాలి. సర్వశిక్ష అభియాన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ఆటీజం కలిగిన పిల్లలను గుర్తించేందుకు ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలి. ప్రయివేట్ రంగంలో ఉన్న ఆటీజం, చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్స్, చైల్డ్ గైడెన్స్ సెంటర్లపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలి. క్వాలిఫైడ్ థెరపిస్టులను నియమించని థెరపి కేంద్రాలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

(ఏప్రిల్ 2న అంతర్జాతీయ ఆటీజం అవేరెనెస్ డే)

- యం అడివయ్య, 9490098713

మహిళలపై హింస- మానవ హక్కుల ఉల్లంఘన



నాదెండ్ల శ్రీనివాస్
9676407140

మహిళలపై జరుగుతోన్న హింస ప్రపంచంలోనే అత్యంత పెద్ద ఎత్తున సాగుతోన్న మానవ హక్కుల ఉల్లంఘన అంటోంది ఐక్యరాజ్య సమితి.ప్రతి పదకొండు నిమిషాలకు ఓ మహిళ లేదా బాలిక మరణం ఆమె సన్నిహితుల చేతుల్లోనే జరుగుతోందంటున్నాయి ఐరాస నివేదికలు. మహిళలపై అనేక రూపాల్లో జరిగే హింసలో అంతగా చర్చకు రానిది మాతృత్వ హింస. భారతదేశంలో అనవసరమైన సిజేరియన్ ఆపరేషన్లు ఆందోళనకర స్థాయికి పెరిగాయి. దీనివల్ల గౌరవప్రదమైన మాతృత్వ హక్కు ప్రమాదంలో పడుతున్నది.మద్రాసు ఐఐటి జరిపిన ఒక పరిశోధన ప్రకారం ప్రయివేటు ఆస్పత్రులలో సిజేరియన్ ప్రసవాలు 40.9శాతం నుండి 47.4 శాతానికి 6.5శాతం పెరిగాయి. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం అసోం,ఒడిశా,తెలంగాణ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోని ప్రయివేటు ఆసుపత్రులలో ఇవి 70శాతాన్ని మించిపోయాయి.సిజేరియన్ ప్రాణ రక్షక చికిత్స.కానీ అనవసరపు సిజేరియన్ వల్ల తల్లీబిడ్డలకు పలు సమస్యలు ఎదురవుతాయి.రక్తం కోల్పో వడం,ఇన్‌ఫెక్షన్, కోలుకోవడానికి ఎక్కువ రోజులు పట్టడం,బిడ్డలకు పాలివ్వడంలో ఆలస్యం, తర్వాత గర్భధారణలో సమస్యలు వంటివి.ప్రతి వైద్యశాలలో గతేడాది సిజేరియన్ ప్రసవాల శాతాన్ని నోటీసు బోర్డుపై ప్రదర్శించాలన్న నిబంధన విధిస్తే ఈ అంశంపై గర్భవతి విజ్ఞతతో కూడిన నిర్ణయం తీసుకొనే అవకాశం కలుగుతుంది. అయితే మహిళలపై భౌతికంగానే కాదు ఆన్‌లైన్‌లోనూ వేధింపులు పెరుగుతున్నాయి.కట్టూ,బొట్టూ,నడత అన్నింటినీ జడ్జ్ చేస్తూ ట్రోలింగ్ చేస్తున్నారు.ఈ తరహా వేధింపులు స్త్రీలను మానసికంగా కుంగదీస్తూ, కొన్నిసార్లు చావు అంచుల వరకూ తీసుకెళ్తున్నాయి.కృత్రిమ మేధస్సు (ఎఐ)ను కూడా మహిళలను వేధించేందుకు దుర్వినియోగం చేస్తున్నారు.ఇందుకు డీప్‌ఫేక్ ట్రెండ్ ఒక ఉదాహరణ. నగ్న చిత్రాలతో వేధింపులు ఎక్కువ కావటం వల్ల మహిళలు, ముఖ్యంగా బాలికలు, ఆత్మహత్య చేసుకుంటున్న ఉదంతాలు పెరుగుతున్నాయి.

భారతదేశంలోని నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ఆర్థిక నేరాలతో పాటు నగ్నచిత్ర వేధింపులపై కూడా మరింత దృష్టి పెట్టాలి. సోషల్ మీడియాను ఒక సాధనంగా వాడుకుంటూ మహిళలను రాజకీయాల నుంచి దూరం చేయాలనే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. అజ్ఞాతంగా కామెంట్ చేయగలిగే అవకాశం ఉండటంతో,ట్రోలర్లు ధైర్యంగా ఎలాపడితే అలా రాస్తున్నారు.మహిళల గురించి రాసేప్పుడు ఈ ధైర్యం ఇంకా ఎక్కువ ప్రదర్శిస్తున్నారు.తరతరాలుగా ముదిరిపోయిన పురుషాధిక్యతా ధోరణే ఇందుకు కారణం.ఈ ధోరణికి అడ్డుకట్ట వేయకపోతే మహిళలు ప్రజా క్షేత్రంలోకి,పరిపాలనా రంగంలోకి రావడానికి వెనుకాడతారు.దీనికి అడ్డుకట్ట పడాలంటే ట్రోలర్స్,ఫేక్ ఖాతాదారుల విషయంలో ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరిం చాలి. కొత్తగా తీసుకువచ్చిన భారతీయ న్యాయ సంహిత చట్టంలో యువత తమ జీవిత భాగస్వామిని స్వేచ్ఛగా ఎంపిక చేసుకునే హక్కును హరించారు. కులం లేదా ఆస్తి కారణంగా ప్రేమ వివాహల విషయంలో మోసం చేసినా నేరంగా పరిగణించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. లవ్ జిహాద్ పేరిట మతాంతర వివాహాలపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతున్నారు. ఉత్తరప్రదేశ్‌తో పాటు దేశంలో,మన రాష్ట్రంలో కూడా కులదురహంకార హత్యలు పెరిగాయి. కుల,మత ఉన్మాదాలు వ్యాప్తి చెందుతున్నాయి. స్త్రీలపై లైంగికదాడులు,హింస పెరుగుతున్నాయి.దాంతో ఆడపిల్లల చదువుకు,ఉపాధికి ఆటంకాలు వస్తున్నాయి. యునెస్కో ప్రకారం ఆడపిల్లలు చదువును



మానేయడానికి ముఖ్యమైన కారణం హింస అని చెప్పింది.ఆడపిల్లలు చదువుకోవడానికి మంచి విద్యావ్యవస్థ,భద్రత అవసరం.

రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న లైంగికదాడులూ, అమానుషాలూ, దాడులూ, దౌర్జన్యాలూ ప్రతి ఒక్కరి మనసునూ కదిలించేలా ఉన్నాయి.కారణాలు కాలాలు,ప్రాంతాలు పాత్రలు వేరైనా ఈ దారుణ దృశ్యాలన్నింటిలోను బాలికలు,మహిళలే సమిధలు కావడం విషాదం. పురుష దురహంకారము,కుల క్రౌర్యమూ వేయి చేతులు చాచి అమాయక మహిళలను బలితీసుకోవడం నాగరిక సమాజం సిగ్గుతో తలదించుకోవాల్సిన చర్య. ఇన్ని జరుగుతున్నా ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు ఖండనలకు, ప్రకటనలకు మాత్రమే పరిమితం కావడం బాధ్యతారాహిత్యానికి,రాజకీయ చిత్తశుద్ధి లేమికి నిదర్శనం. అపురూపంగా చూసుకోవాల్సిన ఆడపిల్లలు, మహిళల ప్రాణాలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి, పురుషాహంకారానికి,కుల దురహంకారానికి గాల్లో దీపాల్లా కొండెక్కిపోతున్నాయి.సూటిపోటి మాటలతో కాకుల్లా పొడుచుకుతినే లోకుల మధ్య ఒంటరైంది మాత్రం ఒక మహిళే. కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్న యువతకు ముఖ్యంగా మహిళలకు ఎదురయ్యే కష్టనష్టాలు, చేదు అనుభవాలు ఎన్నెన్నో?! తక్కువ కులాల వారిని పెళ్లాడిన అమ్మాయిలకు మన రాష్ట్రంలోనూ ఈ భూమ్మీద నూకలు చెల్లిపోతున్నాయి. కని,పెంచి, పెద్దచేసిన అమ్మానాన్నలే కుటుంబ గౌరవం పేరిట ప్రాణాలు హరించడం కలవరపెడుతోంది. సామాజిక అసహనం ఇప్పటికే మన రాష్ట్రంలో ఎంతలా విభ్రాంతి కలిగించే స్థాయిలో వుందో తెలుస్తోంది. ఇక్కడ కూడా మొదటగా బలవుతోంది మహిళలే. పరువు పేరిట కుల దురహంకారంతో మహిళలను మట్టి చేసే సంస్కృతి ఉత్తరాదికే పరిమితమని ఎవరైనా భావిస్తుంటే ఈ దారుణ ఉదంతాలు వారికి కనువిప్పు కల్గించాలి. ఉత్తరాది రాష్ట్రాల్లో పరువుహత్యలపై జరిగే క్రతువును ఖండించడానికి ప్రజాప్రతినిధులు సైతం ముందుకు రారు. ఓట్లకోసం చూసీ చూడనట్టు నటిస్తుంటారు.

మన రాష్ట్రంలో ఈ విషయంలో ఏవైనా భిన్న పరిస్థితులున్నాయా? అని ప్రశ్నించుకుంటే ఒళ్లు గగుర్పొడిచే సమాధానమే లభి స్తుంది. మహిళా సంఘాలు,అభ్యుదయకాముక శక్తులు అరచిగీపెట్టినా,పార్లమెంటులో చర్చ లేవదీసినా ప్రయోజనం స్వల్పం.వామపక్షాలు మరీ ముఖ్యంగా సీపీఐ(ఎం) మినహా మరెవరూ ఈ సమస్య పరిష్కారానికి,చర్చకు,చట్టరూపకల్పనకు కదలడం లేదు.గొంతు విప్పడం లేదు.ప్రస్తుతం కుల రాజకీయాలు క్రియాశీలమౌతున్న మన రాష్ట్రంలో కులదురహంకార హత్యలు పెరిగిపోతున్నాయి. కులాంతర వివాహాలకు యువతీ యువకులు ముందుకు రావడం సంతోషకరం. అయితే అలాంటి పెళ్లిళ్ల ఎలాంటి అభ్యంతరాలు లేకుండా నిలదొక్కుకోవాలంటే దళితులు,ఇతర కిందికులాల ఆర్థిక స్థితిలోనూ మార్పు రావాలి.ప్రభుత్వాలు ఇందుకు పూనుకోవాలి.పూనుకొనేలా చేసే ఉద్యమాలు రావాలి.కులదురహంకారంతో జరిగే హత్యలను అరికట్టడంపై మన ప్రభుత్వం తీవ్రంగా దృష్టి సారించాలి. సెక్సువల్ అఫన్సివ్ యాక్ట్-2012, క్రిమినల్ లా అమండ్ మెంట్ యాక్ట్-2013,నిర్భయ చట్టం-2013,పని ప్రదేశాలలో లైంగిక వేధింపుల నిరోధక చట్టం-2013, లైంగిక నేరాల నుంచి బాలలకు రక్షణ చట్టం-2012, బాల్య వివాహ నిరోధక చట్టం-2006, ఇలా ఎన్నో చట్టాలు.అయితే ఇవన్నీ ప్రభావవంతంగా పనిచేస్తున్నాయా? రాజ్యాంగం మత విశ్వాసాల ఆధారంగానే స్త్రీలకు పర్సనల్ లా హక్కులు కల్పించింది. పితృస్వామ్యం,మతం,ఆచార వ్యవహారాలు, సంస్కృతి రూపంలో మహిళల పట్ల అమలవుతున్న వివక్షను కాదని స్త్రీలకు సమానత్వ హక్కులను కల్పించలేకపోయింది.వీటన్నిటికీ లోబడే చట్టాల రూపకల్పన జరుగుతోంది.అందుకనే గృహహింస నుండి రక్షణ చట్టం మొదలు నిర్భయా చట్టం దాకా ఎన్ని చట్టాలు చేసినా వివక్షను తొలగించలేక పోతున్నాయి. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మాతా శిశు సంక్షేమ పథకాల నుండి బేటీ పడావ్-బేటీ బచావ్ దాకా చట్టాల,పథకాల అమలులో ఎంతవరకు చిత్త శుద్ధి ఉన్నది, ఇవన్నీ మహిళలకు అందుబాటులో ఉన్నాయా? అన్నది కూడా ప్రశ్నార్థకమే. ■



ప్లాన్-బి లేకుంటే ఎలా?

సన్‌రైజర్స్ వ్యూహంపై పుజారా, బిషప్

ముంబయి : విధ్వంసక బ్యాటింగ్ విన్యాసాలకు మారుపేరు సన్‌రైజర్స్ హైదరాబాద్. 2024 ఐపీఎల్‌లో బ్యాటింగ్ రికార్డులనే కాదు టీ20 ఆటతీరునే సరికొత్తగా నిర్వచించింది సన్‌రైజర్స్. ఐపీఎల్2025లోనూ సన్‌రైజర్స్ హైదరాబాద్ తనదైన జోరు తొలి మ్యాచ్‌లోనే చూపించింది. రాజస్థాన్ రాయల్స్‌పై 287 పరుగుల రికార్డు స్కోరు బాదింది. కానీ, ఆ తర్వాత వరుస మ్యాచుల్లో లక్నో సూపర్‌జెయింట్స్, ఢిల్లీ క్యాపిటల్స్ చేతిలో పరాజయం పాలైంది. దీంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ గేమ్ ప్లాన్‌పై విమర్శలు వినిపిస్తున్నాయి. ప్లాన్-బి లేకుంటే ఎలా అని చతేశ్వర్ పుజార, ఇయాన్ బిషప్‌లు ప్రశ్నిస్తున్నారు.

'వైజాగ్‌లో సన్‌రైజర్స్ తొలుత బ్యాటింగ్ ఎంచుకోవటం ఆశ్చర్యపరిచింది. మధ్యాహ్నం మ్యాచ్‌లో తొలుత బౌలింగ్‌కు అనుకూలత ఉంటుంది. బ్యాటింగ్‌కు చేసేందుకు అది సరైన సమయం కాదు. బ్యాటింగ్ ఎంచుకున్న తర్వాత.. సన్‌రైజర్స్ మరీ దూకుడుగా ఆడింది. ఆ దిశగా తెలివైన ప్రణాళిక అమలు చేయలేదు. పదింట రెండు నెగ్గితే అందులో సక్సెస్ ఏముంది? నిలకడగా ప్రతి మ్యాచ్‌లో అదే ప్రదర్శన చేసేలా ఉండాలి. గత సీజన్‌లో సన్‌రైజర్స్ లీగ్ దశలో అద్భుతంగా ఆడింది. కానీ నాకౌట్ దశలో ఒక్క మ్యాచ్‌లో ప్లాన్ పని చేయకుంటే ఏంటీ పరిస్థితి?. వేగంగా వికెట్లు పడినప్పుడైనా ప్లాన్-బి లేకుంటే ఎలా? అని పుజారా ప్రశ్నించాడు. ' పవర్‌ప్లేలోనే టాప్-4 వికెట్లు పడినా సన్‌రైజర్స్ రన్‌రేట్ తగ్గలేదు. ఆచితూచి ఆడటం అంటే ఐదారు ఓవర్ల పాటు నిలదొక్కుకునేందుకు ప్రయత్నించమని కాదు. కనీసం 3, 4, 5 బంతులైనా లేదంటే ఓ ఓవర్ పాటు నియంత్రణ పాటించాలి. క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో ఓ ఎండ్‌లో అనికెత్ సిక్సర్ల మోత మోగిస్తున్నా.. క్లాసెన్ సైతం భారీ షాట్‌కు వెళ్లి అవుటయ్యాడు. నిజానికి క్లాసెన్ కాస్త నెమ్మదిగా ఆడితే బాగుండేది. ఆఖరు వరకు క్రీజులో కొనసాగే ప్లాన్ ఉంటే మరింత ఎక్కువ పరుగులు సాధించేందుకు అవకాశం ఉంటుంది' అని ఇయాన్ బిషప్ అన్నారు

వంద కాదు ఒకటి!

మమామీ ఓపెన్ టెన్నిస్ 2025

- జాకుబ్ మెన్సిక్‌కు మయామీ టైటిల్
- ఫైనల్లో నొవాక్ జకోవిచ్‌పై విజయం

చెక్ రిపబ్లిక్ చిన్నోడు జాకుబ్ మెన్సిక్ (19) తన చిన్ననాటి ఆరాధ్య ఆటగాడు నొవాక్ జకోవిచ్‌కు ఝులక్ ఇచ్చాడు. ప్రత్యర్థికి సింగిల్ సెట్ కోల్పోకుండా ఫైనల్‌కు చేరుకున్న జకోవిచ్ కెరీర్ వందో ఏటీపీ టైటిల్ ముంగిట నిలిచాడు. టైటిల్ పోరులో వరుస సెట్లలో టెన్నిస్ దిగ్గజాన్ని మట్టికరిపించిన జాకుబ్ మెన్సిక్.. తొలిసారి ఏటీపీ మాస్టర్స్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు.

మయామీ (యుఎస్ఏ)

మయామీ ఓపెన్‌లో సంచలనం నమోదైంది. 19 ఏండ్ల చెక్ రిపబ్లిక్ చిన్నోడు 24 గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల మొనగాడిని మట్టికరిపించాడు. టైబ్రేకర్లకు దారితీసిన టైటిల్ పోరులో నాల్గో సీడ్ నొవాక్ జకొవిచ్ (సెర్బియా)పై 7-6(7-4), 7-6(7-4)తో వరుస సెట్లలో జాకుబ్ మెన్సిక్ (చెక్ రిపబ్లిక్) గెలుపొందాడు. జాకుబ్ మెన్సిక్‌కు ఇదే తొలి ఏటీపీ టైటిల్ కావటం విశేషం. కెరీర్ రికార్డు 100వ ఏటీపీ టైటిల్‌పై కన్నేసి బరిలోకి దిగిన జకోవిచ్‌కు అంతిమ సమరంలో భంగపాటు తప్పలేదు. వర్షం కారణంగా ఐదున్నర గంటలు ఆలస్యంగా ఆరంభమైన మ్యాచ్‌లో విపరీతమైన ఉక్కపోత, అలసట జకోవిచ్‌ను ఉక్కిరిబిక్కిరి చేశాయి. 2023 నుంచి ఏటీపీ టైటిల్ కోసం ఎదురుచూస్తున్న జకోవిచ్.. సుదీర్ఘ విరామం తర్వాత మయామీ ఓపెన్ ఫైనల్‌కు చేరుకున్నా నిరాశ తప్పలేదు.

జాకుబ్ అద్భుతం

మయామీ ఓపెన్ ఫైనల్లో జాకుబ్ మెన్సిక్ అద్భుతం చేశాడు. వర్షంతో టైటిల్ పోరు ఐదున్నర గంటలు ఆలస్యమైంది. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత మొదలైన మ్యాచ్‌లో జకోవిచ్ తడబాటుకు లోనయ్యాడు. వేగంగా పరిస్థితులకు అలవాటు పడలేకపోయాడు. తొలి సెట్‌లో జాకుబ్ దూకుడు చూపించాడు. తొలి అవకాశంలోనే జకోవిచ్ సర్వ్ బ్రేక్ చేసి 4-1తో ముందంజ వేశాడు. మరోవైపు జకోవిచ్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. ఉక్కపోతతో రాకెట్‌పై పట్టు చిక్కకపోగా.. కుడి కన్ను వాపుతో పలుమార్లు ఐ డ్రాప్స్ వాడుతూ ఇబ్బంది పడ్డాడు. మ్యాచ్ సాగుతున్న కొద్ది జకోవిచ్ సర్వ్ మెరుగైంది. బ్యాక్‌హ్యాండ్‌తో జాకుబ్‌ను ఇబ్బంది పెట్టాడు. టైబ్రేకర్‌కు దారితీసిన సెట్లో జకోవిచ్ నిరాశపరిచాడు. జాకుబ్ మెన్సిక్ 7-4తో పైచేయి సాధించాడు. జకోవిచ్, జాకుబ్ పోరు గత ఏడాది షాంఘై ఓపెన్ ఢీ తరహాలోనే సాగింది. తొలి సెట్‌ను జాకుబ్ నెగ్గగా.. రెండో సెట్లో జకోవిచ్ పైచేయి సాధించాడు. కానీ రెండో సెట్లో జాకుబ్ ఈసారి గట్టిగా నిలబడ్డాడు. జకోవిచ్‌ను కోర్టు అంతా తిప్పిన జాకుబ్.. లాంగ్ ర్యాలీలు, బలమైన బ్యాక్‌హ్యాండ్ షాట్లతో మెరిశాడు. టైబ్రేకర్‌లో మరోసారి 7-4తో జకోవిచ్‌ను ఓడించి టైటిల్ సొంతం చేసుకున్నాడు. 19 ఏండ్ల జాకుబ్ మెన్సిక్‌కు ఇది కెరీర్ తొలి ఏటీపీ1000 టైటిల్ కాగా.. జకోవిచ్ కెరీర్ 100వ ఏటీపీ టైటిల్ వేటలో మళ్లీ నిరాశపరిచాడు.



తప్పుకుందామని అనుకున్నోడే

మయామీ ఓపెన్‌లో జాకుబ్ మెన్సిక్ ప్రయాణం ఆశ్చర్యకరంగా సాగింది. మోకాలు నొప్పితో మయామీలో అడుగుపెట్టిన జాకుబ్ తొలి రౌండ్‌కు ముందే వాకోవర్ ఇద్దామని అనుకున్నాడు. మార్చి 20న రాబర్టో బటిస్టాతో మ్యాచ్‌కు ముందు తప్పుకుంటున్నట్టు ప్రకటించేందుకు మ్యాచ్ అధికారుల వద్దకు వెళ్లగా అప్పుడు ఆఫీసర్స్ లంచ్ బ్రేక్‌లో ఉన్నారు. దీంతో టోర్నమెంట్ ఫిజియోథెరపిస్ట్ వద్దకు వెళ్లిన జాకుబ్ తన సమస్య చెప్పి వాకోవర్ నిర్ణయాన్ని తెలిపాడు. పెయిన్ కిల్లర్స్ వాడినా ఎటువంటి ఉపశమనం లేదు. సరిగ్గా నడవటమే ఇబ్బందిగా ఉందని చెప్పాడు. దీంతో ఫిజియోథెరపిస్ట్ జాకుబ్‌కు చికిత్స మొదలెట్టాడు. మందులు మార్చాడు. అర గంటలోనే సానుకూల ఫలితం. మోకాలు బాగానే ఉంది.. తొలి రౌండ్లో తలపడదాం అనుకుని బరిలోకి దిగాడు. టోర్నమెంట్ ఫిజియోథెరపిస్ట్ జాకుబ్‌కు చికిత్స కొనసాగిస్తూనే ఉండగా.. అతడు మరింత మెరుగయ్యాడు. తొలి మ్యాచ్‌కు ముందే నిష్క్రమిద్దానుకున్న ఆటగాడు... ఏకంగా చాంపియన్‌గా అవతరించాడు.

ఆరాధ్య ఆటగాడిపైనే

నొవాక్ జకోవిచ్ (37) అంటే జాకుబ్ మెన్సిక్‌కు పిచ్చి అభిమానం. చిన్ననాటి నుంచి జకోవిచ్‌ను ఆరాధ్య ఆటగాడిగా చూస్తాడు. 2022 ఆస్ట్రేలియన్ ఓపెన్ సందర్భంగా జూనియర్ సర్క్యూట్‌లో ఆడుతున్న జాకుబ్‌ను జకోవిచ్ తనతో పాటు ప్రాక్టీస్‌కు ఆహ్వానించాడు. జూనియర్ టైటిల్ దక్కించుకున్న తర్వాత విజయానికి జకోవిచ్ ప్రేరణే కారణమని జాకుబ్ తెలిపాడు. 2024 ఖతార్ ఓపెన్ ఫైనల్‌కు చేరుకుని ఏటీపీ ర్యాంకింగ్స్‌లో టాప్-100లోకి ప్రవేశించిన జాకుబ్.. తాజాగా మయామీ టైటిల్‌తో కెరీర్ అత్యుత్తమ 24వ ర్యాంక్‌కు చేరుకోనున్నాడు. మయామీ ఓపెన్ విజయ ప్రస్థానంలో టాప్-10 ర్యాంకర్లు జకోవిచ్, జాక్ డ్రేపర్, టేలర్ ఫ్రిట్జ్‌లను జాకుబ్ మెన్సిక్ ఓడించాడు.

రాజ్‌గిర్‌లో హాకీ ఆసియా కప్

బిహార్ స్పోర్ట్స్ అథారిటీతో హాకీ ఇండియా ఎంఓయు



పట్నా : ఈ ఏడాది భారత్ వేదికగా జరుగనున్న హాకీ ఆసియా కప్ టోర్నమెంట్‌కు బిహార్‌లోని రాజ్‌గిర్ స్టేడియం ఆతిథ్యం ఇవ్వనుంది. ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 7 వరకు ఆసియా కప్ హాకీ టోర్నీ జరుగనుంది. ఈ మేరకు బిహార్ స్టేట్ స్పోర్ట్స్ అథారిటీతో హాకీ ఇండియా ఎంఓయు ఒప్పందం కుదుర్చుకుంది. ఇటీవల 2024 మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీకి విజయవంతంగా ఆతిథ్యం అందించిన రాజ్‌గిర్‌లో ఇది రెండో మేజర్ టోర్నమెంట్ కానుంది. 12వ ఆసియా కప్‌లో ఆతిథ్య భారత్ సహా పాకిస్థాన్, జపాన్, దక్షిణ కొరియా, చైనా, మలేషియాలు పోటీపడనున్నాయి. ఆసియా హాకీ ఫెడరేషన్ నిర్వహించే అర్హత టోర్నమెంట్ నుంచి మరో రెండు జట్లు అర్హత సాధించనున్నాయి. ఆసియా కప్ విజేత నేరుగా 2026 ఎఫ్ఐహెచ్ హాకీ ప్రపంచకప్‌కు అర్హత సాధించనుంది.

ముంబయి మొదలెట్టింది

- నైట్‌రైడర్స్‌పై 8 వికెట్ల తేడాతో గెలుపు
- ఛేదనలో రికెల్టన్ అజేయ అర్థ సెంచరీ

నవతెలంగాణ-ముంబయి :

ఐదుసార్లు చాంపియన్ ముంబయి ఇండియన్స్ ఐపీఎల్18లో తొలి విజయం నమోదు చేసింది. సోమవారం ముంబయిలోని వాంఖడె స్టేడియంలో జరిగిన లీగ్ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కత నైట్‌రైడర్స్‌పై 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. వరుస పరాజయాల తర్వాత సొంతగడ్డపై ఆడిన ముంబయి ఇండియన్స్ బంతితో, బ్యాట్‌తో కోల్‌కతను కుమ్మేసింది. 117 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ముంబయి 12.5 ఓవర్లలోనే 121/2 పరుగులతో ఛేదించింది. మరో 43 బంతులు ఉండగానే లాంఛనం ముగించింది. ఓపెనర్ రియాన్ రికెల్టన్ (62 నాటౌట్, 41 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఛేదనలో అజేయ అర్థ సెంచరీతో కదం తొక్కగా.. సూర్యకుమార్ యాదవ్ (27 నాటౌట్, 9 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధనాధన్ ముగింపు అందించాడు. రోహిత్ శర్మ (13), విల్ జాక్స్ (16) మళ్లీ విఫలం అయ్యారు. తొలుత బ్యాటింగ్ చేసిన కోల్‌కత నైట్‌రైడర్స్‌ను యువ పేసర్ అశ్వని కుమార్ (4/24) కకావికలం చేశాడు. దీపక్ చాహర్ (2/19) సైతం అశ్వనికి తోడవటంతో కోల్‌కత నైట్‌రైడర్స్ బ్యాటింగ్ లైనప్ పేకమేడలా కుప్పకూలింది. పవర్‌ప్లేలోనే నాలుగు వికెట్లు కోల్పోయిన నైట్‌రైడర్స్ 16.2 ఓవర్లలో 116 పరుగులకు ఆలౌటైంది. మిడిల్ ఆర్డర్‌లో రఘువంశీ (26, 16 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), లోయర్ ఆర్డర్‌లో రమణ్‌దీప్ సింగ్ (22, 12 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్), రింకు సింగ్ (17, 14 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), మనీశ్ పాండే (19, 14 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) కోల్‌కతకు గౌరవప్రద స్కోరు అందించారు. వెంకటేశ్ అయ్యర్ (3), ఆండ్రీ రసెల్ (5), క్వింటన్ డికాక్ (1), సునీల్ నరైన్ (0), అజింక్య రహానె (11) నిరాశపరిచారు. మూడు మ్యాచుల్లో నైట్‌రైడర్స్‌కు ఇది రెండో పరాజయం కాగా... ముంబయి ఇండియన్స్‌కు ఇదే తొలి విజయం.



టీడీసీఏ వన్డే సిరీస్ అమెరికా కైవసం



హైదరాబాద్: తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) నిర్వహించిన అండర్-17 వన్డే సిరీస్ అమెరికన్ యూత్ క్రికెట్ అకాడమీ కైవసం చేసుకుంది. సోమవారం జరిగిన ఫైనల్లో అమెరికా జట్టు 57 పరుగుల తేడాతో టీడీసీఏ ఎలెవన్‌పై గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఏవైసీఏ 49.1 ఓవర్లలో 297కు ఆలౌటైంది. ఛేదనలో టీడీసీఏ 42.5 ఓవర్లలో 240 పరుగులకే కుప్పకూలింది. టీడీసీఏ అధ్యక్షులు అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి చాంపియన్స్‌కు ట్రోఫీలు ప్రదానం చేశారు. 'తెలంగాణ గ్రామీణ క్రికెటర్లకు అంతర్జాతీయ స్థాయి పోటీతత్వం అలవరటమే మా లక్ష్యం. త్వరలో అమెరికాతో పాటు వెస్టిండీస్‌లో టీడీసీఏ రూరల్ జట్ల పర్యటనలకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని' వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు.

నవచిత్రం

అమ్మలందరికీ ఈ సినిమా అంకితం



నందమూరి కళ్యాణ్ నటిస్తున్న యాక్షన్-ప్యాక్డ్ ఫ్యామిలీ డ్రామా చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. ఈ సినిమా ఈ వేసవిలో సందడి చేసేందుకు రెడీ అవుతోంది.

ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్‌లపై అశోక్ వర్ధన్ ముప్పా సునీల్ బలుసు నిర్మించిన ఈ చిత్రంలో విజయశాంతి ఐపీఎస్ అధికారిగా కీలక పాత్ర పోషించారు. ఈ సినిమాలోని 'నాయల్ది..' సాంగ్ లాంచ్ నరసరావుపేటలోని రవి కళా మందిర్‌లో భారీగా తరలివచ్చిన ఫ్యాన్స్ సమక్షంలో చాలా గ్రాండ్‌గా జరిగింది. ఈ సందర్భంగా అభిమానులు భారీ ర్యాలీని నిర్వహించారు.

ఈ సందర్భంగా కళ్యాణ్ రామ్ మాట్లాడుతూ,'ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో చెప్పినట్లు 'అతనొక్కడే' సినిమాలా ఈ సినిమా కూడా మరో 20 ఏళ్ళు గుర్తుండిపోయే సినిమా అవుతుంది. ఈ సినిమాలో మా అమ్మ పాత్ర చేసిన విజయశాంతి ఆ క్యారెక్టర్‌ని ఒప్పుకోవడం వల్లే ఈ సినిమా చేశాం. అమ్మలను గౌరవించడం మన బాధ్యత. వాళ్ళ కోసం ఎంత త్యాగం చేసినా తప్పులేదు. ఈ సినిమాని అమ్మలందరికీ అంకితం చేస్తున్నాం' అని తెలిపారు.

'నందమూరి అభిమానులు కళ్యాణ్ రామ్‌ని ఎలా చూడాలని కోరుకుంటారో ఈ సినిమాలో అలా ఉంటారు. పల్నాటి పౌరుషం మొత్తం ఈ క్యారెక్టర్‌లో ఉంటుంది' అని డైరెక్టర్ ప్రదీప్ చిలుకూరి చెప్పారు.

ఈ తరాన్నీ మెప్పిస్తుంది



బాలకృష్ణ హీరోగా శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన క్లాసిక్ సైన్స్ ఫిక్షన్ చిత్రం 'ఆదిత్య 369' మళ్లీ వెండితెరపై సందడి చేయడానికి సిద్ధంగా ఉంది. ఈ సినిమా ఈనెల 4వ తేదీన రీ-రిలీజ్ అవుతోంది. ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం సమర్పణలో, సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో ఈ సినిమా రూపొందింది.

ఈ నేపథ్యంలో ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుక తెలుగువారి పర్వదినం ఉగాది నాడు అత్యంత వైభవంగా జరిగింది. ఈ మూవీ ట్రైలర్‌ని దర్శకులు బాబీ, అనిల్ రావిపూడి విడుదల చేశారు.

ఈ సందర్భంగా సింగీతం శ్రీనివాసరావు మాట్లాడుతూ, 'ఈ సినిమాలో బాలకృష్ణ పోషించిన శ్రీకృష్ణ దేవరాయలు పాత్ర బాగా హైలైట్ అయింది. అలాగే ఇలాంటి సబ్జెక్టుతో నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించి సాహసం చేశారు. ఈ సక్సెస్ క్రెడిట్‌లో సింహభాగం ఆయనదే' అని అన్నారు.

'ఈ సినిమా తీయి. నిర్మాతగా కొన్ని దశాబ్దాలు మిగిలిపోతావు అని బాలసుబ్రమణ్యం అన్నారు. ఆయన మాటే నిజమైంది. ఈ సినిమా నిర్మించడం నా పూర్వజన్మ సుకృతం' అని నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ చెప్పారు. హీరో బాలకృష్ణ మాట్లాడుతూ, 'సినిమా సినిమాకి వేరియేషన్స్ కోసం ప్రయత్నిస్తున్న సమయం అది. చలనచిత్ర పరిశ్రమలో ఈ సినిమా ఒక కమర్షియల్ ట్రెండ్ సెట్ చేసింది. అంతేకాదు ఈ తరాన్నీ మెప్పించే సినిమా కూడా. ఈ సినిమాలో శ్రీకృష్ణదేవరాయలు పాత్ర ధరించడానికి నాన్నగారే ఇన్‌స్పిరేషన్. ఇది మంచి సినిమా అవుతుందన్న నమ్మకంతో దర్శక, నిర్మాతల్ని ప్రోత్సహించాను. ఈనెల 4న మళ్ళీ ఓ అద్భుతం జరగబోతోంది. దేశమంతా ఈ సినిమా గురించి మాట్లాడుకుంటారు' అని అన్నారు.

స్కైపై డ్రామా నేపథ్యంలో..



దర్శకుడు మల్లిడి వశిష్ట సోదరుడు మల్లిడి కృష్ణ దర్శకుడిగా పరిచయం కాబోతున్నారు. కుశాల్ రాజును హీరోగా పరిచయం చేస్తూ ఎంఎస్ఆర్ క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం.1గా స్కైపై డ్రామాను తెరకెక్కిస్తున్నారు.

డా. లతా రాజు నిర్మిస్తున్న ఈ చిత్రం సోమవారం అన్నపూర్ణ స్టూడియోలో పూజా కార్యక్రమాలతో వైభవంగా ప్రారంభమైంది. ఎస్వీ కృష్ణారెడ్డి, అచ్చిరెడ్డి స్క్రిప్ట్‌ను అందజేయగా, వీవీ వినాయక్ ఫస్ట్ షాట్‌కు క్లాప్ కొట్టారు. మల్లిడి వశిష్ట ఫస్ట్ షాట్‌కి డైరెక్షన్ చేశారు.

ఈ సందర్భంగా దర్శకుడు మల్లిడి కృష్ణ మాట్లాడుతూ,'నిర్మాత లతకి థ్యాంక్స్ చెప్పాలి. అలాంటి మంచి నిర్మాత దొరకాలంటే అదృష్టం ఉండాలి. ఇదొక స్కైపై డ్రామా మూవీ. ఇలాంటి కథను ఎంచుకోవాలంటే ధైర్యం ఉండాలి' అని అన్నారు. 'ఈ సినిమా కోసమే నా హెయిర్ స్టైల్ మార్చాను. ఇందులో నాది పాజిటివ్ క్యారెక్టర్. డైరెక్టర్ కథ చెప్పినప్పుడు చాలా ఎగ్జైట్ అయ్యాను' అని సీనియర్ నటుడు పృథ్వీరాజ్ చెప్పారు. హీరో కుశాల్ రాజు మాట్లాడుతూ,"దర్శకుడు కృష్ణకు థ్యాంక్స్. నన్ను హీరోగా పరిచయం చేయడం కోసం మా అమ్మ లత చాలా కేర్ తీసుకున్నారు' అని తెలిపారు. నిర్మాత డా౹౹లతారాజు మాట్లాడుతూ, 'నిర్మాతగా నాకు ఎలాంటి ఎక్స్‌పీరియన్స్ లేదు. మా అబ్బాయి కోరిక మేరకు నిర్మాత అయ్యాను. డైరెక్టర్ స్టోరీ చెప్పినప్పుడు చాలా కొత్తగా అనిపించింది. పృథ్వీ క్యారెక్టర్ చాలా అద్భుతంగా ఉంటుంది. కామెడీ, లవ్ అన్నీ సమపాళ్లలో ఉంటాయి' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం :శ్రీచరణ్ పాకాల, సినిమాటోగ్రాఫర్: అమర్నాథ్ బొమ్మిరెడ్డి, ఫైట్ మాస్టర్: జీవన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: బాబీ రెడ్డి.

ఈ స్థాయి విజయాన్ని ఊహించలేదు..



కళ్యాణ్ శంకర్

బ్లాక్ బస్టర్ చిత్రం 'మ్యాడ్'కి సీక్వెల్‌గా రూపొందిన చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ ప్రధాన పాత్రలు పోషించారు. కళ్యాణ్ శంకర్ దర్శకత్వం వహించారు. శ్రీకర స్టూడియోస్‌తో కలిసి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించారు. ఈ చిత్రానికి సూర్యదేవర నాగవంశీ సమర్పకులు. ఇటీవల విడుదలైన ఈ చిత్రం థియేటర్లలో నవ్వులు పూయిస్తూ మూడు రోజులలోనే ప్రపంచవ్యాప్తంగా రూ.55.2 కోట్లకు పైగా గ్రాస్ రాబట్టింది.

ఈ నేపథ్యంలో దర్శకుడు కళ్యాణ్ శంకర్ మీడియాతో మాట్లాడుతూ,"మ్యాడ్'కి రెట్టింపు వినోదం 'మ్యాడ్ స్క్వేర్'తో అందిస్తామని చెప్పిన మాట నిలబెట్టుకున్నాం. స్వయంగా కొన్ని థియేటర్లకు వెళ్ళి చూశాం. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా అందరూ సినిమా చూసి బాగా ఎంజాయ్ చేస్తున్నారు. 'మ్యాడ్' ఎక్కువగా యువతకి చేరువైంది. కానీ, ఈ చిత్రాన్ని యువతతో పాటు, కుటుంబ ప్రేక్షకులు కూడా బాగా ఆదరిస్తున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే బ్రహ్మరథం పడుతున్నారు. ఈ స్థాయి స్పందనని ఊహించలేదు. సినిమాకి మంచి ఆదరణ లభిస్తుందనే నమ్మకం ఉంది. కానీ, 'మ్యాడ్' ఫుల్ రన్ కలెక్షన్స్‌ని మొదటి రోజే రాబట్టే స్థాయిలో 'మ్యాడ్ స్క్వేర్' పై అంచనాలు ఉన్నాయని అసలు ఊహించలేదు. ఓవర్సీస్‌లో 1 మిలియన్ కలెక్ట్ చాలా సంతోషంగా అనిపించింది. తక్కువ టైమ్‌లో 1 మిలియన్ కలెక్ట్ చేయటం మామూలు విషయంకాదు. నెక్స్ రవితేజతో సూపర్ హీరో సినిమా చేయబోతున్నాను. దానిలో కూడా ఖచ్చితంగా కామెడీ ఉంటుంది. అలాగే సినిమా కొత్తగా ఉంటుంది. సూపర్ హీరోకి ఒక మంచి బ్యాక్ స్టోరీ ఉంటుంది. ఇది సైన్స్ ఫిక్షన్ కాదు. పూర్తిగా ఫిక్షన్' అని తెలిపారు.

సీట్ ఎడ్జ్ హర్రర్ థ్రిల్లర్‌గా 'అమరావతికి ఆహ్వానం'



ప్రస్తుత కాలంలో హర్రర్ థ్రిల్లర్ సినిమాలకు మంచి డిమాండ్ ఉంది. ఇటీవల బాలీవుడ్‌లో బ్లాక్ బస్టర్ సాధించిన 'ముంజ్య, స్త్రీ 2' సినిమాలే దీనికి ఉదాహరణ. అలాంటి ఒక ఉత్కంఠభరితమైన కథ, కథనాలతో సీట్ ఎడ్జ్ హర్రర్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న చిత్రం 'అమరావతికి ఆహ్వానం' అని అంటున్నారు మేకర్స్.

'అక్కడొకడుంటాడు'ఫేమ్ శివ కంఠంనేని, ఎస్తర్, ధన్య బాలకృష్ణ, సుప్రిత, హరీష్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి రైటర్, డైరెక్టర్ జీవీకే దర్శకత్వం వహిస్తున్నారు.

ఉగాది సందర్భంగా ఈ మూవీ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. ఒక మంచి హర్రర్ థ్రిల్లర్‌కి కావాల్సిన మూడ్ పూర్తిగా ఈ పోస్టర్‌లో క్యారీ అయింది. క్రియేటివ్‌గా ఉన్న ఫస్ట్ పోస్టర్‌తోనే సినిమా ఎలా ఉండబోతుంది అనే హింట్ ఇచ్చారు మేకర్స్. ప్రస్తుతం ఈ ఫస్ట్‌లుక్ పోస్టర్‌కి సోషల్ మీడియాలో భారీ స్పందన లభిస్తోంది. లైట్ హౌస్ సినీ మ్యాజిక్ బేనర్‌పై కేఎస్ శంకర్‌రావు, ఆర్ వెంకటేశ్వరరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఈచిత్రానికి కథ, స్క్రీన్ ప్లే, మాటలు, దర్శకత్వం: జీవీకే, డిఓపి: జె ప్రభాకర్ రెడ్డి, మ్యూజిక్: పద్మనాభన్ భరద్వాజ్, ఎడిటింగ్: సాయిబాబు తలారి, ఫైట్స్: అంజి మాస్టర్, లిరిక్స్: ఉమా వంగూరి, కొరియోగ్రఫి: రాజ్ కృష్ణ.

భిన్న కాన్సెప్ట్‌తో 'ఒక బృందావనం'



కంటెంట్ బాగుంటే చిన్న సినిమా, పెద్ద సినిమా, నూతన తారలు, క్రేజ్ ఉన్న తారలు అనే తారతమ్యాలు ఉండవు. ఈ మధ్య కాలంలో కేవలం కంటెంట్‌తోనే సూపర్‌హిట్‌గా నిలిచిన చిత్రాలు చాలా ఉన్నాయి. తాజాగా ఆ కోవలోకి చేరే చిత్రమే 'ఒక బృందావనం' అని మేకర్స్ చెబుతున్నారు. నూతన నటీనటులు బాలు, షిన్నోవాలతో పాటు శుభలేఖ సుధాకర్, అన్నపూర్ణమ్మ, శివాజీ రాజా, రూప లక్ష్మి, సాన్విత, కళ్యాణి రాజు, మహేంద్ర, డి.డి. శ్రీనివాస్ తదితరులు ఈ చిత్రంలో నటించారు. బొత్స సత్య దర్శకత్వంలో కిషోర్ తాటికొండ, వెంకట్ రేగట్టే, ప్రహ్లాద్ బొమ్మినేని, మనోజ్ ఇందుపూరు ఈ చిత్రాన్ని నిర్మించారు.

ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ, 'అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే లక్ష్యంతో ఓ వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో రాబోతున్న చిత్రమిది. వినోదంతో పాటు మంచి అర్థవంతమైన సందేశాన్ని కూడా ఈ చిత్రంలో జోడించాం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. మా చిత్ర ఆడియోను ఆదిత్య మ్యూజిక్ ద్వారా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. త్వరలోనే ట్రైలర్‌ను రిలీజ్ చేస్తాం. కొత్తదనం కోరుకునే ఆడియన్స్‌కు మా చిత్రం తప్పకుండా నచ్చుతుంది' అని అన్నారు.

ఆద్యంతం వినోదాత్మకం



ప్రదీప్ మాచిరాజు, దీపికా పిల్లి

ప్రదీప్ మాచిరాజు, దీపికా పిల్లి జంటగా నటిస్తున్న చిత్రం 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. ఈ సినిమా ఈనెల 11న థియేటర్లలోకి రావడానికి సిద్ధంగా ఉంది. నితిన్, భరత్ దర్శకత్వం వహిస్తున్నారు.

మాంక్స్ అండ్ మంకీస్ బ్యానర్ నిర్మిస్తోంది. సోమవారం మేకర్స్ థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా హీరో ప్రదీప్ మాచిరాజు మాట్లాడుతూ, 'సినిమా ఆద్యంతం ఎంటర్టైన్మెంట్‌తో ఉంటుంది. చాలా సరదాగా ఉంటుంది. తప్పకుండా మీ అందరికీ నచ్చుతుందని నమ్ముతున్నాం. నా గత సినిమా మాదిరిగానే ఈ సినిమా కూడా సూపర్‌హిట్ అవుతుందనే నమ్మకంతో ఉన్నాను' అని అన్నారు.

'ఇది నా ఫస్ట్ డెబ్యు ఫిలిం. ఈ సినిమా నా మనసుకి చాలా నచ్చింది. ఇందులో చాలా స్పెషల్ క్యారెక్టర్ ప్లే చేశాను. ఈ క్యారెక్టర్‌లో అన్ని ఎమోషన్స్ ఉంటాయి. చాలా ఎంజాయ్ చేస్తూ ఈ క్యారెక్టర్ ప్లే చేశాను. ఓ మంచి సినిమాతో మీముందుకు రాబోతున్నాం' అని హీరోయిన్ దీపిక పిల్లి చెప్పారు. డైరెక్టర్ భరత్ మాట్లాడుతూ,'ఇది ఫ్యామిలీ అంతా కలిసి చూసే సినిమా' అని తెలిపారు.

'ఇది బ్యూటీఫుల్ రొమాంటిక్ కామెడీ ఎంటర్. అందరూ థియేటర్స్‌కి వచ్చి ఎంజాయ్ చేయొచ్చు. ఫైనల్ కాపీ చూసాము. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది' అని మరో డైరెక్టర్ నితిన్ చెప్పారు.

ఐదేండ్లలో వెయ్యికిపైగా బీఆర్‌ఓ సిబ్బంది, కార్మికులు మృతి

పార్లమెంటుకు కేంద్రం వెల్లడి



న్యూఢిల్లీ : బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్‌ఓ) చేపట్టిన నిర్మాణ పనుల్లో చనిపోయిన సిబ్బంది, కార్మికుల సంఖ్యను కేంద్రం పార్లమెంటులో వెల్లడించింది. ఒక ప్రశ్నకు సమాధానంగా కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ ఈ వివరాలను వెల్లడించారు. 2020 నుంచి 2024 మధ్య మొత్తం 704 మంది బీఆర్‌ఓ సిబ్బంది, 575 మంది క్యాజువల్ పెయిడ్ లేబర్స్ (సీపీఎల్‌లు) మరణించారని చెప్పారు.

ఏమిటి ఈ బీఆర్‌ఓ?

బీఆర్‌ఓ అనేది రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని కీలకమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ. భారతదేశసరిహద్దు ప్రాంతాలలో రోడ్డు నెట్‌వర్క్‌లను నిర్మించటంలో, నిర్వహిం చటంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. ఇటీవలి సంవత్సరాలలో ఇది లడఖ్‌లో 19,024 అడుగుల ఎత్తులో ప్రపంచంలోనే ఎత్తైన మోటారు వినియోగ రహదారి అయిన ఉమ్లింగ్ లా టాప్ రోడ్ వంటి అనేక సవాలుతో కూడిన ఎత్తైన మౌలిక సదు పాయాల ప్రాజెక్టును చేపట్టింది. అటల్ టన్నెల్, సెలా టన్నెల్, ఖార్దుంగ్ లా, చాంగ్ లా పాస్ రోడ్లు బీఆర్‌ఓ చేపట్టిన ఇతర ప్రాజెక్టులలో ఉన్నాయి.

మరణాల సంఖ్య ఇలా...

కేంద్ర మంత్రి తెలిపిన వివరాల ప్రకారం.. 2021లో బీఆర్‌ఓ సిబ్బంది 172 మంది, క్యాజువల్ పెయిడ్ లేబర్లలో 134 మంది చనిపోయారు. 2020లో ఇది వరుసగా 156, 112గా ఉన్నది. 2022లో 123 మంది బీఆర్‌ఓ సిబ్బంది, 100 మంది సీపీఎల్‌లు ప్రాణాలు కోల్పోయారు. 2023లో ఈ సంఖ్య వరుసగా 129, 119గా ఉన్నది. 2024లో, 124 మంది బీఆర్‌ఓ సిబ్బంది, 110 మంది సీపీఎల్‌లు మరణించారు. ఇక మొత్తం 166 మంది బీఆర్‌ఓ సిబ్బంది, సీపీఎల్‌లు గాయపడ్డారు.

తీసుకున్న చర్యలు ఇవి

ఈ ఐదేండ్లలో బీఆర్‌ఓ సిబ్బంది, కార్మికులకు సంబంధించిన 201 ప్రమాదాలు, ఇతర సంఘటనలు నమోదయ్యాయి. "బీఆర్‌ఓ అధిక ఎత్తు, సంఘర్షణలకు గురయ్యే ప్రాంతాలలో సిబ్బంది కోసం భద్రతా అంచనాను నిర్వహించింది. వీటిలో హిమపాతం సంభవించే ప్రాంతాల మ్యాపింగ్, పదునైన వక్రతలు, కొండచరియలు విరిగిపడే ప్రాంతాల గుర్తింపు, భద్రతా దళాలతో సమన్వయంతో తగిన రక్షణా ప్రోటోకాల్‌ను రూపొందించటం, పని ప్రదేశాల శిబిరాలు, సిబ్బంది భద్రత కోసం బంకర్లకు స్థానాలు వంటివి ఇందులో ఉన్నాయి" అని వివరించారు. బీఆర్‌ఓ సిబ్బంది, సీపీఎల్ లకు భద్రతా ప్రోటోకాల్‌లు, వైద్య సహాయం, పని పరిస్థితులను మెరుగుపర్చటానికి చర్యలు తీసుకున్నామని సేథ్ తెలిపారు.

తాటిచెట్టు పై నుంచి పడి గీత కార్మికుడు మృతి

- మంచాల మండలం ఆరుట్లలో ఘటన

నవతెలంగాణ-మంచాల



ప్రమాదవశాత్తు తాటి చెట్టు పై నుంచి పడి గీత కార్మికుడు మృతిచెందిన ఘటన రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరుట్ల గ్రామానికి చెందిన గీత కార్మికుడు పాశం బుచ్చయ్యగౌడ్ (58) రోజు మాదిరిగానే తాటిచెట్లు గీయడానికి సోమవారం ఉదయం చెట్ల వద్దకు వెళ్లాడు. కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కుతుండగా మోకు జారడంతో చెట్టు పై నుంచి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో బుచ్చయ్యగౌడ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా.. అప్పటికే బుచ్చయ్యగౌడ్ మృతిచెందాడు. విషయం తెలుసున్న మంచాల మండల పీఏసీఎస్ చైర్మెన్ వెదిరే హనుమంత్‌రెడ్డి, ఆరుట్ల మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కావలి శ్రీనివాస్ ప్రమాద స్థలికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు. పరామర్శించిన వారిలో చీరాల రమేష్, పీఏసీఎస్ డైరెక్టర్లు జెనిగే వెంకటేష్, పి.రమేష్, గ్రామస్తులు గుడ్డీమల చంద్రయ్య, పున్నము రాము, డాక్టర్ కొండిగారి బుచ్చయ్య, సుంకరి ప్రవీణ్‌గౌడ్, నూకం రాజు తదితరులు ఉన్నారు.

సామూహిక లైంగికదాడి కేసులో ఆరుగురి అరెస్ట్

- విచారణ చేపట్టి చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం : జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్



నవతెలంగాణ - ఊరుకొండ

నాగర్‌కర్నూల్ జిల్లా ఊరుకొండపేట శ్రీపబ్బపతి ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో శనివారం రాత్రి మహిళపై జరిగిన సామూహిక లైంగికదాడి కేసులో ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. దైవ దర్శనానికి వచ్చి రాత్రి సమయంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు బహిర్భూమికి వెళ్లిన ఓ వివాహితను ఊరుకొండపేట గ్రామానికి చెందిన కొంతమంది బలవంతంగా లాక్కెళ్లి సామూహిక లైంగిక దాడి చేశారు. దీనిపై బాధితురాలి బంధువులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, విచారణ చేపట్టారు. ఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అడిషనల్ ఎస్పీ రామేశ్వర్, కల్వకుర్తి సీఐ నాగార్జున, పోలీస్ సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ మాట్లాడుతూ.. ఓ మహిళపై ఏడుగురు లైంగికదాడి చేసినట్టు ఊరుకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు వచ్చిందన్నారు. విచారణ చేపట్టి ఆరుగురు నిందితులు మహేష్ గౌడ్, హరీష్ గౌడ్, మారుపాకుల అంజి గౌడ్, మట్ట అంజి గౌడ్, మణికంఠ గౌడ్, సాధిక్ బాబాను అదుపులోకి తీసుకున్నామని, మరో నిందితుడు ఎల్లికట్ల కార్తీక్ గౌడ్ పరారీలో ఉన్నాడని చెప్పారు. బాధితురాలి వెంట ఉన్న బంధువును దుండగులు కొట్టి కాళ్లు, చేతులు కట్టేశారని చెప్పారు. సామూహిక లైంగికదాడి అనంతరం దుండగులు బాధితురాలి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారన్నారు. పూర్తి విచారణ అనంతరం నిందితులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సీతారామ ప్రాజెక్టు నిర్మాణంపై మంత్రి తుమ్మల వాస్తవాలు వెల్లడించాలి

- నీళ్ల కేటాయింపులో జిల్లాకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోం
- గోదావరికి గండి ఎందుకు పెట్టారు..?
- ఏప్రిల్ 12న కొత్తగూడెంలో జిల్లా సదస్సు : భద్రాద్రి కొత్తగూడెం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు

తగిన నిధులు కేటాయించి త్వరగా పూర్తి చేయాలి



నవతెలంగాణ-కొత్తగూడెం

సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణంపై మంత్రి తుమ్మల వాస్తవాలు వెల్లడించాలని, తగిన నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తి చేయాలని, జిల్లా రైతాంగానికి నీళ్లు ఇచ్చిన తర్వాతనే ఇతర ప్రాంతాలకు తీసుకుని వెళ్ళాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మంచికంటి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగునీటి కోసం భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా ఉద్యమానికి శ్రీకారం చుట్టిన సీపీఐ(ఎం).. సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లా రైతాంగానికి సాగునీళ్ల ఇవ్వకుండా తరలించే కుట్రలను చూస్తూ ఊరుకోదన్నారు. మంత్రి తుమ్మల గోదావరి జలాలు ఖమ్మం జిల్లాకు తీసుకువచ్చానని గొప్పలు చెప్పుకుంటున్నారని, కానీ దానివల్ల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతాంగంలో తీవ్ర ఆందోళన నెలకొందని అన్నారు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణంలో జరుగుతున్న వాస్తవాలు వెలికి తీయడం కోసం పార్టీ జిల్లా నాయకత్వంతో కలిసి సీతారామ ప్రాజెక్టు నిర్మిస్తున్న కుమ్మరిగూడెం నుంచి జూలూరుపాడు వరకు ప్రాజెక్టు, పంప్ హౌస్‌లు, కాల్వలు పరిశీలించామని తెలిపారు. ఈ సందర్భంగా వెల్లడైన వాస్తవాలు మీడియాకు వివరించారు. మొదలు పెట్టిన ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాలేదని, పని మధ్యలోనే ఆగిపోయిందని, రిజర్వాయర్ లేకుండానే నీళ్లు ఎలా విడుదల చేశారని ప్రశ్నించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గోదావరి నదికి గండి కొట్టించి నీటిని సీతారామ కాలువకు మళ్లించారని విమర్శించారు. ఈ నీళ్ళు దుమ్ముగూడెం ఆనకట్ట వల్ల హెవీ వాటర్ ప్లాంట్, మిషన్ భగీరథ, సింగరేణి అవసరాల కోసం నిల్వ ఉంచిన నీరని, గండి కొట్టడం వల్ల ఇప్పుడు పూర్తిగా అడుగంటి పోయాయని, తాగునీటికి కూడా కష్టాలు వచ్చే ప్రమాదం ఉందని చెప్పారు. ముఖ్యమంత్రిని తీసుకువచ్చి హడావుడిగా ప్రారంభించింది పంప్ హౌస్‌లు మాత్రమేనని చెప్పారు. గోదావరి జలాలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతాంగానికి ఇవ్వడానికి ఎటువంటి పనులు చేపట్టలేదని పరిశీలనలో తెలిసిందని తెలిపారు. భద్రాచలం, పినపాక, కొత్తగూడెం, ఇల్లందు నియోజకవర్గాలకు నీళ్ళు రాకుండా కుట్ర చేసి డిజైన్ మార్చారని ఆరోపించారు. ఇప్పటి వరకు కాలువల కోసం సేకరించిన రైతు భూములకు, నిర్వాసితులకు నష్టపరిహారం, పునరావాసం పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. జూలూరుపాడు వినోబానగర్ నుంచి సాగర్ కాలువకు నీటిని అక్రమంగా మళ్లించడం కోసం హడావుడిగా కాలువలు తవ్వారన్నారు. ఈ విషయాలు తాము గుర్తించామని వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు పెంచి ప్రాజెక్టు నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉన్న చెరువులకు పిల్ల కాల్వల ద్వారా అనుసంధానం చేస్తూ సాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు. పాత డిజైన్ ప్రకారం రోళ్ళపాడుకు నీళ్ళు ఇవ్వాలని కోరారు. దీనిపై ఏప్రిల్ 12న కొత్తగూడెంలో జిల్లా సదస్సు నిర్వహిస్తున్నామని, జిల్లా రైతాంగం మొత్తం కదిలి రావాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్త ఉద్యమానికి సీపీఐ(ఎం) శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే.రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు, అన్నవరపు సత్యనారాయణ, రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కన్వేయర్ బెల్ట్ పునరుద్ధరణ

- ఎస్‌ఎల్‌బీసీ, టన్నెల్ ప్రత్యేక అధికారి శివ శంకర్ లోతేటి వెల్లడి



నవతలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో నిరంతరాయంగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, కన్వేయర్ బెల్ట్ పునరుద్ధరణను వేగవంతం చేసినట్టు ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి తెలిపారు. సహాయక చర్యలపై సోమవారం సహాయక సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం సహాయక చర్యలను నిరంతరం పర్యవేక్షిస్తోందని, ఆర్మీ, ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, హైడ్రా, సింగరేణి మైన్స్ రెస్క్యూ దక్షిణ మధ్య రైల్వే బృందాలు ప్రతికూల పరిస్థితుల్లోనూ 24గంటల పాటు శ్రమిస్తున్నాయని వివరించారు. సహాయక బృందాలు, నిపుణులు సమన్వయంతో పనిచేస్తూ, మైనింగ్ ప్రమాదాల్లో నిష్ణాతులైన వారి సేవలను వినియోగించుకుంటూ ముందుకెళ్తున్నామని ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి తెలియజేశారు. ప్రస్తుతం టన్నెల్‌లో కన్వేయర్ బెల్ట్‌ను 13,630 మీటర్ల నుంచి 13,730 వరకు(వంద మీటర్లు) పునరుద్ధరిస్తున్నట్టు, తద్వారా టన్నెల్ లోపల ఎస్కవేటర్ల సహాయంతో మట్టిని బయటికి తరలిస్తున్నట్టు తెలియజేశారు. టన్నెల్ లోపల సహాయక చర్యలకు అడ్డంకిగా ఉన్న స్టీల్‌ను దక్షిణ మధ్య రైల్వే సిబ్బంది కత్తిరించి లోకో ట్రైన్ ద్వారా బయటికి పంపిస్తోందని వివరించారు. ఊట నీటిని ప్రతిరోజూ అత్యధిక సామర్థ్యం గల పంపుల ద్వారా పంపింగ్ చేస్తున్నారన్నారు. సహాయక సిబ్బంది పండుగ రోజు కూడా పనుల్లో పాల్గొనడం అభినందనీయమని, వారి స్ఫూర్తిని ప్రశంసించారు. మట్టి తవ్వకాలకనుగుణంగా వెంటిలేషన్ పునరుద్ధరణ జరుగుతోందని, సహాయక సిబ్బందికి ఎటువంటి సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశంలో నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ దేవ సహాయం, ఆర్మీ అధికారులు వికాస్ సింగ్, విజయ్ కుమార్, ఎస్‌డీఆర్‌ఎఫ్ అధికారి గిరిధర్ రెడ్డి, హైడ్రా అధికారి సుదర్శన్ రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే అధికారి నేతి చంద్ర, సింగరేణి మైన్స్ రెస్క్యూ అధికారి, జేపీ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలి

- బీజేపీ ప్రభుత్వం మైనారిటీల హక్కులను హరించడానికి ప్రయత్నిస్తోంది : మత పెద్ద మౌలానా అతహర్ సాహెబ్
- నల్లబ్యాడ్జీలు ధరించి ముస్లిముల నిరసన

నవతెలంగాణ- సూర్యాపేట



వక్ఫ్‌బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టే ప్రయత్నాలను వెంటనే ఉపసంహరించుకోవాలని మతపెద్ద మౌలానా అతహర్‌సాహెబ్ డిమాండ్ చేశారు. రంజాన్ పండుగ సందర్భంగా సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఈద్గా మైదానంలో నిర్వహించిన ఈదుల్ ఫితర్ నమాజ్‌కు ముందు మత పెద్ద మౌలానా అతహర్ సాహెబ్ బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ ముస్లిములు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మౌలానా అతహర్ సాహెబ్ మాట్లాడుతూ.. వక్ఫ్ స్థలాలు ఎవరి వ్యక్తిగత సొత్తూ కాదని, అవి తరతరాలుగా ముస్లిముల ఆధీనంలో ఉన్నాయని స్పష్టం చేశారు. వక్ఫ్ బిల్లును పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తోందని, దీనిని అడ్డుకోవడానికి ఆలిండియా ముస్లిం పర్సనల్‌లా బోర్డు కృషి చేస్తోందని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం మైనారిటీల హక్కులను హరించడానికి ప్రయత్నిస్తోందని, ముస్లిముల ఆస్తులను హరించడమే లక్ష్యంగా పెట్టుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, బీహార్ సీఎం నితీష్‌కుమార్ మద్దతుతో అధికారంలోకి వచ్చిన బీజేపీ, ఇటువంటి నిర్ణయాలతో ముస్లింల వ్యతిరేకతను ఎదుర్కొంటోందన్నారు. చిన్నాచితక పార్టీల మద్దతుతో నిలదొక్కుకున్న బీజేపీ ప్రభుత్వం త్వరలోనే పతనమవుతుందని హెచ్చరించారు. బీజేపీ ప్రభుత్వం ముస్లిముల ఆస్తులను స్వాధీనం చేసుకోవడం ద్వారా వారిని ఆర్థికంగా దెబ్బతీయాలని చూస్తోందని ఆరోపించారు. ప్రధానంగా వక్ఫ్ బిల్లు పాసైతే రానున్న కాలంలో వక్ఫ్ స్థలాలను బలవంతంగా లాక్కుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. తద్వారా ఏదైనా వక్ఫ్ స్థలం, మజీద్, ఖబరస్తాన్, మదర్సాల విషయంలో చిన్న చిన్న ఫిర్యాదులొస్తే కలెక్టర్ వాటిని స్వాధీనం చేసుకునే అధికారం కల్పిస్తారన్నారు. ముస్లిములంతా ఐక్యంగా ఉండి, తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

నెల్గోర కొండల్లో ఎన్‌కౌంటర్

- రూ.45 లక్షల రివార్డు గల మహిళా మావోయిస్టు మృతి
- మృతురాలు వరంగల్ వాసి గుమ్మడివేలి రేణుక అలియాస్ దమయంతి అలియాస్ సరస్వతిగా గుర్తించిన పోలీసులు





నవతెలంగాణ-చెర్ల

ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడ, బీజాపూర్ జిల్లాల సరిహద్దు గీధం పోలీస్ స్టేషన్ పరిధి నెల్గోర, ఇకేలి, బెల్నార్ గ్రామాల మధ్య అటవీ కొండల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో రూ.45 లక్షల రివార్డు (ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం రూ.25 లక్షలు, తెలంగాణ ప్రభుత్వం రూ.20 లక్షలు) గల సెంట్రల్ రీజనల్ బ్యూరో (సీఆర్‌బీ) ప్రెస్ టీమ్ ఇన్‌చార్జి, ప్రభాత్ పత్రిక ఎడిటర్ గుమ్మడివేలి రేణుక అలియాస్ సరస్వతి అలియాస్ దమయంతి అలియాస్ భాను అలియాస్ చైతే మృతి చెందినట్టు బస్తర్ ఐజీ సుందర్ రాజ్ తెలిపారు. బెల్నార్, నెల్గోర, ఇకెలి, బెల్నార్ గ్రామం మధ్య ఉన్న దండకారణ్య గుట్టల్లో మావోయిస్టు హై క్యాడర్ ఉన్నారనే నిఘా సంస్థలు ఇచ్చిన సమాచారం ఆధారంగా బస్తర్ ఫైటర్స్, ఎస్‌టీఎఫ్, డీఆర్‌జీ బలగాలు బయలుదేరినట్టు దంతెవాడ పోలీస్ సూపరింటెండెంట్ గౌరవ్ రాయ్ తెలిపారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, దంతెవాడ రేంజ్ కమ్లోచన్ కశ్యప్ మాట్లాడుతూ.. ఆపరేషన్ సమయంలో సోమవారం ఉదయం 9 గంటలకు పోలీసులకు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు ప్రారంభమై సుమారు రెండు గంటల పాటు హోరాహోరీగా కొనసాగిందని అన్నారు. కాల్పుల అనంతరం ఒక మహిళా మావోయిస్టు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

మృతిరాలి వివరాలు బస్తర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, సుందర్‌రాజ్ వెల్లడించారు. మృతురాలు గుమ్మడివేలి రేణుక మావోయిస్టు పార్టీలో సెంట్రల్ రీజనల్ ప్రెస్ టీమ్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. ఆమె ఎల్‌ఎల్‌బీ చేశారు. తెలంగాణలోని వరంగల్ జిల్లా దేవరపల్లి కడవెండి గ్రామానికి చెందిన ఆమె 1996లో నక్సల్స్ పార్టీలో చేరారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎస్‌జెడ్‌సీ ఎం.కృష్ణతో కలిసి పనిచేశారు. 2003లో డీవీసీఎంగా పదోన్నతి పొందారు. 2006లో సౌత్ బస్తర్‌లో సీసీఎం దులా దాదా అలియాస్ ఆనంద్‌తో కలిసి పనిచేశారు. 2013లో మాడ్ ప్రాంతానికి వచ్చి ఎస్‌జెడ్‌సీఎం రామన్నతో కలిసి పనిచేశారు. 2020లో రామన్న కరోనాతో మరణించిన తర్వాత, డీకేఎస్‌సీఎం సెంట్రల్ రీజనల్ బ్యూరో ప్రెస్ టీం ఇన్‌చార్జిగా నియమించబడ్డారు. మావోయిస్టు పార్టీ తరపున ఆమె పత్రికా ప్రకటనలు జారీ చేయడంతోపాటు ప్రభాత్, మహిళా మార్గం, అవామీ జంగ్, పీపుల్స్ మార్చ్, పొడియారో పోలో, ఝుంకార్, సంఘరత్ మహిళ, పితూరి, మిడంగూర్, భూమ్‌కల్ సందేశ్ వంటి పలు పత్రికలను ముద్రించి ప్రచురించేవారని ఐజీ వివరించారు. ఆమె సోదరుడు ఎస్‌జెడ్‌సీఎం జీవీకే ప్రసాద్ అలియాస్ సుఖ్‌దేవ్ అలియాస్ గుడ్సా ఉసెండి 2014లో తెలంగాణలో లొంగిపోయాడు. 2010 నల్లమల్ల ఎన్‌కౌంటర్ (ఆంధ్రప్రదేశ్)లో మరణించిన కేంద్ర కమిటీ సభ్యుడు (సీసీఎం) శంకమూరి అప్పారావు అలియాస్ రవితో 2005లో ఈమెకు వివాహం అయింది. ఘటనా స్థలం నుంచి ఐఎన్‌ఎస్‌ఏఎస్ రైఫిల్, మ్యాగజైన్, మందుగుండు సామగ్రి, ల్యాప్‌టాప్, మావోయిస్టు సాహిత్య, దైనందిక సామగ్రి స్వాధీనపరచుకున్నట్టు ఎస్పీ తెలిపారు.

ఎంపీ వద్దిరాజుకు టీడబ్ల్యూజేఎఫ్ సన్మానం

- రాజ్యసభలో జర్నలిస్టుల రైల్వేపాస్‌లపై స్పందించినందుకు కృతజ్ఞతలు
- రైల్వేమంత్రిని ఒప్పించి పాస్‌లు పునరుద్ధరించేలా కృషి చేస్తానని ఎంపీ హామీ
- జర్నలిస్టుల సమస్యపై వినతి ఇచ్చినందుకు టీడబ్ల్యూజేఎఫ్‌కూ ఎంపీ అభినందనలు



నవతెలంగాణ-ఖమ్మం

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఖమ్మం జిల్లా కమిటీ విజ్ఞప్తిని పార్లమెంటులో ప్రస్తావించినందుకు ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. ఖమ్మంలోని ఎంపీ స్వగృహంలో సోమవారం ఆయన్ను కలిసి కృతజ్ఞత పూర్వకంగా శాలువా కప్పి సన్మానించారు. రాజ్యసభలో ప్రస్తావించడంతో పాటు రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి వినతిపత్రం అందజేయటంపై ధన్యవాదాలు తెలిపారు. జర్నలిస్టుల విషయంలో తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎంపీ రవిచంద్ర హామీ ఇచ్చారు. తన విజ్ఞప్తిపై రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఇప్పటికే రైల్వే టికెట్లలో ప్రజలందరికీ భారీ రాయితీలు ఉన్నాయని రైల్వే మంత్రి ప్రస్తావించినట్టు చెప్పారు. అయినా ఆ ఉన్న టికెట్లపై జర్నలిస్టులకు ఇచ్చిన రాయితీని పునరుద్ధరించాల్సిందేనని తాను కోరినట్టు ఎంపీ తెలిపారు. అవసరమైతే ఈ విషయంలో మిగతా ఎంపీలతో కలిసి సమస్య పరిష్కారం అయ్యేవరకూ కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. తెలంగాణ వ్యాప్తంగా 25 వేల మందికి పైగా జర్నలిస్టులు, దేశవ్యాప్తంగా లక్షల్లో ఉన్న జర్నలిస్టులు ఈ రైల్వే రాయితీని కోవిడ్ అప్పటి నుంచి కోల్పోతున్నారన్న విషయాన్ని తాను రాజ్యసభలో టీడబ్ల్యూజేఎఫ్ ఇచ్చిన వినతినే ప్రస్తావించానని, రైల్వే పాస్‌లను పునరుద్ధరించాల్సిందేనని కోరినట్టు తెలిపారు. వినతిపత్రం ఇచ్చినందుకు టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీని ఎంపీ అభినందించారు. ఎంపీని కలిసిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, నాయకులు సయ్యద్ ఖదీర్, దువ్వా సాగర్, ఆవుల శ్రీనివాస్, వెగినాటి మాధవరావు, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, దుబ్బాకుల శ్రీను, కానంగి భిక్షం తదితరులు ఉన్నారు.

సీసీఐ దీక్షలో వివిధ సంఘాల నాయకులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సిమెంట్ పరిశ్రమ పునరుద్ధరణ కోసం సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ దీక్షలు సోమవారం నాటికి 13వ రోజుకు చేరుకోగా, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. వీరికి సీసీఐ సాధన కమిటీ కోకన్వీనర్ లోకారి పోశెట్టి, అరుణ్ కుమార్, బండి దత్తాత్రి, కొండ రమేష్ పూలమాలలు వేసి ప్రారంభించారు. కేమ లక్ష్మణ్, నీరటి ఉదయ్ కిరణ్, కె.రవి కుమార్, కేంద్ర లక్ష్మణ్, నరేష్, దిలీప్, దిక్షిత్, కౌన్సిలర్ రవి, వినోద్, సురేష్, మార్కెట్ మాజీ చైర్మెన్ కుమ్ర రాజు, బీఆర్ఎస్ బీసీ సంఘం పట్టణాధ్యక్షులు దాసరి రమేష్, పట్టణ ఎస్టీ సెల్ అధ్యక్షులు కుమ్ర శ్రీనివాస్, దయానంద్ పాల్గొన్నారు.

భూములు అప్పగించలేదు..

- టీజీఐఐసీ ప్రకటనను ఖండించిన హెచ్‌సీయూ

నవతెలంగాణ-మియాపూర్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములపై రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) ఇచ్చిన ప్రకటనను హెచ్‌యూసీ ఖండించింది. దీనిపై యూనివర్సిటీ రిజిస్టర్ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వేలం వేసేందుకు నిర్ణయించిన 400 ఎకరాల భూమి ప్రభుత్వానిదేనని టీజీఐఐసీ ప్రకటన విడుదల చేసింది. ప్రాజెక్టు చేపడుతున్న దాంట్లో ఎలాంటి చెరువు లేదని పేర్కొంది. ఆ భూములకు, యూనివర్సిటీకి ఎలాంటి సంబంధం లేదని, తాము న్యాయ పోరాటం చేసి ఆ భూమిని సాధించినట్టు ప్రకటించింది. ఆ భూములు ప్రభుత్వానివేనని స్పష్టం చేసింది. అయితే ప్రభుత్వ ప్రకటనను హెచ్‌సీయూ ఖండించింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములపై ఎలాంటి సర్వే నిర్వహించలేదని హెచ్‌సీయూ రిజిస్ట్రార్ దేవేష్ నిగమ్ పేర్కొన్నారు. భూములను బదిలాయించాలని అంటే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పాలకమండలి, భారత రాష్ట్రపతి ఆధ్వర్యంలో ఉన్న కమిటీ మాత్రమే బదలాయించే హక్కు ఉందని తెలిపారు. ప్రభుత్వానికి భూములు అప్పగించలేదని స్పష్టం చేశారు. ఇటీవల వివిధ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలను ఖండించారు. వివాదస్పదంగా మారిన భూములపై ప్రభుత్వం ప్రకటన చేయడం.. దీన్ని హెచ్‌సీయూ రిజిస్ట్రార్ ఖండించడం చర్చనీయాంశంగా మారింది.

సరుకు కోసం మార్కెట్‌కు వెళ్లిన వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ-నాగోల్

తాను చేసే వ్యాపార సరుకు కోసం మార్కెట్‌కు వ్యక్తి అదృశ్యమైన ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శివ నాగ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం బీదర్ ప్రాంతానికి చెందిన విజయకుమార్ నాగోల్ డివిజన్ పరిధి లోని జైపూర్ కాలనీలో తన కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. అతను నాలుగు చక్రాల తోపుడు బండిపై స్వీట్ కార్న్ వ్యాపారం చేస్తూ ఉండేవాడు. కాగా వ్యాపార సరుకైన స్వీట్ కార్న్ కొనుగోలు కోసం ఈ నెల 30న ఉదయం ఏడు గంటల ప్రాంతంలో మార్కెట్ కు వెళ్లి ఇంటికి మళ్ళీ తిరిగి రాలేదు. దాంతో అతని భార్య నీలిమ భర్త ఆచూకీ కోసం పరిసర ప్రాంతాలలో, తెలిసిన వారి వద్ద విచారించినా ఫలితం లేకపోయింది. దాంతో నాగోల్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

డాక్టర్ ముజీబ్‌కు రంజాన్ శుభాకాంక్షలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్)ను ఆ సంఘం పాఠశాల విద్యాశాఖ సెంట్రల్ ఫోరం అధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్, జాయింట్ సెక్రటరీలు సుదర్శన్, శ్రీనివాస బాబు, ప్రచార కార్యదర్శి శివ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం కలిసి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు మొక్కను అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ ఈసీ ప్రియాదేవ్ ఠాకూర్, ఇబ్రహీం, మహేష్ గౌడ్, పురుషోత్తం, హనుమంతు, రవికాంత్ పాల్గొన్నారు.

సాయి నగర్ గుడిసెల కాలనీలో తాగునీటి సమస్య



- కేవలం 4 నల్లా కలెక్షన్లు.. రోజు విడిచి రోజు నీటి సరఫరా
- లో ప్రెషర్‌తో ఇబ్బంది
- వేసవి వచ్చిందంటే నీటి సమస్య

నవతెలంగాణ- నాగోల్

నాగోల్ డివిజన్ పరిధిలోని సాయి నగర్‌లో గల గుడిసెల కాలనీలో తాగునీటి సమస్యలు నెలకొన్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో 650 కుటుంబాలు నివసిస్తున్నాయని ఇతర వాడకానికి నీటి వనరులు ఉన్నప్పటికీ తాగునీటికి మాత్రం కేవలం నాలుగు నల్లా కలెక్షన్లు మాత్రమే ఉన్నాయని చెబుతున్నారు. అది కూడా రోజు విడిచి రోజు నీటి సరఫరా చేయడం వల్ల తాగునీటి సమస్య అధికంగా ఉందని తెలిపారు. వేసవి కాలం వచ్చిందంటే ప్రతి సంవత్సరం తమ కాలనీలో తాగునీటి సమస్యలు ఎదుర్కోవడం తప్పడం లేదని ఆరోపిస్తున్నారు. అలాగే లో ప్రెషర్ సమస్యంతో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందన్నారు. ఉదయం సమయంలోనే నీరు సరఫరా చేయడం వల్ల తాగునీటిని పట్టుకోవడానికి ఒక్కొక్కసారి జీవనోపాధి కోసం వెళ్లే కూలీ ఇతర పనులను కూడా వదులుకోవాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది తాగునీటి కోసం పడిగాపులు కాచుకుంటూ కూర్చుంటే కుటుంబం గడవడం కష్టమవుతుందని పరిసర ప్రాంతాల్లోని కిరాణాల వద్ద ఫిల్టర్ వాటర్‌ను కొనుగోలు చేసుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా, అధికారులు మారినా తమ సమస్యను పరిష్కరించలేకపోతున్నారని అన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకున్న ఫలితం లేకపోయిందన్నారు. ఇప్పటికైనా వారు స్పందించి తాగునీటి సమస్యపై దష్టి సారించి పరిష్కరించాలని సాయి

అయ్యా మాకు గుక్కెడు మంచినీళ్లు ఇచ్చి పుణ్యం కట్టుకోండి



అయ్యా ఎండాకాలం మాకు గుక్కెడు మంచినీళ్లు ఇచ్చి పుణ్యం కట్టుకోండి. కాలనీలో తక్కువ నల్లా కనెక్షన్‌లు ఉండడంతో వచ్చిన 2 గంటల పాటు తాగునీటిని కాలనీలో అందరం పట్టుకోలేక అవస్థలు ఎదుర్కొం టున్నాం. మా అవస్థలను పట్టించుకోని పరిష్కరించాలి. ఇప్పటికైనా మా కాలనీలో నల్ల కలెక్షన్ లుపెంచి ఎగుడు దిగుడు లేకుండా అందరికీ ఒకే రకంగా నీటి సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలి

\- కాలనీ వాసి నరసమ్మ

మా కాలనీలో తాగునీటి సమస్యను తీర్చండి



మా కాలనీలో ఎండాకాలం వచ్చిందంటే త్రాగునీటి భయం వెంటాడుతోంది. కాలనీలో రోజువారి కూలీ పని చేసుకునే నిరుపేదలమే ఉన్నాము. పేదల పట్ల ఇంత నిర్లక్ష్య వైఖరి ఉండకూడదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తమపై కనికరించి మా గుడిసెల కాలంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలి.

\- కాలనీ వాసి వెంకటేష్

అగ్ని ప్రమాదాలకు అడ్డాగా జల్‌పల్లి

- ప్రత్యక్షంగా,పరోక్షంగా అగ్నికి ఆహ్వానం పలుకుతున్న ప్రభుత్వ అనుమతి లేని గోదాములు
- పొగతో కాలనీలోని ఇండ్లలో ఉండలేని పరిస్థితి
- తాజాగా సోఫా పరుపుల తయారీ కంపెనీలో అగ్ని ప్రమాదం
- ప్రమాదాలను నివారించాలని కోరుతున్న స్థానికులు





నవతెలంగాణ-బడంగ్‌పేట్

జల్ పల్లిలో ప్రభుత్వ అనుమతి లేకుండా వెలుస్తున్న అనేక ప్రయివేటు కంపెనీల ప్లాస్టిక్ గోదాములు, కాలుష్య రహిత పరిశ్రమలలు అగ్ని ప్రమాదాలకు అడ్డాగా మారుతున్నాయి. పలు కాలనీలలో ఇండ్లకు ఆనుకొని గోదాములు నిర్మించడం, రోజు ఏదో ఒకచోట అగ్ని ప్రమాదాలు, మంటలు చెలరేగటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. షార్ట్ సర్క్యూట్ తో మంటలు అంటుకొని గోదాములు ఖాళీ బూడిద అవుతున్నాయి. మరో పక్క పరోక్షంగా రోజు ప్లాస్టిక్ గోదాములకు చెందిన వేస్టేజ్ ప్లాస్టిక్ ను కాలుస్తూ, పొగతో ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు.

జల్ పల్లి మున్సిపాలిటీలో సోఫా పరుపుల తయారీ కంపెనీలో సోమవారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. రంజాన్ పండుగ సందర్భంగా సోఫా పరిశ్రమలు పనిచేసే సిబ్బంది ఉదయమే నమాజ్ చేసి నిద్రలో ఉండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి భారీగా మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు పహాడీ షరీఫ్ పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే పహాడీ షరీఫ్ ఎస్సై లక్ష్మణ్, పోలీస్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక సిబ్బందితో కలిసి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయితే మంటలను ఆర్పినా అందులో గల స్పాంజ్ సామాగ్రి పూర్తిగా ఖాళీ బూడిదయ్యింది. ప్రమాదవశాత్తు ఎవరికీ ప్రాణనష్టం జరగలేదు. కానీ లక్షల్లో ఆస్తి నష్టం జరిగిందని కంపెనీ సిబ్బంది తెలిపారు.

అయితే గత కొన్నాళ్లుగా జల్ పల్లి గ్రామంలో చార్మినార్ కు చెందిన మొహమ్మద్ అనే వ్యక్తి గుట్టుచప్పుడు కాకుండా ఇండ్ల మధ్యలో పరుపులకు సంబంధించిన, స్పాంజ్ కంపెనీని ఏర్పాటు చేసి వ్యాపారం నిర్వహిస్తూ, లక్షల్లో సంపాదిస్తున్నాడని పలువరు చెబుతున్నారు. తమ ఇండ్లకు మధ్యలో ఇలాంటి అగ్ని ప్రమాదాలు చెందిన కంపెనీ ఉందని కూడా తెలియకుండా అగ్ని ప్రమాదాలకు అడ్డాగా మారుస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారీ మంటలు రావడంతో ఇండ్లలోకి కూడా మంటలు వ్యాపించి, పొగతో స్థానికులు బయటికి పరుగులు తీసే పరిస్థితి అక్కడ నెలకొంది. అయితే ఇది ఇలా ఉంటే జల్ పల్లిలో ఇలాంటి అగ్ని ప్రమాదాలు రోజు ఏదో ఒకచోట జరుగుతున్నాయని, వాటి ద్వారా పొగ వ్యాపించి, దీర్ఘ కాలిక రోగాలు వ్యాప్తి చెంది, చిన్నపిల్లలు, పెద్దవాళ్లు అనేక ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. జల్ పల్లిలో రాత్రి పగలు అనే తేడా లేకుండా, మంటలు చెలరేగుతున్నాయని పరిస్థితి ఇలానే ఉంటే జల్ పల్లిలో ప్రజలు రోగాలతో బతకలేని పరిస్థితి ఏర్పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై అధికారులు, పోలీసులు ఎందుకు చర్యలు ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నిస్తున్నారు. అనుమతులు లేకుండా నడుస్తున్న ప్లాస్టిక్ గోదాములు, పరుపులు ఇతరత్రా పరిశ్రమలపై అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

హత్యకు దారితీసిన సహజీవనం



నవతెలంగాణ-దిల్ సుఖ్ నగర్

సహజీవనం చేస్తున్న ఒక వ్యక్తి హత్యకు గురైన ఘటన సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సరూర్ నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం పులిమామిడి గ్రామానికి చెందిన బచ్చు వెంకటేశ్వర్లు అలియాస్ రాజు గత కొంత కాలంగా కర్మాన్ ఘాట్ జానకి ఎన్ క్లేవ్‌లో నివాసం ఉంటున్నాడు. కుటుంబ కలహాల కారణంగా కర్మన్ ఘాట్ ప్రాంతంలో ఒంటరిగా ఉంటూ ఫైనాన్స్ వ్యాపారం చేసుకుంటున్నాడు. ఇదే ప్రాంతంలో ఉంటున్న సూర్యాపేట జిల్లాకు చెందిన ఓ మహిళతో కలిసి సహజీవనం చేస్తున్నాడు. ఆ మహిళ తన భర్త చనిపోవడంతో కూతురు కొడుకుతో కలిసి కర్మాన్ ఘాట్ ప్రాంతంలో ఉంటోంది. అయితే తన కూతురు కొడుకును మరోచోట అద్దెకు తీసుకున్న ఇంటిలో ఉంచి వెంకటేశ్వర్లుతో సహజీవనం చేస్తున్నది. ఆదివారం ఉగాది పండుగ సందర్భంగా కర్మాన్ ఘాట్ జానకి ఎన్ క్లేవ్ లో ఉంటున్న మహిళ దగ్గరకు కూతురు, కొడుకు పవన్ వచ్చారు. మహిళతో సహ జీవనం చేస్తున్న వెంకటేశ్వర్లుకు, ఆమె కొడుకు పవన్‌కు ఆదివారం అర్ధరాత్రి వాదులాట జరిగింది. ఈ వాదులాటలో మాటమాట పెరిగి వెంకటేశ్వర్లును సదరు మహిళ కొడుకు పవన్ కత్తితో పొడిచాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని వెంకటేశ్వర్లును హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే చనిపోయాడని వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని సరూర్ నగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



హయత్ నగర్‌లో అగ్నిప్రమాదం

నవతెలంగాణ- హయత్ నగర్

హయత్ నగర్‌లోని స్క్రాప్ దుకాణంలో అగ్నిప్రమాదం జరిగిన ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఫైర్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం హయత్ నగర్ లోని ముదిరాజ్ నగర్ లో ఉన్న లక్ష్మీ ప్రియ కాలనీలో ఓ వ్యక్తి జనావాసాల మధ్య స్క్రాప్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు చుట్టుపక్కల సిగరెట్ తాగుతూ మంటలు అందించడంతో ఒకసారిగా అందులో భారీగా మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల జనావాసాలు ఎక్కువగా ఉండడంత హయత్ నగర్, ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం నుంచి ఫైర్ వాహనాలను తీసుకుని వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేరు. కానీ సుమారు 4 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని అంచనా వేశారు. హయత్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఉగాది వేడుకలో గరికపాటి ప్రభాకర్ స్వర రాగ అవధానం



నవతెలంగాణ-కల్చరల్

తెలుగు వారు ఖండంతరాన ఉన్నా తమ సంప్రదాయాలు పండుగలు మరువకుండా జరుపుకుంటున్నారనేందుకు నిదర్శనంగా అమెరికా లో కాలిఫోర్నియా నగరంలోని సిలికానాంధ్ర సంస్థలో విశ్వ వసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భం గా యువ అవధాని గరికపాటి వెంకట ప్రభాకర్ స్వర రాగ అవధానం రెండు గంటల పైగా చేశారు. పృఛకులు వివిధ అంశాలపై అడిగిన ప్రశ్నలకు వెను వెంటనే అవధాని ప్రభాకర్ రాగ యుక్తంగా సమాధానాలిచ్చి శ్రోతల ప్రశంసలు అందుకున్నారు. సిలికానాంధ్ర వ్యవస్థాపకుడు కూచిబోట్ల ఆనంద్ మాట్లాడుతూ అవధాన ప్రక్రియ పలు రూపాలుగా ఉంటుందన్నారు గరికపాటి ప్రభాకర్ రాగావధానం ఎంచుకోవటంలో విశేష ముందని, ఆయనకు గానం లోనూ అవగాహన ఉండటమే కారణమన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ హిందీ తెలుగు సాహితీ వేత్త డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ శాలువా జ్ఞాపికలతో అవధాని ప్రభాకర్‌ను పృచ్ఛకులను సత్కరించారు. శాంతి కూచిభోట్ల కార్యక్రమాన్ని సమన్వయం చేశారు

అధైర్యపడొద్దు అండగా ఉంటాం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ-రాజేంద్రనగర్



బీఆర్ఎస్ కార్యకర్తలు ఎవ్వరు అధైర్యపడవద్దని వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. సోమవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నూతన అధ్యక్షునిగా మాజీ కౌన్సిలర్ వెంకటేష్‌ను నియమించారు. మాజీ మంత్రి చేతుల మీదుగా వెంకటేష్ నియమాక పత్రాన్ని అందుకున్నాడు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో పటిష్టంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత నూతన అధ్యక్షుడు వెంకటేష్ పై ఉందని ఆమె స్పష్టం చేశారు. నిత్యం డివిజన్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటూ కాంగ్రెస్ నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేవరకూ క్షేత్రస్థాయిలో పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యకర్తలకు ఎలాంటి సమస్యలు తన దృష్టికి తీసుకొని వస్తే ఆ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నూతన అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో డివిజన్ అధ్యక్షునిగా నియమించినందుకు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి, రాజేంద్రనగర్ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇక నుంచి డివిజన్‌లోని సమస్యల మీద రాజీలేని పోరాటం చేస్తానని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేవరకూ క్షేత్రస్థాయిలో ప్రజలతో కలిసి పోరాటం చేస్తానని ఆయన స్పష్టం చేశారు. త్వరలో డివిజన్‌లోని అన్ని కమిటీలను పూర్తిస్థాయిలో వేస్తామని తెలిపారు. కార్తీక్‌రెడ్డిని రాజేంద్రనగర్ ఎమ్మెల్యేగా చూడాలనేదే మా అంతిమ లక్ష్యం అని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సుభాష్‌రెడ్డి, రమేష్ ముదిరాజ్, నోముల రాము యాదవ్, ఎడ్లకాడి సూర్యం, రాజు, రాఘవేందర్, సందీప్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

- ఈద్గాల వద్ద నమాజ్ చేసిన ముస్లింలు
- ఒకరికొకరు శుభాకాంక్షలు ...



నవతెలంగాణ- బడంగ్‌పేట్

జల్ పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న అన్ని కాలనీల్లో ఉన్న ముస్లీం సోదరులు సోమవారం రంజాన్ పర్వదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాల వద్ద ప్రత్యేకంగా నమాజ్ చేసి ఒకరికి ఒక్కరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. 29 రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు చేపట్టి రంజాన్ పండుగను జరుపుకున్నారు.నెల వంక చూసి ఆనందం వ్యక్తం చేశారు.చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ కలిసి ఈద్గాల వద్దకు చేరుకుని నమాజ్ చేసి తాము కష్టపడి సంపాదించిన దానిలో కొంత పేదలకు సహాయం చేయాలని కురాన్ గ్రంథంలో ఉన్నందున సహాయం చేశారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లీంలకు మహేశ్వరం డీసీపీ సునీత రెడ్డి, ఏసీపీ లక్షికాంత్ రెడ్డి,బాలాపూర్, పహడి షరీఫ్ ఇన్స్పెక్టర్ సుధాకర్,గురువారెడ్డిలు రాయల్ కాలనీ,రోషన్ దౌలాల వద్ద ఉన్న ఈద్గాల వద్దకు చేరుకుని ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ముస్లీం సోదరులు, ఎస్సైలు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ముస్లిం కుటుంబానికి ఎంపీ రంజాన్ శుభాకాంక్షలు

నవతెలంగాణ- హయత్ నగర్

మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని సహారా ఎస్టేట్స్ కాలనీ అధ్యక్షుడు సయ్యద్ జానీ స్వగృహానికి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ సోమవారం స్వయంగా వెళ్లి ఆయన కుటుంబానికి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలు నెల రోజులపాటు ఉపవాస దీక్షలు, ప్రార్థనలు చేసి నెల చివరి రోజున ఎంతో పవిత్రంగా భక్తిశ్రద్దలతో రంజాన్ పండుగ జరుపుకుంటారని అన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొప్పుల నర్సింహ రెడ్డి, బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు మునగాల హరీష్ రెడ్డి, నాంపల్లి రామేశ్వర్, పాతూరి శ్రీధర్ గౌడ్, ముత్యంరెడ్డి, కాలనీ వాసులు రాఘవేందర్, శీనయ్య, భీమ్లా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఉపేందర్ రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్ : ముస్లిం సోదరులకు రాష్ట్ర యువజన కాంగ్రెస్ నేత చిలుక ఉపేందర్ రెడ్డి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గం ఆర్ కె పురం డివిజన్ ఎన్టీఆర్ నగర్ లోని ఈద్గా వద్ద సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మైనారిటీ సోదరులను కలుసుకొని వారికి



ఉపేందర్ రెడ్డి రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖిల్లా మైసమ్మ దేవాలయం డైరెక్టర్ పగడాల శ్రీశైలం, అక్బర్, పెద్దవూర సైదులు, లింగుస్వామి, నభి, పాండు, బొడ్డపల్లి నగేష్, షఫీ, అక్రమ్, వినయ్, జహంగీర్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్ మెట్‌లో ఘనంగా రంజాన్ వేడుకలు

అబ్దుల్లాపూర్ మెట్ : అబ్దుల్లాపూర్ మెట్ మండలం లోని వివిధ గ్రామాల్లో రంజాన్ పండుగను ముస్లీం సోదరులు సంప్రదాయం బద్దంగా ప్రార్థనలు చేసి పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. అబ్దుల్లాపూర్ గ్రామంలో ముస్లిం నాయకులు



మహమ్మద్ నసీరుద్దీన్, షఫీరుద్దీన్, నవాజ్ పాషా ఆధ్వర్యంలో స్థానిక మజీద్ లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం సంప్రదాయం బద్దంగా ఒకరికొకరు కలుసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు



రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ- హయత్ నగర్

హయత్ నగర్ పెద్ద మసీద్‌లో ముస్లిం మత పెద్దలు నిర్వహించిన ప్రార్థన వేడుకల్లో ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. మతసామరస్యానికి ప్రతీకగా రంజాన్ పండుగ నిలుస్తుందని అన్నారు. మాజీ కార్పొరేటర్ సామ తిరుమలరెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు చెన్నగోని రవీందర్ గౌడ్,సుధాకర్ గౌడ్, నరేష్ గౌడ్, పాండు నాయక్, రఫిక్ తదితరులు పాల్గొన్నారు.



తుర్కయంజాల్ : తుర్కయంజాల్ మున్సిపాలిటీ వ్యాప్తంగా రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముస్లింలు మసీదులకు వెళ్లి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. చిన్నాపెద్దలు పరస్పరం ఆలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈద్గాల వద్ద ప్రార్థనలు చేసి ఈద్ ముబారక్ చెబుతూ ప్రేమ ఆప్యాయతలతో పలకరించుకున్నారు. ఇంజాపూర్‌లో జరిగిన వేడుకల్లో కాంగ్రెస్ సీనియర్ నేత గుండ్లపల్లి ధన్‌రాజ్‌గౌడ్, మహ్మద్ గౌస్ పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. పవిత్రమైన రంజాన్ మాసంలో నెలరోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు ఆచరించి, పండుగ జరుపుకున్న ముస్లింలందరికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి కుటుంబానికి ఆనందం, ఐశ్వర్యాలను అల్లా ప్రసాదించాలని కోరుకున్నట్టు ఆకాంక్షించారు.వేడుకల్లో మాజీ కో ఆప్షన్ మెంబర్ సుజత్ అలీ, ముస్లిం పెద్దలు జుల్ ఖదర్ అలీ, సయ్యద్ సలీం, సయ్యద్ రషీద్, ఫైజల్ అలీ, ఎండీ ఫరాన్, ఫర్దీన్ ఖాన్, అమాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయి

- టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస గుప్తా



నవతెలంగాణ- నాగోల్

మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకొని ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాలు ప్రజల దాహార్తి తీర్చడానికి ఎంతో ఉపయోగపడతాయని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో అమర నాగేందర్ సౌజన్యంతో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మెన్ రాజమౌళి, మాజీ కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, ఐవీఎఫ్ రాష్ట్ర నాయకులు పబ్బా చంద్రశేఖర్, కటకం శ్రీనివాస్, కొడిప్యాక నారాయణ, నంగునూరి సత్యనారాయణ,గోలి సంతోష్, ఐవీఎఫ్ సిద్దిపేట జిల్లా మహిళా అధ్యక్షురాలు స్వప్న, జిల్లా అధ్యక్షుడు నేతి శ్రీనివాస్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం శ్రీ సీతారామ ఉమామహేశ్వర ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి నిర్మాణంలో ఉన్న శ్రీ కమలం వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణ పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో అందరూ కోరుకున్నది నెరవేరాలని ఆకాంక్షించారు, ప్రతి ఒక్కరూ సేవా నిరతి కలిగి ఉండాలన్నారు. చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆర్యవైశ్యులకు అండగా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఐవీఎఫ్ యువజన అధ్యక్షుడు ఎన్‌సీ సంతోష్, పట్టణ అధ్యక్షుడు కైలాస ప్రభాకర్, అత్తెల్లి కిషన్, ఆదిమూలం నారాయణ, జె శేఖర్, ప్రసాద్, సామ శ్రీధర్, దొంతుల సత్యనారాయణ, సంపత్, కొమురవెల్లి ప్రవీణ్, నోముల మహేందర్, బాలేష్, సంతోష్ ,ఫ్రెండ్స్ ఫర్ యు అసోసియేషన్ నాయకులు, ఆర్యవైశ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహేష్ గౌడ్‌కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు



నవతెలంగాణ - చర్లపల్లి

చర్లపల్లి డివిజన్‌కు చెందిన యువ నాయకుడు నేమూరి మహేష్ గౌడ్ పుట్టిన రోజు వేడుకలను సోమవారం సిరి గార్డెన్‌లో నిర్వహించారు. ఈ వేడుకలకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఆయనతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు మహేష్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పన్నాల దేవేందర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, తదితరులున్నారు.

పేద మహిళలకు చీరలు పంపిణీ



నవతెలంగాణ-ఉప్పల్

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం ఉప్పల్‌లో బుడే సాహెబ్ తనయుడు (మున్నా) మదర్ వలి తన నివాసం వద్ద పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఉప్పల్ మాజీ చైర్మెన్ మేకల శివారెడ్డి, కాంగ్రెస్ నాయకులు బజార్ మురళి గౌడ్, వినోద్ ముదిరాజ్‌లు మదర్ వలి కుటుంబ సభ్యులతో కలిసి పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఉపవాసం ఉండి ప్రార్థన చేస్తూ, అత్యంత భక్తితో చేసుకునే పండుగ రంజాన్ అని, ఈ సందర్భంగా ఆయన తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ పేదలకు చీరలు పంపిణీ చేసి, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడాన్ని అభినందించారు.

రంజాన్ త్యాగానికి ప్రతీక



- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-కాప్రా

రంజాన్ త్యాగానికి ప్రతీక అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం రంజాన్ సందర్భంగా కాప్రా డివిజన్ పరిధిలోని పలు ఈద్గాల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ప్రజలందరికీ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసంలో నిర్వహించే ఉపవాస దీక్షలు, దైవ ప్రార్థనలతో సామరస్యం, ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షిస్తు న్నానని చెప్పారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం విశిష్టత అని పేర్కొన్నారు. సేవా దృక్పథానికి, సహనానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నేమూరి మహేష్‌గౌడ్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-కాప్రా

బీఆర్ఎస్ నాయకుడు నేమూరి మహేష్ గౌడ్ పుట్టిన రోజు వేడుకలు సోమవారం సిరి గార్డెన్‌లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై మహేష్‌గౌడ్‌ను ఆశీర్వదించారు. చర్లపల్లి డివిజన్ టీం ఎస్ఎస్‌సీ బాయ్స్, యువత అధిక సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

దశదినకర్మకు హాజరైన ఎమ్మెల్యే మల్లారెడ్డి



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మాజీ ఎంపీటీసీ, మాజీ కౌన్సిలర్ నడికొప్పు నాగరాజు తండ్రి నడికొప్పు చిన్న నర్సింహ ముదిరాజ్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. కాగా సోమవారం మేడ్చల్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన చిన్న నర్సింహ దశదినకర్మకు ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి హాజరై వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారితో పాటు పలువురు రాజకీయ పార్టీల నాయకులు హాజరై నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్, మండల అధ్యక్షులు భాస్కర్ యాదవ్, దయానంద్ యాదవ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు అకిటి నవీన్ రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లంపేట్ జగన్ గౌడ్, నాయకులు సందీప్ గౌడ్, ఒగ్గు శంకర్, మల్లికార్జున్ స్వామి, మాజీ సర్పంచ్ సంజీవయ్య, బీజేవైఎం జిల్లా కార్యదర్శి రాఘవ రెడ్డి, బీజేవైఎం మున్సిపాలిటీ అధ్యక్షులు వంశీ విజయ్, బీజేపీ మండల కార్యదర్శి మహేష్ తదితరులు ఉన్నారు.

పేదలను బలిగొంటున్న కార్పొరేట్ ఆస్పత్రులు



- బీజేపీ మేడ్చల్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి ఏనుగు సుదర్శన్ రెడ్డి

నవతెలంగాణ-ఘట్కేసర్

కార్పొరేట్ ఆసుపత్రుల ధనదాహానికి పేదలు, మధ్యతరగతి ప్రజల జీవితాలను బలైతున్నాయని బీజేపీ మేడ్చల్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి ఏనుగు సుదర్శన్ రెడ్డి అన్నారు. ఘట్కేసర్ మండలం అవుషాపూర్‌కు చెందిన సందీప్ గౌడ్ కడుపునొప్పితో బాధపడుతూ ఉప్పల్‌లోని సిటీ న్యూరో హాస్పిటల్‌కు వెళితే బాధితుడికి సరైన అవగాహన కల్పించకుండా వైద్యం చేస్తున్నట్టు నటించడంతో బాధితుడు ప్రాణాలు కోల్పోయాడు. సోమవారం అవుషాపూర్ గ్రామస్తులు, పలువురు రాజకీయ నాయకులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఏనుగు సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ..డబ్బులకు కక్కుర్తి పడి కార్పొరేట్ వైద్యం పేరుతో చేస్తున్న దోపిడీని ప్రభుత్వాలు అరికట్టకపోతే ఈ విధమైన నిర్లక్ష్యాలతో సామాన్యులు సమిధలు అవ్వడం ఖాయమన్నారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా ప్రభుత్వ వైద్య రంగాన్ని బలోపేతం చేయాలన్నారు.

లక్ష్మీనగర్ కాలనీ ప్రెసిడెంట్‌గా చుంకు శ్రీనివాస్



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి సర్కిల్ మౌలాలి డివిజన్ పరిధిలోని లక్ష్మీ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా చుంకు శ్రీనివాస్ 23 ఓట్ల మెజారిటీతో ప్రత్యర్థి బి. ప్రతాప్‌రెడ్డిపై గెలిచారు. చుంకు శ్రీనివాస్ వరుసగా రెండోసారి ప్రెసిడెంట్‌గా గెలిచారు. అంతకుముందు లక్ష్మీ నగర్ కాలనీకి జనరల్ సెక్రెటరీగా 12 ఏండ్లు సేవలందించారు. వీరి ప్యానెల్ జనరల్ సెక్రెటరీ, ట్రెజరరీ సమీప ప్రత్యర్థులపై గెలిచారు. ఈ సందర్భంగా చుంకు శ్రీనివాస్ మాట్లాడుతూ మరోసారి తనను ప్రెసిడెంట్ గెలిపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. నూతన కమిటీ ప్రెసిడెంట్‌గా చుంకు శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీగా బి. నరసింగ్ రావు, ట్రెజరర్ గా హెచ్. సతీష్‌లను ఎన్నుకున్నారు. నూతన కమిటీని కాలనీ సభ్యులు సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

అల్వాల్‌లో భారీ చోరీ





- నిందితుల అరెస్ట్
- రూ.9 లక్షల సొత్తు స్వాధీనం

నవతెలంగాణ-అల్వాల్

అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మార్చి 27, 28 తేదీల్లో జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. సోమవారం ఏసీపీ రాములు మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు తెలిపారు. మైలారం కౌశిక్ (బబ్లూ) (19), బండారి రవితేజ (20) అనే ఇద్దరు నిందితులు మార్చి 27న మద్యం మత్తులో దొంగతనానికి పథకం వేశారు. అల్వాల్ ఏరియాలోని ఓ ఇంట్లోకి చొరబడి 12.3 తులాల బంగారం, నగదు దోచుకున్నారు. కేసును ఛేదించేందుకు పోలీసులు క్లూస్ టీం సహాయంతో సీసీటీవీ ఫుటేజీలు పరిశీలించి జానజిగూడ ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి చోరీకి ఉపయోగించిన స్పెండర్ ప్లస్ బైక్‌తో సహా రూ.9 లక్షల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు హస్మత్‌పేటకు చెందిన వారుగా గుర్తించారు. నిందితుడు రవితేజ గతంలో మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జైలుకు వెళ్లొచ్చాడు. కాగా ఈ కేసును ఛేదించిన పోలీస్ సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు. ఈ సమావేశంలో ఎస్‌హెచ్‌ఓ రాహుల్ దేవ్, డీఐ తిమ్మప్ప, సీసీఎస్ ఎస్ఐ దల్ నాయుడు, జీవన్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ మోహన్ నాయక్, సుధాకర్ , రమాకాంత్, గౌస్, విద్యాకర్, పాల్గొన్నారు.

అంబలి కేంద్రం ఏర్పాటు అభినందనీయం





- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- దాచేపల్లి ధనలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు

నవతెలంగాణ - చర్లపల్లి

సేవే పరమావధిగా అంబలి కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీరుస్తున్న డీడీఎల్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం నాచారం ప్రధాన రహదారి మహంకాళి ఆలయం ఎదురుగా డీడీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్‌తో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వేసవిలో పేదల ఆకలి తీర్చేందుకు అంబలి కేంద్రం దోహదపడుతుంద న్నారు. బాటసారుల ఆకలి తీర్చాలనే ట్రస్టు లక్ష్యం మనందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఏ రంగంలోనైనా సేవ చేయడం ద్వారానే సంతోషం కలుగుతుందన్నారు. ట్రస్ట్ చైర్మెన్ శరత్ బాబు మాట్లాడుతూ.. ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి 3500-4000 మందికి 60 రోజుల పాటు అంబలి అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మెన్ నాగ కిషోర్, అధ్యక్షుడు అరవింద్, ప్రధాన కార్యదర్శి రామ్ రాజ్, కోశాధికారి జె.నరసింహారావు, ట్రస్టు ప్రతినిధులు సంతోష్, అరవింద్, హెూప్‌సన్, అభిరామ్, భరత్ తదితరులున్నారు.

తుడుం గణేష్‌కు ఎమ్మెల్యే మల్లారెడ్డి పరామర్శ



నవతెలంగాణ-మేడ్చల్

ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న మేడ్చల్ మున్సిపాలిటీ 4వ వార్డు మాజీ కౌన్సిలర్ తుడుం గణేష్‌ను ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సోమవారం తుడుం గణేష్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు దయానంద్ యాదవ్, మున్సిపల్ అధ్యక్షులు భాస్కర్ యాదవ్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు అకిటి నవీన్ రెడ్డి, నాయకులు సందీప్ గౌడ్, ఒగ్గు శంకర్, మోహన్ రెడ్డి, బీఆర్ఎస్వీ మున్సిపల్ అధ్యక్షులు శ్రీనాథ్, అరవింద్, యువ నాయకులు రఘు, సాయి కమల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి పరామర్శ

మండల పరిధిలోని పూడూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త గోపనబోయిన బాలనందం ఇటీవల క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ మరణించారు. కాగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సోమవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరమర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల,మున్సిపల్ అధ్యక్షులు దయానంద్ యాదవ్, భాస్కర్ యాదవ్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు అకిటి నవీన్ రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు డప్పు కృష్ణ,మాజీ సర్పంచ్ బాబు యాదవ్,మాజీ ఎంపీటీసీ రఘు, నాయకులు శేఖర్ రెడ్డి,లక్ష్మణ్, శంకర్, బక్క శేఖర్ తదితరులు ఉన్నారు.

కాలనీ అభివృద్ధిలో ముందుకు సాగాలి : ఎమ్మెల్యే మర్రి

- నూతన కమ్యూనిటీ హాల్ ప్రారంభం



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ఎన్‌బీహెచ్ కాలనీ అసోసియేషన్ సభ్యుల సమక్షంలో కాలనీ మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మల్కాజిగిరి సర్కిల్ వినాయక నగర్ డివిజన్ ఎన్‌బీహెచ్ కాలనీలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను సోమవారం స్థానిక కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్‌బీహెచ్ కాలనీ వాసులు ప్రభుత్వంపై ఆధారపడకుండా తమ సొంత డబ్బులతో కమ్యూనిటీ హాల్‌ను నిర్మించుకోవడం, ఇతర కాలనీలకు ఆదర్శంగా ఉంటుందని అభినందించారు. కాలనీ అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు విజయ్ కుమార్ , శివచారం సింగ్, ప్రతాపన్, బాలాజీ, స్వామి చారి, వెంకటేష్ యాదవ్, భావనా, స్థానిక కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ సంక్షేమానికి అండగా నిలుస్తాం

- లయన్స్ వైస్ డిస్టిక్ గవర్నర్, విశ్వకర్మ ట్రస్ట్ సభ్యులు డాక్టర్ లయన్ మండా సురేష్ కుమార్



నవతెలంగాణ-కాప్రా

విశ్వకర్మల సంక్షేమానికి, నిరుపేద విద్యార్థుల ఉన్నత విద్యకు తాను అండగా నిలుస్తానని కాప్రా విశ్వకర్మ ట్రస్ట్ సభ్యులు, లయన్స్ క్లబ్ వైస్ డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ బండా సురేష్ కుమార్ అన్నారు. విశ్వకర్మ ట్రస్ట్ భవన నిర్మాణానికి చేయూత, నిరుపేద విశ్వకర్మల సంక్షేమం కోసం కృషి చేయడంతో పాటు లయన్స్ క్లబ్ వైస్ డిస్టిక్ గవర్నర్‌గా ఎన్నికైన సందర్భంగా కాప్రా విశ్వకర్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో కలకొండ భిక్షపతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మండా సురేష్‌ను ఘనంగా సన్మానించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో ఉన్న తృప్తి ఎక్కడా దొరకదు అన్నారు. స్థోమత కలిగిన ప్రతి ఒక్కరూ ఇతరులకు సహాయం చేయాలని కోరారు. లయన్స్ క్లబ్ ద్వారా జిల్లాలో క్యాన్సర్ ఆసుపత్రిని స్థాపించడానికి ప్రణాళిక రూపొందించామని ఆయన స్పష్టం చేశారు. చైర్మెన్ కలకొండ భిక్షపతి మాట్లాడుతూ విశ్వకర్మ ట్రస్టులోనే కాకుండా విశ్వకర్మ, ఇతరులైన నిరుపేదలను ఆదుకోవడానికి కృషి చేస్తున్నామన్నారు. విశ్వకర్మ ట్రస్ట్ భవనం పూర్తి కావడానికి ట్రస్టు సభ్యులు మరింత కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. భవనం ద్వారా వచ్చే ఆదాయాన్ని విశ్వకర్మ నిరుపేద విద్యార్థులు, నిరుపేద యువతులకు వివాహానికి ఖర్చు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ గ్రీన్‌సిటీ మాజీ అధ్యక్షులు లయన్ వడ్లోజు జ్యోతిర్మయా చారి, ప్రధాన కార్యదర్శి మహంకాళి, నరసింహ చారి, స్థలదాత మారోజు నరసింహ చారి, కోశాధికారి ఆందోజు రామాచారి, సభ్యులు కలకొండ మధుసూదనాచారి, విష్ణు సాయి ప్రసాద్, లయన్స్ క్లబ్ ఆఫ్ భాగ్యనగర్ గ్రీన్ సిటీ అధ్యక్షులు రమాదేవి, లయన్ బండ వసంత తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఒకరి మృతి



-మరొకరికి గాయాలు

నవతెలంగాణ-కీసర

అతి వేగం కారణంగా ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం కీసర ఔటర్ రింగ్ రోడ్డు వద్ద జరిగింది. కీసర సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం..ఆంధ్రప్రదేశ్ శ్రీకాకుళం జిల్లాకు చెందిన రాకేష్ బతుకుదెరువు కోసం షామీర్ పేట్ లియోనియో లో క్యాటరింగ్ పని చేస్తున్నాడు. సోమవారం తన మిత్రుడు హేమంత్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై కీసరకు పని నిమిత్తం వచ్చాడు. తిరిగి వెళుండగా కీసర రింగ్ రోడ్డు వద్ద ద్విచక్ర వాహనం ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డుపై పడిపోయారు. అతి వేగంగా ఉండటం వల్ల రోడ్డుపై ఎగిరి పడిన రాకేష్ తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన హేమంత్‌ను చికిత్స కోసం 108 వాహనంలో అస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న కీసర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నాచారం పారిశ్రామిక వాడలో అగ్ని ప్రమాదం



నవతెలంగాణ - చర్లపల్లి

నాచారంలోని పారిశ్రామిక వాడలో స్వల్ప అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఆరిజెన్ పరిశ్రమకు చెందిన స్క్రాప్ తగలబడడంతో అగ్నిప్రమాదం సంభవించింది. అగ్ని ప్రమాదం దాటికి మంటలు ఎగసిపడ్డాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని, ఫైర్ ఇంజన్ల సాయంతో మంటలను అదుపు చేశారు. అగ్నిప్రమాద సమయంలో మీడియా ప్రతినిధులను కంపెనీ యాజమాన్యం అనుమతించ లేదు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

వాటర్ బాటిల్స్ పంపిణీ



నవతెలంగాణ-కాప్రా

రంజాన్ సందర్భంగా గోగికర్ శివకుమార్, కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం కాప్రా ఈద్గాలల్లో ముస్లింలకు 2500 వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఈద్గా ప్రెసిడెంట్ బద్రుద్దీన్ సూచనల మేరకు ఈద్గాలలో ప్రార్థన చేసేందుకు వచ్చిన వాళ్ళందరికీ వాటర్ బాటిల్స్ స్వచ్ఛందంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మైసయ్య, కొండల్ గౌడ్, కృష్ణాగౌడ్, సోమయ్య, ముస్లింలు పాల్గొన్నారు.



రంజాన్ పండగ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి డాక్టర్ ఏఎస్‌రావు నగర్ డివిజన్ పరిధిలోని పలువురు ముస్లింల నివాసాలకు వెళ్లి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భగా తెలంగాణ మత సామరస్యానికి మార్గదర్శిగా నిలుస్తోందని, ప్రేమ, శాంతి, సామరస్యంతో ఈ పండుగను కుటుంబ సమేతంగా ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. నవతెలంగాణ-కాప్రా



రంజాన్ పర్వదినం సందర్భంగా ఇంద్రనగర్ ఫేజ్-2 నివాసి అలీముద్దీన్ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులతో కలిసి రంజాన్ పండుగను జరుపుకున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు దేవీప్రసాద్, కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాసరెడ్డి.-నవతెలంగాణ-కాప్రా

'కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో స్వచ్ఛత ప్రతిజ్ఞ'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

స్వచ్ఛ భారత్ పక్ష వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం ఖైరతాబాద్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ శానిటేషన్ సిబ్బంది "స్వచ్ఛత ప్రతిజ్ఞను" చేశారు. దీనిలో భాగంగా మెడికల్ సూపరింటెంట్ డాక్టర్ రాజశేఖర్ ఆదేశాల మేరకు చింతల్ బస్తీ డిగ్రీ కళాశాలలో ఎన్ సీసీ విద్యార్థులతో కలిసి స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రం చేసి చెట్లు నాటడం జరిగిందని చెప్పారు. స్వచ్ఛత ఒక మౌలిక సూత్రంగా మారాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. మన నగరాలు చెత్తా చెదరం లేకుండా ఉండేలా చూడాలన్నారు. సంపూర్ణ స్వచ్ఛత సహకారం అయ్యేలా ఉద్యోగులతో కలిసి ఆయన ప్రతిజ్ఞ చేశారు.



రంజాన్ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఆవాజ్ జిల్లా కార్యదర్శి అబ్దుల్ సత్తార్, గులాం నసీర్, తదితరులు.. నవతెలంగాణ-ధూల్ పేట్

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



● గౌలిగూడ అగ్నిమాపక కేంద్రం..

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

వేసవికాలంలోఅగ్ని ప్రమాదాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని అగ్ని ప్రమాద నివారణ అధికారులు సూచిస్తున్నారు. వేసవిలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతున్నాయని గాలిలో నీటి శాతం తగ్గడం వల్ల వేడి పెరుగుతుందన్నారు. వేడితో కాగితా లైన, పెట్రోల్, డీజిల్, హైడ్రో కార్బన్ గ్యాస్ తో తొందరగా మంటలు వ్యాప్తి చెందే అవకాశాలుంటాయి. దవాఖానాలు, వ్యాపార సముదాయాలు, గోదాములు అనుకోకుండా ఫైర్ ఏర్పడి అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఈ వేసవి కాలంలో అధికంగా ఉంటుందన్నారు. వ్యాపార సముదాయాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీవ్ర ఆస్తి నష్టం కూడా పెద్ద ఎత్తున ఏర్పడుతుందని అప్రమత్తంగా ఉండి వేసవి కాలంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని ఫైర్ అధికారులు సూచిస్తున్నారు. వ్యాపార సముదాయాలు, దవాఖానాల, వస్త్రాల దుకాణాలు, ఇందర్ బాగ్ మెడికల్ దుకాణాలు, ట్రూప్ బజార్ విద్యుత్ పరికరాలు అమ్మే అమ్మే దుకా ణాలు, హెూటలు, బేగం బజార్ వ్యాపార సముదాయాలు, దుకాణాలు ప్రభుత్వ ఆఫీసుల్లో వద్ద చెత్త పేరుకుపోకుండా చూసుకోవాలని ఒకవేళ చెత్త ఉంటే



ఎవరైనా బీడీ, సిగరెట్లు పడేసినా అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంటుంది. ఎప్పటి కప్పుడు వ్యాపార సముదాయాల్లో, ఇండ్లలో గ్యాస్ రెగ్యులేటర్, పైప్ ఎప్పటికప్పుడు చూసుకోవాలన్నారు. అధిక విద్యుత్ లోడ్ వల్ల కూడా షార్ట్ సర్క్యూట్ ఏర్పడే ప్రమాదం ఉంటుందని గౌలిగూడ అగ్నిమాపక కేంద్రం ఫైర్ ఆఫీసర్ బి.సుధాకర్ సూచిస్తున్నారు. తమ అగ్నిమాపక కేంద్రంలో రెండు పెద్ద ఫైర్ వెహికిల్స్, ఇంజన్లు, ఒకటి ఎమర్జెన్సీ ఫైర్ బుల్లెట్, మంటలు ఆర్పి వేసే అత్యాధునిక మిషిన్స్ ఉన్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ వేసవికాలంలో అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. అగ్ని ప్రమా దాలు సంభవిస్తే వెంటనే సమాచారం అందించాలని కోరారు. అగ్నిమాపక కేంద్రం ఎమర్జెన్సీ నెంబర్ 101 కు సమాచారం అందించాలని సూచించారు.

విభిన్న సంస్కృతుల సమ్మేళనం భారతదేశం

● రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ



నవతెలంగాణ-కల్చరల్

భిన్న సంస్కృతుల సమ్మేళనంతో సమైక్య భావనలతో భారత దేశం విరాజిల్లుతోందని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. సమాజం అభివృద్ధి పథం సాగేందుకు కళలు సాహిత్యం దోహదం చేస్తాయని ఆయన పేర్కొన్నారు. రవీంద్ర భారతి ప్రధాన వేదికపై కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో విశ్వా వసు నామ సంవత్సర ఉగాది పురస్కారాలు వివిధ రంగా లకు చెందిన ప్రముఖులకు గవర్నర్ బహుకరించి మాట్లాడారు. భగవద్గీత జ్ఞానం కన్నా ప్రపంచంలో ఏదీ మిన్న కాదని సందేశం అందించిందనీ కళలు , సాహిత్యం, వైద్య రంగం, న్యాయ రంగం వంటి విభిన్న రంగాలకు సంబంధించిన జ్ఞాన వంతులను కిన్నెర సంస్థ సత్కరించటం అభినందనీయమన్నారు. కిన్నర సంస్థ నిర్వహిస్తున్న పలు సాహితీ కళా కార్యక్రమాలు ప్రశంసనీయమని అట్టి సంప్రదాయం కొనసాగించాలని సూచించారు. అధ్యక్షత వహించిన ఆంధ్ర ప్రదేశ్ విశ్రాంత ప్రధాన కార్యదర్శి లంక సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ భారతీయ సంస్కృతి విశిష్ట జీవన విధానం ఉగాది ఇందుకు ప్రతీక అన్నారు. సమాజంలో ఆదర్శ పౌరులుగా ఎదిగేందుకు పురస్కార గ్రహీతలను ఆదర్శంగా గ్రహించాలని కోరారు. శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ నేడు దేశం లో అన్ని వ్యవస్థలు పని తీరు సరిగా లేదని, ప్రతి రంగం లో యువత రావాలన్నారు. స్వాగతం పలికిన సంస్థ కార్యదర్శి కిన్నర రఘురాం కిన్నెర సంస్థ నలభై ఎనిమిది ఏండ్లుగా వివిధ రంగాల కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించిన నివేదిక సమర్పించారు. వేదిక పై వ్యాపారవేత్త భోగరాజు మూర్తి పాల్గొన్నారు. పురస్కారం అందుకున్న వారిలో ఆంధ్ర ప్రదేశ్ హై కోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణ మోహన్, ఇంధన శాస్త్రవేత్త సతీష్ రెడ్డి, ఇంజనీర్ ఎంపీ రమణా రావు, వైద్యులు దశరథ రామి రెడ్డి, రంగస్థల ప్రయోక్త మీగడ రామ లింగ స్వామి, నాట్య గురువు డాక్టర్ రమా దేవి స్వర కర్త పీవీ సాయి బాబా, సాహితీ వేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం, హస్త కళల కళాకారిణి కమలా ప్రసాద్ రావు, ఆడిటర్ లోకనాథయ్యలు ఉన్నారు. తొలుత ప్రముఖ నృత్య గురువు ఉషా గాయత్రి, శిష్య బృందం అలివేలు మంగ చరిత్రం, నృత్య రూపకం కన్నుల పండుగగా ప్రదర్శించారు.

పేలిన ట్రాన్స్‌ఫార్మర్ ఫీజు బాక్స్

● తృటిలో తప్పిన ప్రమాదం



నవతెలంగాణ-అంబర్‌పేట

అంబర్‌పేట డివిజన్ పరిధిలోని ప్రేమ్ నగర్ లో ట్రాన్స్‌ఫార్మర్ ఫీజు బాక్స్ పేలి మంటలు చెలరేగడంతో వెంటనే స్పందించిన కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ సంబంధించిన ఫైర్ డిపార్టుమెంట్, ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంట్‌కు సమాచారం ఇచ్చి ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకున్నారు. సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వేసవి కాలంలో అధికంగా వేడి వల్ల ట్రాన్స్‌ఫార్మర్ పక్కన చెత్తలాంటి వెయ్యద్దని వాటి వల్ల ప్రమాద జరిగే అవకా శాలు ఉన్నాయని అధికారులు కూడా నిత్యం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పరిశీలించాలని కోరారు. ఈ సందర్భంగా స్థానికులు సకాలంలో స్పందించి విద్యుత్ అంత రాయం కలగకుండా ఎలాంటి ప్రమాదం లేకుండా చర్యలు తీసుకున్నందుకు స్థానికులు కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం విజయవంతం చేస్తాం

● కాంగ్రెస్ నాయకుడు ఆర్‌ఏ.వినోద్ కుమార్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

గోషామహల్ నియోజకవర్గంలో నిర్వహించనున్న జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని గోషామహల్ కాంగ్రెస్ నాయకులు ఆర్ఏ.వినోద్ కుమార్ అన్నారు. సోమవారం సుల్తాన్ బజార్ ఆయన నివాసంలో మాట్లాడుతూ.. ప్రజలకు సన్న బియ్యం అందిస్తున్న ఘనత సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి దక్కిందన్నారు. నేటి నుండి తెల్ల రేషన్ కార్డు దారులకు సన్న బియ్యం అందిస్తున్నామన్నారు. గోషామహల్ నియోజక వర్గంలో జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమం కో-ఆర్డినేటర్ కైలాష్ ఆధ్వర్యంలో త్వరలో నియోజకవర్గంలో అన్ని డివిజన్‌లలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామన్నారు. గోషామహల్ కో-ఆర్డినేటర్ కైలాష్ నేతృత్వంలో నియోజకవర్గం లోని సమస్యలు, ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధిపై చర్చించి కాంగ్రెస్‌ను గోషామహల్ నియోజకవర్గంలో బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాని కాంగ్రెస్‌లో ఉన్న సీనియర్ నాయకులు , కార్యకర్తలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



ఏడుపాయల వన దుర్గామాతను దర్శించుకున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ధాత్రిక్ నాగేందర్ బాబ్జీ, బబ్లు సింగ్, ఆంటో, రమేష్, వేణు కుమార్, దేవరాజు, తదితర నాయకులు నవతెలంగాణ-అంబర్‌పేట

నవతెలంగాణ-ముషీరాబాద్



మధురవాడ క్రికెట్ స్టేడియంలో జరిగిన క్రికెట్ మ్యాచ్‌కు భద్రతా వలయాన్ని విశాఖ పోలీసులతో పాటు ఆంధ్రప్రదేశ్ తెలంగాణ మాజీ కేంద్ర సాయుధ పోలీస్ బలగాల సిబ్బంది, మాజీ సైనికులు మాజీ పోలీసు విభాగా లకు చెందిన సిబ్బందిని ఒక గొడుగు కిందకు చేర్చి చక్కటి భద్రతను అందించిన సభ్యులు అందరినీ విశాఖపట్నం పోలీస్ కమిషనర్ డాక్టర్ శంకబ్రత బాగ్చి తెలంగాణ మాజీ సీఏపీఎఫ్ సిబ్బంది సంక్షేమ సంఘం అధ్యక్షులు శ్యామ్ సుందర్ రెడ్డి వారిని అభినందించి జ్ఞాపికలు అందజేశారు.

వెట్టి చాకిరీ పై తిరగబడ్డ ఫిరంగి దొడ్డి కొమురయ్య

సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, టీపీఎస్‌కే రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-ముషీరాబాద్

వెట్టిచాకిరీపై తిరగబడ్డ ఫిరంగి దొడ్డి కొమురయ్య అని సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, టీపీఎస్ కే రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఏప్రిల్ 3న జరుగు దొడ్డి కొమరయ్య 98వ జయంతి సభ సంబంధించిన వాల్ పోస్టర్‌ను బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి పాశం యాదగిరి, భూపతి వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ వెట్టి చాకిరి బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాడిన మహెూన్నతమైన వీరుడు దొడ్డి కొమరయ్యను కొనియాడారు. ఆ మహనీయుని జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ వేడుకలకు ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ ప్రముఖ వాగ్గేయకారుడు గోరేటి వెంకన్న ప్రొఫెసర్ కంచె ఐలయ్య



విప్లవ గాయకురాలు విమలక్క, ఎస్.వినయ్ కుమార్, భూపతి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొననున్నారన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో రాజేందర్ రెడ్డి, దొడ్డి రమేష్, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఏఐ బోధన తరగతులు..

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



మహబూబియ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆర్టిఫి షియల్ ఇంటెలిజెన్స్ ఏఐ బోధన తరగతులతో విద్యార్థుల కు బోధన అందిస్తున్నామని పాఠశాల హెచ్‌ఎం సుధారాణి అన్నారు. సోమవారం ప్రకటనలో మాట్లాడుతూ.. నాంపల్లి మండల పరిధిలో ని గన్ ఫౌండ్రీ మహబూబియ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. ఏఐ బోధన తరగతులు మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులకు విద్య ప్రమాణాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. తమ పాఠశాలలో విశాలమైన ప్రాంగణం, ఆహ్లాదకరమైన వాతా వరణం ఉంటుందన్నారు. ప్రవేశం పొందినవారికి 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు ఉచిత విద్యా బోధన అందిస్తున్నామన్నారు. బాలికలకు ఉచిత భోజనం అందిస్తున్నామన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే సమగ్ర విద్యాబోధన, ప్రతి సంవత్సరం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు 100% (శాతం) రిజల్ట్స్‌తో ఉత్తీర్ణత సాధించడం జరుగుతుందని తెలిపారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రత్యేకంగా చిత్రలేఖనం, వివిధ క్రీడా పోటీల్లో శిక్షణ అందిస్తామన్నారు. విద్యార్థులకు కంప్యూటర్ విద్యలో శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. ప్లే గ్రౌండ్ వంటి సదు పాయాలతో విద్యాబోధన జరుగుతుందన్నారు, ప్రతినిత్యం ఉపాధ్యాయుల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు.

ఘనంగా రంజాన్ వేడుకలు.. మసీదుల వద్ద ప్రార్థనలు



నవతెలంగాణ-అంబర్‌పేట

ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో, గొప్పగా చేసుకునే పండుగ రంజాన్ అని అంబర్‌పేట కార్పొరేటర్ ఇ. విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. సోమవారం రంజాన్ పర్వదినం సందర్భంగా అంబర్‌పేట ఎంసీహెచ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలలో ఆయన పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగను పురస్కరించుకుని ప్రపంచంలోని ముస్లిం సోదర, సోదరీమణులు నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు చేపడతారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కే.దుర్గ ప్రసాద్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు పులి జగన్, పరుద్దీన్, ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో గొప్పగా చేసుకునే పండుగ రంజాన్‌అని కార్పొరేటర్ ఇ. విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రత్యేక ప్రార్థనలలో ఆయన పాల్గొని ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కే దుర్గ ప్రసాద్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు పద్మావతి దుర్గాప్రసాద్ రెడ్డి, పరుద్దీన్, పులి జగన్, బీఆర్ఎస్ నాయకులు జాఫర్, షన్, అజార్, యూసుఫ్, రఫిక్, ఎంఐఎం పార్టీ నాయకులు సమీవుల్లా, మోసిన్, మన్నన్ తదితర నాయకులు పాల్గొన్నారు.జార్, యూసుఫ్, రఫిక్, ఎంఐఎం పార్టీ నాయకులు సమీవుల్లా, మోసిన్, మన్నన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో

రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎర్రబోలు నర్సింహారెడ్డి, ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు నయీమ్, మోసిన్, యాసిన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



ఘరానా చైన్ స్నాచర్ అరెస్ట్

● 46కేసుల్లో 11కేసుల ఛేదింపు

● రూ. 1,70,000 విలువగల బంగారు ఆభరణాల స్వాధీనం



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో వసర చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఘరానా చైన్ స్నాచర్‌ను సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుని నుంచి రూ.1,70,000ల విలువగల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం అడిషనల్ డీసీపీ ఏ.శ్రీనివాస్ రావు తెలిపిన వివరాల మేరకు మల్లెపల్లికి చెందిన షేక్ సద్దాం హుస్సేయిన్ చిన్నచిన్న పనులు చేస్తుంటాడు. చెడు వ్యసనాలకు బానిసైన నిందితుడు మరి కొంతమందితో కలిసి ఒక ముఠాను ఏర్పాటు చేశాడు. ఈ ముఠా వృద్ధులు, ఒటరిగా వెళ్లే మహిళలను టార్గెట్ చేసుకుని చైన్ స్నాచింగ్‌ల కు పాల్పడుతున్నారు. అంతేకాకుండా ఆర్టీసీ బస్సులల్లో ప్రయాణికులను టార్గెట్ చేసుకుని వారి వద్ద పర్సులు, బంగారు ఆభరణాలు తస్కరిస్తున్నారు. వాటిని విక్రయించడం లేదా కుదువ పెట్టడం వాటిద్వారా వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నారు. అయితే ఇదే క్రమంలో మార్చి 25న మెహిదీపట్నంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు కోసం వేచిచూస్తున్న ఓ మహిళను టార్గెట్ చేశాడు. అదును చూసుకుని ఆమె మెడలోని మంగళసూత్రాన్ని లాక్కె ళ్లాడు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న హుమా యూన్‌నగర్ పోలీసులు, టాస్క్‌ఫోర్సు పోలీ సులతో కలిసి అన్నికోణాల్లో విచారించారు. చివరకు నిందితుడిని అరెస్టు చేశారు. 2010 నుంచి ఈ ముఠా చైన్ స్నాచింగ్‌లకు, దోపిడీలకు పాల్పడు తున్నారని, వీరిపై 46 కేసులు నమోదైనట్టు అదనపు డీసీపీ తెలిపారు. నిందితున్ని పట్టుకోవడంతో దాదాపు 11 కేసులు ఛేదించినట్టయిందని అదనపు డీసీపీ తెలిపారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్ అన్నారు. సమయం వచ్చినప్పుడల్లా ప్రధాని మోదీ తాను బీసీ అని చెప్పుకోవడం కాదని, బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ తెలంగాణ అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని పార్లమెంటులో వెంటనే ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద బీసీ సంఘాల ఆధ్వర్యంలో జరగబోయే బీసీల మహాధర్నా కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను బీసీ సంఘాల నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రాచాల మాట్లాడుతూ రాహుల్ గాంధీ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో తీర్మానం చేసిందన్నారు. బీసీల ఆకాంక్షల పట్ల కాంగ్రెస్ చిత్తశుద్ధితో పని చేస్తుందని, బీసీలకు భరోసా కల్పించిన రాహుల్ గాంధీ, సీఎం ఎ.రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు బీసీ సమాజం తరపున ధన్యవాదాలు తెలిపారు. బుధవారం జరగబోయే మహాధర్నాకు వచ్చే వారికి ప్రత్యేక రైలు సదుపాయం, భోజనం, వసతి సౌకర్యం కల్పి ంచిన కాంగ్రెస్ నాయకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్, జాతీయ ఓబీసీ మేధావుల ఫోరం అధ్యక్షులు ఆళ్ల రామకృష్ణ, జైగౌడ ఉద్యమం జాతీయ అధ్యక్షులు వట్టికూటి రామారావు గౌడ్, ఓబీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు కిరణ్ కుమార్, పరికిపండ్ల అశోక్, బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులు బడేసాబ్, చింతపల్లి సతీష్, వివి.గౌడ్, అంజన్న యాదవ్, దేవర శివ, రాఘవేందర్, బిక్షపతి, రామన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణ హిందీ ప్రచార సభ పరిరక్షణకు కృషి చేస్తా'



● డైరీని ఆవిష్కరించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

తెలంగాణ హిందీ ప్రచార సభ పరిరక్షణకు కృషి చేస్తానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారని తెలంగాణ హిందీ ప్రచార సభ ప్రతినిధులు పేర్కొన్నారు. సోమవారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ హిందీ ప్రచార సభ ప్రతినిధులు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో సమావేశం అయ్యారు. రాష్ట్రం విడిపోయిన తరువాత కూడా గుర్తింపు లేని ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కొనసాగుతూ అక్రమాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఉన్నత న్యాయస్థానం హిందీ ప్రచార సభ మొత్తాన్ని స్వాధీనం చేసుకోవాలని హైదరాబాద్ కలెక్టర్‌కు 333 జెడ్జ్ మెంట్ ఇవ్వడం జరిగిందని తెలంగాణ హిందీ ప్రచార సభ ప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకెళ్లి పలు అంశాలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ హిందీ ప్రచార సభ పరిరక్షణకు కృషిచేస్తానని హామీ ఇచ్చినట్లు సభ ప్రతినిధులు తెలియజేశారు. అనంతరం తెలంగాణ హిందీ ప్రచారసభ నూతన సంవత్సర 2025 డైరీని సభ ప్రతినిధులు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ షేంకర్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, చికోటి ప్రవీణ్ లతో కలసి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో హిందీ ప్రచార సభ ట్రస్ట్ మెంబెర్ ఎస్.నర్సింహ రెడ్డి,తెలంగాణ హిందీప్రచార సభ హైద్రాబాద్ అధ్యక్షుడు జి. గాంధీ, రవి కుమార్, రామా మోహణాచారి,ప్రేమ్ కుమార్, ఎం.సురేందర్, హెచ్.ఆనంద్ కుమార్, ఆర్.పి. కపూర్, సభ న్యాయసలహాదారు మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్





● కార్పొరేటర్ పావని వినయ్ కుమార్

నవతెలంగాణ-ముషీరాబాద్

మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని అన్నారు గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి ఎ.పావని వినయ్ కుమార్ ఈ పవిత్ర మాసంలో ముస్లిం సోదరులు ఉపవాస దీక్షలను పూర్తి చేసి ఘనంగా జరుపుకొనే రంజాన్ పండుగ అని డివిజన్ లోని ముస్లిం సోదర సోదరీమణులకు, వారి కుటుంబ సభ్యులకు పండుగ శుభాకాంక్షలు తెలియచేశారు. వాల్మీకి నగర్ బస్తీలోని బీజేపీ మైనారిటీ మోర్చ సీనియర్ నాయకులు మొహమ్మద్ మహబూబ్, సబర్మతి నగర్ బస్తీలోని బీజేపీ నేతలు రహమాత్ అలీ, యాసిన్ వారి కుటుంబ సభ్యులను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షులు వి.నవీన్ కుమార్, శ్రీకాంత్, రాజు, ఎం.ఉమేష్, సత్తి రెడ్డి, సురేష్, లక్ష్మణ్ యాదవ్, నర్సింహ, భరత, సాయి కుమార్, ఆనంద్ రావు, డి కుమార్, ధనరాజ్, తదితరులు పాల్గొన్నారు.



భోలకపూర్‌లో రంజాన్ వేడుకలు

భోలకపూర్‌లో రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాగేష్ ముదిరాజ్ హాజరై నాయకుడు ముస్లిం సోదరుడు సమద్‌కు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సృష్టికర్త అల్లా అనుగ్రహం మన అందరిపైన ఎల్లవేళలా ఉండాలన్నారు. పవిత్ర రంజాన్ పర్వదినం మన అందరిలో సోదర భావాన్ని పెంపొందించి మనలో కొత్త ఉత్సాహాన్ని నింపాలని ఆకాంక్షిస్తూ ముస్లిలందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ-మెహిదీపట్నం

రంజాన్ సందర్భంగా హకీంపేటలోని హకీం షా బాబా దర్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు.

విద్యార్థులపై లాఠీచార్జి, భూములను లాక్కోవడాన్ని ఖండిస్తున్నాం

పీడీఎస్‌యు తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.వి.శ్రీకాంత్, పొడపంగి నాగరాజు

నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రజా పాలన పేరుతో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని వాగ్దానం చేసి ఏడో గ్యారెంటీగా తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని నిలబెడతామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని దీనిలో భాగంగానే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విలువైన భూములను రేవంత్ ప్రభుత్వం బలవంతంగా తీసుకుంటుంది. ఇది ముమ్మాటికీ అప్ప ప్రజాస్వామికమైన చర్య అని పీడీఎస్‌యు తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు ఎస్.వి.శ్రీకాంత్, పొడపంగి నాగరాజు అన్నారు. సోమవారం పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. విశ్వ విద్యాలయాల అభివృద్ధి కోసం విద్యార్థులకు సరైన వసతులు, పరిశోధన కేంద్రాల కోసం వినియోగించుకోవాల్సిన 400 ఎకరాల సెంట్రల్ యూనివర్సిటీ భూములను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల పేరుతో, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెబుతూ యూనివర్సిటీ భూములను బడా కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేయడం కోసం పూనుకుందని పీడీఎస్‌యు తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. యూనివర్సిటీలోకి అక్రమంగా చొరబడి జేసీబీ లను తీసుకొచ్చి క్యాంపస్‌కి సంబంధం లేని పనులు ప్రారంభిస్తున్న యూనివర్సిటీ భూ ముల వేలంకు వ్యతిరేకంగా విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకుల ఆధ్వర్యంలో వారి క్యాంపస్ భూముల సంరక్షణకై శాంతి యుతంగా అడ్డుకుంటూ ఆందోళన నిర్వహించారన్నారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి విద్యార్థులపై లాఠీ చార్జిని ప్రయోగించారని హాస్టల్ గదిల్లోకి అక్రమంగా ప్రవేశించి విద్యార్థినీ, విద్యార్థులతో దుర్భాషలాడుతూ అత్యంత పాషవికంగా నెట్టుకుంటూ భయానక వాతావరణాన్ని సృష్టించి అరెస్టు చేశారు.



రంజాన్ పండుగ సందర్భంగా సోమవారం బోరబండలోని కాంగ్రెస్ నాయకులు, డివిజన్ మహిళలు, బోరబండ కార్పొరేటర్, మాజీ జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ బాబా ఫసిఉద్దీన్ నివాసానికి వెళ్లి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాబా ఫసిఉద్దీన్ డివిజన్ మహిళలను అభినందించారు.

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

10

హైదరాబాద్

HMDA

మంగళవారం | ఏప్రిల్ 01 2025 | www.navatelangana.com

కారుతో ఢీ కొట్టడంతో ద్విచక్ర వాహనదారుడు మృతి



ఫైల్

నవతెలంగాణ-చర్లపల్లి

అతివేగంతో కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఘటన చెందిన ఘటన చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. చర్లపల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి.రవి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం. బీఎస్.రెడ్డి నగర్‌కు చెందిన కోండిపటి పుల్లారావు (32) సోమవారం తన బార్య మల్లేశ్వరి, తన ఇద్దరు కొడుకులు ఋత్విక్, రాజేశ్‌లతో కలిసి అశోక్ నగర్ నుంచి చర్లపల్లికి తన మోటార్ సైకిల్‌పై వెళ్తున్నాడు. బైర లింగం స్క్రాప్ షాప్ వద్ద చేరుకోగానే అతివేగంగా వస్తున్న కారు బస్సును ఓవర్ టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న పుల్లారావు బైక్‌ని ఢీ కొట్టింది. పుల్లారావు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. తన బార్య, ఇద్దరు కొడుకులకు తీవ్ర గాయలయ్యాయి. వారు గాంధీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. మృతుని సోదరుని పిర్యాదు మేరకు చర్లపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ బి.రవి కుమార్ తెలిపారు.

భారత రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలి



- కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-బేగంపేట్

సనత్‌నగర్ నియోజకవర్గంలోని బన్సీలాల్ పెట్‌లో సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డా. కోట నీలిమ ఆదేశాల మేరకు 'జై బాపు జై భీమ్, జై సంవిధాన్' అభియాన్ సన్నాహక నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు నారాయణ, పండు గౌడ్, జీఎల్. రమేష్, మల్లం రమేష్, అనిత, పల్లె గజానంద్, శ్రవణ్ కుమార్, మహేష్, జగదీష్, రాజశేఖర్, మధు, కొండల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు దేశవ్యాప్తంగా భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతీ పౌరుడు ముందుకు రావలసిన అవసరాన్ని వివరించారు. డా. బీఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగ విలువలను కాపాడాలని, సామాజిక న్యాయం, సమానత్వం, మౌలిక హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి భారీగా ప్రజలు హాజరై సంఘీభావం ప్రకటించారు. కాంగ్రెస్ నాయకత్వంలో 'జై బాపు జై భీమ్, జై సంవిధాన్' అభియాన్ విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

మత సామరస్యానికి రాష్ట్రం ఆదర్శం

- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



నవతెలంగాణ-సిటీబ్యూరో

మత సామరస్యానికి తెలంగాణా రాష్ట్రం ఇతర రాష్ట్రాల కంటే ఆదర్శంగా నిలుస్తుందని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. సోమవారం రంజాన్ పండుగ సందర్భంగా భోలక్ పూర్ వార్డు కార్పొరేటర్ గౌస్ మొయినుద్దీన్ ఆహ్వానం మేరకు మేయర్ కార్పొరేటర్ ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మేయర్‌ను సన్మానించి షిరుకుమను అందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. మత సామరస్యానికి తెలంగాణా రాష్ట్రం ఇతర రాష్ట్రాల కంటే ఆదర్శంగా నిలుస్తుందని, ముస్లిం హిందువులు స్నేహపూర్వకంగా ఉంటూ మతాలకు అతీతంగా స్నేహభావంతో ఉంటారని ముఖ్యంగా హైదరాబాద్ నగరం గంగా యమునా తేహజీబ్‌గా భారతంలోనే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ముస్లిం హిందూ పండగలకు కలిసి మెలిసి ఉంటూ అన్నదమ్ముల జరుపుకునే వేదికగా హైదరాబాద్ నిలుస్తుందన్నారు. ఈదుల్ ఉల్ ఫితర్ (రంజాన్) పండుగకు ఆహ్వానించిన కార్పొరేటర్ గౌస్ మొయినుద్దీన్, వారి కుటుంబ సభ్యులకు మేయర్ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండుగకు ఇంటికి పిలిచి దావత్ ఇచ్చిన కార్పొరేటర్ గౌస్ మొయినుద్దీన్‌కు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

తెలంగాణ ప్రజలు సంతోషంగా ఉండాలి



- డాక్టర్ ముజీబ్
- రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన

టీఎన్జీవోస్ జిల్లా నాయకులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

రంజాన్ పర్వదినం సందర్భంగా టీఎన్జీవోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సేనిని(ముజీబ్) ఆ సంఘం జిల్లా కార్యవర్గం సోమవారం వారి స్వగృహంలో కలిసి రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ తెలంగాణ యావత్ ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ.. తెలంగాణ రాష్ట్ర ప్రజలు సంతోషంగా, సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. అలాగే ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు విక్రమ్ కుమార్, కార్యదర్శి కుర్రాడి శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షులు కె.ఆర్.రాజ్ కుమార్, పబ్లిసిటీ సెక్రటరీ వైదిక్ శాస్త్ర, ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీధర్, కేంద్ర సంఘం స్పోర్ట్స్ సెక్రటరీ బోలిగిద్ద శంకర్ ఈ సందర్భంగా డాక్టర్ ముజీబ్‌కి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ యూనిట్ల అధ్యక్ష,కార్యదర్శులు, ఎంఎన్జే ఆస్పత్రి అధ్యక్షులు శివకుమార్, ఈఎన్‌టీ తూముకుంట రాజు, జూ పార్క్ అధ్యక్షులు నరేందర్, ఈఎస్ఐ అధ్యక్షులు రాజ్ కుమార్, డెంటల్ ఆస్పత్రి అధ్యక్షులు హరీష్, ఐటీఐ అధ్యక్షులు సత్యనారాయణ, గ్రంథాలయ అసోసియేట్ ప్రెసిడెంట్ మహేందర్, కార్యదర్శి వరప్రసాద్, వివిధ కార్యాలయం ఉద్యోగ మిత్రులు శేఖర్, కృష్ణ, మోహన్, విద్యాశాఖ సెంట్రల్ ఫోరం యూనిట్ నాయకులు ప్రియాదేవ్, సుదర్శన్, శివ, మహేష్, ఇబ్రహీం, పురుషోత్తం, హనుమంతు, రవికాంత్, చౌష్ తదితరులు పాల్గొన్నారు.

బంజారాలకు మంత్రి పదవి ఇవ్వాలి

[redacted]

- గిరిజన సంఘాల డిమాండ్



నవతెలంగాణ-బంజారాహిల్స్

గిరిజన శక్తి రాష్ట్ర కమిటీ గిరిజన జేఏసీ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో గిరిజన శక్తి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు డా. వెంకటేష్ చౌహాన్, గిరిజన జేఏసీ అధ్యక్షుడు అశోక్ రాథోడ్ కలిసి మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంలో 30 లక్షల బంజారా జనాభా ఎంతో కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. గత పదేండ్లుగా బీఆర్ఎస్ పాలనను ముగించి, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి బంజారా సామాజిక వర్గం వెన్నుతట్టిందని, అందువల్ల బంజారాలకు మంత్రి పదవి కేటాయించకపోతే కాంగ్రెస్‌కి నష్టం వాటిల్లే అవకాశం ఉందని హెచ్చరించారు. బంజారా జనాభా అధికంగా ఉన్న నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి అధిక సంఖ్యలో ఎమ్మెల్యేలు గెలిచారని, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని మంత్రివర్గ కూర్పు చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ మాజీ జాతీయ అధ్యక్షులు రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ. వేణుగోపాల్, పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, డీకే శివకుమార్, పవన్ కేరా తదితర నాయకులను కలిసి వినతిపత్రం సమర్పించినట్టు వెల్లడించారు. ఇందిరా గాంధీ హయాంలో బంజారాలకు రిజర్వేషన్ కల్పించారని, అప్పటి నుంచి ఈ వర్గం కాంగ్రెస్‌తోనే ఉందని ఆయన గుర్తు చేశారు. గిరిజన జేఏసీ చైర్మెన్ రాజేష్ నాయక్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు కాంగ్రెస్ నాయకత్వానికి వినతిపత్రాలు మాత్రమే అందజేశామని, ఇకపై నిరసన కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. ఆల్ ఇండియా ట్రైబల్ జేఏసీ అధ్యక్షులు సురేష్ నాయక్ మాట్లాడుతూ.. బంజారా జాతికి మంత్రి పదవి కేటాయించకపోతే కాంగ్రెస్ పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లక్పతి నాయక్, బంజారా గిరిజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు శివ నాయక్, ఎంబీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఐతరాజు అంబెందర్, మాదిగ యూత్ ఫోర్స్ అధ్యక్షులు కొండ్రపల్లి రమేష్, రాజు నాయక్, లచ్చు సాదు, నరేష్, శివ చౌహాన్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు..

ఈద్ ఉల్ ఫితర్‌లో హిందూ, ముస్లింల ఐక్యత



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఈద్ ఉల్ ఫితర్, రంజాన్ పండుగ సందర్భంగా చార్మినార్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముజీబ్ ఉల్లాహ్ షరీఫ్ నివాసంలో ఏపీ, పి. గన్నవరం నియోజకవర్గం ఎమ్మెల్యే జి. సత్యనారాయణ, బహదూర్పురా, యాకాత్పురా నియోజకవర్గ ఇన్‌చార్జిలు పులిపాటి రాజేశ్ కుమార్, రవి రాజ్, ఆర్యా వైశ్య సంఘం అధ్యక్షులు రమేష్, తదితరులు పాల్గొన్నారు. హిందూ, ముస్లిం ఐక్యతను చాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉగాది మరసటి రోజే రంజాన్ పండుగ రావడంతో హిందూ, ముస్లిం సహోదరులు సంతోషంగా కలిసి మెలిసి జరుపుకున్నారు. ఈ పండుగలు హిందూ ముస్లింలు కలిసి తామంతా ఒక్కటే అని కలిసి మెలిసి చేసుకుంటాం అన్నారు. ఏ మతతత్వ రాజకీయ పార్టీలు ఎంత విద్వేషాలు రెచ్చగొట్టిన, బిన్నత్వంలో ఏకత్వం అని, ఏమి చేసుకున్న తామంతా అన్న తమ్ముల కలిసి కట్టుగా ఉంటామని చెప్పారు.

వాజ్‌పేయి రాజకీయ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం



- బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు దీపక్ రెడ్డి

నవతెలంగాణ-బంజారాహిల్స్

భారతదేశ రాజకీయాలలో అటల్ బిహారీ వాజ్‌పేయికి ఒక ప్రత్యేకమైన స్థానం ఉందని ఆయన జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు లంకల దీపక్ రెడ్డి అన్నారు. అనంతరం బీజేపీ నగర కార్యాలయంలో వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాలకు సంబంధించి బండారు ప్రశాంత్ అధ్యక్షతన బూత్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు ఆపై స్థాయి నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి దీపక్ రెడ్డి, గౌతమ్ రావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. భారతదేశం కోసం వాజ్‌పేయి తన జీవితాన్ని అంకితం చేశారని ఆయన కొనియాడారు. వాజ్‌పేయి గురించి ప్రతి బూత్‌లో, ప్రతి డివిజన్‌లో కార్యక్రమాలను నిర్వహించి ప్రతి ఒక్కరికి తెలిసేలా చెయ్యాలని సూచించారు. అదేవిధంగా సంకీర్ణ ప్రభుత్వాలను ఏ విధంగా నడిపించాలో నేర్పిన వ్యక్తి వాజ్‌పేయియనీ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో నేతలు నూనె బాలరాజు, మాజీ ఎస్సీ కమిషన్ సభ్యులు రాములు, కృష్ణ గౌడ్, అజయ్, రాహుల్ చంద్ర, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్, ప్రవీణ్ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు



- బీఆర్ఎస్ యువ నాయకులు టింకుగౌడ్

నవతెలంగాణ-కంటోన్మెంట్

రంజాన్ పర్వదినం సందర్భంగా బీఆర్ఎస్ యువనాయకుడు టింకు గౌడ్ సోమవారం బోయిన్‌పల్లిలోని ముస్లిం సోదరులను కలిసి రంజాన్ శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో నెలరోజుల పాటు ఎంతో కఠిన తరమైన ఉపవాస దీక్షలు చేపట్టి తమ భక్తిని చాటుకునే ముస్లిం సోదరుల భక్తి అభినందనీయమన్నారు. చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతి కుటుంబంలో ఎలాంటి లాభాపేక్ష లేకుండా కఠిన ఉపవాస దీక్షలు చేపట్టి నెలరోజుల అనంతరం ఉపవాస దీక్షలు వీడి రంజాన్ రోజు ఆనందోత్సవాల నడుమ వేడుకలు జరుపుకుంటారని, వారి జీవితాల్లో ఆనంద వెలుగులు నిండాలని సంతోషం వ్యక్తం చేశారు.

జంతర్ మంతర్ వద్ద ధర్నాకు ఓయూ విద్యార్థులు



నవతెలంగాణ-ఓయూ

రిజర్వేషన్ బిల్లును 9వ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్‌తో జంతర్ మంతర్ వద్ద జరిగే కార్యక్రమంలో పాల్గొన్నటానికి AIOBCSA Osmania టీమ్ సభ్యులు ప్రత్యేకంగా ఢిల్లీకి సోమవారం ప్రయాణమయ్యారు. ఈ సందర్భంగా, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద, కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో నిరసన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, ప్రభుత్వ అధికారులకు వినతిపత్రం సమర్పించనున్నారు. 40 సభ్యులతో కూడిన ఈ ప్రతినిధి బృందం, సామాజిక న్యాయం, విద్యా, ఉద్యోగ రంగాల్లో ఓబీసీల హక్కులను పరిరక్షించే దిశగా తమ గళాన్ని కేంద్ర ప్రభుత్వానికి వినిపించనుంది.

అందరికీ శ్రేయస్సునివ్వనున్న 'విశ్వా వసు'



- పుష్పగిరి విద్యాశంకర భారతీ మహా స్వామి

నవతెలంగాణ-కల్చరల్

విశ్వా వసు సంవత్సరం అందరికీ శ్రేయస్సు ఇస్తుందని పుష్పగిరి విద్యా శంకర భారతీ మహాస్వామి అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై వంశీ సంస్థల నిర్వహణలో విశ్వా వసు నామ ఉగాది సందర్భంగా జరిగిన సభలో పుష్పగిరి విద్యా శంకర భారతీ స్వామి తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన దేవస్థానం ఆస్థాన వేద పండితులు భట్టర్ సుందర ప్రహ్లాదాచార్యులను వంశీ వేద ఉగాది పురస్కారంతో సత్కరించి మాట్లాడారు. వంశీ రామరాజు ఆత్మీయ వంశీయంగా ధర్మ వంశీయంగా భావి తరాలకు ఉత్తమ సంప్రదాయం అందిస్తున్నారని కొనియాడారు. వేదికపై రాజ్య శ్రీ రచించిన లలితా సహస్ర నామ వ్యాఖ్యానం, డాక్టర్ మీనాక్షి రచించిన సాయీ త్వ మేవ శరణం మమ గ్రంథాన్ని స్వామి ఆవిష్కరించారు. వేదిక పై దర్శకుడు రేలంగి నరసింహారావు, తిరుమల గ్రూప్స్ చంద్ర శేఖర్ విదేశీ ఆంధ్రులు బి వ్యాస కృష్ణ రాధ తదితరులు పాల్గొనగా వంశీ రామరాజు కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ తెన్నేటి సుధ, సుంకరపల్లి శైలజ, సుధా మయి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు తులసీ రాం వ్యాఖ్యానం చేసిన కార్యక్రమంలో తొలుత రామరాజు తరంగిణి శాస్త్రీయ గాన గోష్ఠి సంతోష్ కుమార్ శాస్త్రి పంచాంగ పఠనం చివరగా భాస్కర రావు, సురేష్ శర్మ శ్రవణ్ కుమార్ శర్మ పాండురంగ జ్యోతి నాలుగు వేద పఠనం చేశారు.

హెచ్‌సీయూ భూముల వేలం నిలిపివేయాలి

- ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ యూనియన్



నవతెలంగాణ-ఓయూ

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)కి సంబంధించిన 400 ఎకరాల భూమిని కార్పొరేట్ కంపెనీలకు అప్పచెప్పే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ యూనియన్ డిమాండ్ చేసింది. సోమవారం పీఎస్‌యూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ నియంతృత్వ పోకడలను నిరసిస్తూ ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ప్లేకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు ఆవుల నాగరాజు మాట్లాడుతూ.. తెలంగాణలోని కాంగ్రెస్ పాలకులు ఈ ఏడాదిన్నర కాలంలో విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారు. ప్రతిష్టాత్మక హెచ్‌సీయూ భూములను బలవంతంగా గుంజుకో వడమంటే పేద విద్యార్థుల చదువులను ధ్వంసం చేయడమే.. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం భూముల అమ్మకం మానుకోవాలని డిమాండ్ చేస్తున్నాము. వరస సెలవుల సమయంలో జీవవైవిధ్యం కలిగిన కాంచ గచ్చిబౌలి అడవులను వందలాది జేసీబీలు, బుల్డోజర్లతో ధ్వంసం చేయడం అత్యంత అమానుషమన్నారు. మరోవైపు భూముల అమ్మకాన్ని వెనక్కి తీసుకోవాలని శాంతియుత నిరసన తెలిపుతున్న విద్యార్థులపై పోలీసు బలగాల ద్వారా దాడి చేయించడం, వారిని భయభ్రాంతులకు గురిచేయడం హేయమైన చర్యగా పీఎస్‌యూ భావిస్తోందని తెలిపారు. హెచ్‌సీయూ విద్యార్థులు లేవనెత్తుతున్న అంశాలపై యూనివర్సిటీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం ముమ్మాటికీ రాష్ట్ర ప్రభుత్వానికి కొమ్ము కాయడమే. పర్యావరణాన్ని, జీవ వైవిధ్యాన్ని దెబ్బతీస్తున్న ప్రభుత్వ చర్యలను మానుకొని విద్యార్థులతో చర్చించాలి. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే విద్యార్థులు ఆగ్రహానికి గురవుతారని తెలుపుతున్నామని హెచ్చరించారు. విద్యార్థులపై లాఠీచార్జి అక్రమ అరెస్టులను నిరసిస్తూ విద్యార్థి లోకం, రాష్ట్ర ప్రజలు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీఎస్‌యూ నాయకులు పగిళ్ల ప్రశాంత్, టోనీ, రవి, ఏ. శ్రీధర్ యాదవ్, సురేష్, గోవర్ధన్, మహేష్, గోపి, ఆనంద్, సృజన్, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
HMDA
మంగళవారం | ఏప్రిల్ 01 2025 | www.navatelangana.com

ఘనంగా రంజాన్ వేడుకలు

నవతెలంగాణ-మియాపూర్



ఈదుల్ ఫితర్ ఈద్గా దర్గాహ షరీఫ్ హజ్రత్ సాలార్ "ఏ" ఔలియా న్యూ హఫీజ్పేట్ సర్వే నెం. 80 శేరిలింగంపల్లి మండల్, రంగారెడ్డి జిల్లాలో రంజాన్ ప్రత్యేక ప్రార్ధనలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. దర్గా యొక్క ముతవల్లి సజ్జాద నషీన్ సుల్తాన్ అఫ్సాన్ -ఉద్ -దౌలా సాహబ్ పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొని ప్రార్ధన చేశారు.

రంజాన్ వేడుకల్లో పాల్గొన్న మిర్యాల ప్రీతం

నవతెలంగాణ-చందానగర్



చందానగర్ డివిజన్‌లో మహమూద్ బేగ్, రషీద్, హనీఫ్ ప్రముఖుల్ని మిత్రుల్ని శ్రేయోభిలాషులని వాళ్ల ఇంటి వద్ద కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపి వాళ్లతో పాటు పండుగను చందానగర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మిరియాల రాఘవ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ మిరియాల ప్రీతం జరుపుకున్నారు. కార్యక్రమంలో పరదేశి నాయుడు, శివ, రాకేష్ ,ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ విద్యార్థులపై లాఠీచార్జీ, అక్రమ అరెస్టులపై ఎంసీపీఐ(యు) ఖండన

- హెచ్‌సీయూ భూముల వేలం వేయడం ప్రభుత్వం విరమించుకోవాలి
- ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్

నవతెలంగాణ-మియాపూర్



రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలను సమీకరించే పేరుతో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని 400 ఎకరాల ప్రభుత్వ భూమిని ఏప్రిల్ 8 నుంచి 15 వరకు వేలం వెంటనే ఆపాలని ఎంసీపీఐ (యు) రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వం మాదిరిగానే ప్రభుత్వ భూములను వేలం వేస్తూ ప్రయివేటు సంస్థలు, వ్యక్తులకు ధారాదత్తం చేసే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఎంసీపీఐ(యు) రాష్ట్ర కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరిస్తుంది. యూనివర్సిటీ భూములను వేలం వేయకూడదు విద్యా సముదాయాల అభివృద్ధి కోసం ఈ భూములను ఉపయోగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ హెచ్‌సీయూలోని విద్యార్థి సంఘాలు, విద్యార్థులు చేస్తున్న విజ్ఞప్తులను రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టి ఆ భూములలో చెట్లను సదును చేస్తూ భూమిని వేలం వేయడానికి తగిన ఏర్పాట్లు చేయడాన్ని ఖండిస్తూ నిరసనకు దిగిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జీ చేయడం, రాత్రిపూట అరెస్టులు చేయడం, క్యాంపస్ రూములలో ఉంటున్న విద్యార్థులపై అమానుషంగా పోలీసులు ప్రవర్తించడం రాష్ట్ర ప్రభుత్వ పాలన పరాకష్టాత్వాన్ని గుర్తుచేస్తుంది. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏడవ గ్యారెంటీ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తామనే కల్లబొల్లి మాటలు తెలిపి విద్యార్థులపై అమానుషంగా ప్రవర్తించడం సరికాదన్నారు. పోలీసులు విద్యార్థులపై జరిపిన లాఠీచార్జీ, అక్రమ అరెస్టులు, భయ భ్రాంతులకు గురి చేయడం లాంటివి విరమించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హెచ్‌సీయూ భూములలోని గజం స్థలం కూడా వేలం వేయకుండా విద్య సముదాయానికి పరీక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన గౌండ్ర సత్యం

నవతెలంగాణ-శంకర్‌పల్లి



రంజాన్ పండుగను పురస్కరించుకుని సోమవారం మోకిలా ముస్లిం సోదరులకు, మండల ప్రజలకు కాంగ్రెస్ మోకిలా గ్రామ పార్టీ అధ్యక్షుడు గౌండ్ర సత్యం రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగ కేవలం ఉపవాస దీక్ష మాత్రమే కాదు, అది ఓ దీక్షాత్మక జీవన విధానం, నిరీహత దయ, సహాయసహకారాల ద్వారా సమాజానికి ఆదర్శంగా నిలిచే పవిత్ర సంస్కృతి అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముస్లింల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని అన్నారు. మతపరమైన విభేదాలను విడనాడి, సహనం, శాంతి, ప్రేమతో జీవించేందుకు రంజాన్ ఒక గొప్ప సందేశాన్ని అందిస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మోకిలా ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా రంజాన్ వేడుకలు

ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మెన్ బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్

నవతెలంగాణ-గండిపేట్

సర్వమత సౌభ్రాతృత్వానికి ప్రతీకగా పవిత్రమైన రంజాన్ పర్వదినాన్ని హిందూ ముస్లిం సోదరులందరూ సోదరా భావంతో జరుపుకోవాలని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మెన్ బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. సోమవారం గండిపేట మండలంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్, నార్సింగి మున్సిపాలిటీ, మణికొండ మున్సిపాలిటీలో రంజాన్ వేడుకలను అంగరంగ వైభవంగా జరిపారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో శాంతిని పెంపొందించుకోవాలని కోరారు. పవిత్ర రంజాన్ మాసంలో నిష్టతో పాటించే ఉపవాస దీక్షలను దైవ ప్రార్ధనలో ముస్లిం సోదరులు విరమించుకున్నారు. గండిపేట్ కేంద్రంలో హైమత్ ఆధ్వర్యంలో, నార్సింగి మున్సిపాలిటీలో ముస్లిం సోదరులు మైనారిటీ అధ్యక్షులు షేక్ హాజీ భాయ్, కాంగ్రెస్ సీనియర్ మైనారిటీ యువ నాయకులు జమీల్ భాయ్, ఫారుక్ బాయ్, మహమూద్ హలీ, కాంగ్రెస్ యువ నాయకులు ఇమ్రాన్ ఆధ్వర్యంలో రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మణికొండ మున్సిపాలిటీలో సీనియర్ నాయకులు ఎండీ బషీర్ భాయ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి సోదర భావాన్ని పంచారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. బండ్లగూడ కార్పొరేషన్‌లోని హైదర్ షాకోట్, గంధంగూడ, బైరాగిగూడా, పీరెంచెరువు, హిమాయత్‌సాగర్, దర్గా కలిజా ఖాన్, కిస్మత్పూర్, నార్సింగి మున్సిపాలిటీలోని గౌలిదొడ్డి, వట్టినాగులపల్లి, ఖానాపూర్, కోకాపేట్, గండిపేట్, మంచిరేవుల, మణికొండ మున్సిపాలిటీలోని పుప్పాలగూడ నిక్నాపూర్ అల్కాపూర్, వివిధ కాలనీలలో ముస్లిం సోదరులు పవిత్రమైన రంజాన్ పండుగను కన్నుల పండుగ జరుపుకున్నారు. స్నేహితులతో కుటుంబ సభ్యులతో బంధువులతో కలిసి భోజనాలు, సీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, మాజీ సర్పంచులు మాజీ వార్డు సభ్యులు కార్పొరేటర్లు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



దర్గాగా చెరువు స్థలం కబ్జా

- ముడుపులు పుచ్చుకుని అధికారులు మౌనం పాటిస్తున్నారని స్థానికులు ఆరోపణ
- సంబంధిత అధికారులుకు ఫిర్యాదు చేశామన్న ఇరిగేషన్ డీఈ నళిని
- వరుస సెలవులను ఆసరాగా చేసుకుని నిర్మాణం చేపట్టిన కబ్జాదారులు



నవతెలంగాణ-శేరిలింగంపల్లి

చెరువులు, కుంటలను కాపాడుతామని ఎంతో అర్భాటంగా ప్రారంభించిన హైడ్రాకు తాజాగా జరుగుతున్న కబ్జాల విషయం తెలియయడం లేదు అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం లో పనిచేస్తున్న అధికారులకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు, వ్యవస్థలు, వివిధ శాఖలకు సంబంధించిన వివరాలు అధికారుల వద్ద ఉంటాయి. కానీ ఎవరైనా అడిగితే మాత్రం తెలియదు, అవునా చూస్తామని చెబుతారని తెలుస్తోంది.

శేరిలింగంపల్లి మండల పరిధిలోని మక్త మహబూబ్ పేట్‌లోని పెద్ద కుంట చెరువు 121 సర్వే నెంబర్‌లో గల చెరువు స్థలంలో మియాపూర్ హాఫిజ్‌పేట్‌కు చెందిన ఓ వ్యక్తి దర్గాగా దాదాపు 300 గజాలకు పైగా ఉన్న స్థలాన్ని కబ్జా చేసి, మక్త గ్రామానికి చెందిన మరో నాయకున్ని అడ్డం పెట్టుకుని పెద్ద రేకుల రూమ్ కట్టి, చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాడు. కబ్జా దారులు నాయకుల అండదండలతో అధికారులు చర్యలు తీసుకోకుండా అడ్డుకట్ట వేసి యదేచ్ఛగా కబ్జా స్థలంలో నిర్మాణం పూర్తి చేశారు. వరుస సెలవులు రావడంతో కబ్జాదారులకు కలిసివచ్చింది. వెంట వెంటనే నిర్మాణం పూర్తి చేసి రంగులు వేసి పాత నిర్మాణాల్లో కలిపి వేసే ప్రయత్నం చేసి అధికారుల కండ్లకు గంతలు కట్టారు.

ఎక్కడ సుందరీకరణ ?

నగరంలోని చెరువులను సుందరీకరిస్తామని చెప్పి ఇటీవల ఓ సంస్థకు సుందరీకరణ పనులు అప్పగించారు. ఇదే అదనుగా భావించిన కబ్జా దారులు తమ అక్రమ నిర్మాణాన్ని సుందరీకరణ పేరుతో సుందరీకరించుకున్నారు. సుందరీకరణ పేరుతో కబ్జాలను ప్రోత్సహిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

పత్తాలేని హైడ్రా...

చెరువులను కుంటలను కాపాడుతామని కొన్నిరోజులు హడావిడి చేసి ఇప్పుడు సైలెంట్ అయ్యారు. నీటి వనరులు పెంచడం కోసం ఏర్పాటైన హైడ్రా ఎక్కడా అని ఇరిగేషన్ అధికారులు చెరువును కాపాడటం కోసం ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంలో ఆంతర్యం ఏమిటనీ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. చెరువులు, కుంటలను కబ్జా దారుల నుంచి అధికారులు కాపాడాల్సింది పోయి ఏమి తెలియనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కబ్జా స్థలాన్ని కాపాడి కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అన్ని శాఖల అధికారులకు ఫిర్యాదు చేశాం : డీఈ నళిని


మక్త మహబూబ్‌పేట్ గ్రామం వద్దగల పెద్దకుంట చెరువు స్థలాన్ని కబ్జా చేసిన విషయం తమ దృష్టికి వచ్చింది. శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారులకు, చందానగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశాం. అక్రమంగా నిర్మించిన ఇండ్లను కూల్చివేస్తాం.

'రంజాన్ సర్వమత సౌభ్రాతృత్వానికి ప్రతీక'





నవతెలంగాణ-శంకర్‌పల్లి



రంజాన్ సర్వమత సౌభ్రాత్వానికి ప్రతీక అని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం శంకర్‌పల్లి ముస్లిం సోదరులు పట్టణంలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య హాజరై ముస్లిం సోదరులతో ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని, ముస్లింలకు ముస్లిం మత పెద్దలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో నిష్టతో 41 రోజులపాటు పాటించే ఉపవాస దీక్షలు చేపట్టి, ఉపవాస దీక్షలు విరమించడం గొప్ప విషయమన్నారు. ముస్లిం సోదరులకు దైవ ప్రార్థనలు సామరస్యాన్ని, శాంతిని, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడానికి అల్లాయే బలం చేకూరుస్తారని అన్నారు. ఈ పండుగ ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలను నింపాలిఅని ఆకాంక్షించారు. పండుగలు హిందూ ముస్లింలను స్నేహభావంతో ఉండేలా చేస్తాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ముస్లీం సోదరులు, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

కిష్టయ్య సేవలు మరువలేనివి

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి.ఉమాగౌరీ

నవతెలంగాణ-సిటీబ్యూరో



కిష్టయ్య సేవలు మరువలేనివి అని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి.ఉమాగౌరీ అన్నారు. నారపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రలో విధులు నిర్వహిస్తున్న గ్రేడ్-2 ల్యాబ్ టెక్నీషియన్ కల్లెం కిష్టయ్య పదవీ విరమణ కార్యక్రమం వైద్య అధికారి డాక్టర్ శోభన ఆధర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఎంఅండ్‌హెచ్‌ఓ కిష్టయ్య సుదీర్ఘకాలిక సేవలకుగాను అభినందించారు. ఆయన జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ పట్ల చూపిన నిబద్ధత, శ్రమ, రోగుల పట్ల దక్పథాన్ని ప్రశంసిస్తూ, పదవీ విరమణ అనంతరం ప్రశాంతమైన, సంతోషకరమైన జీవితం గడపాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలిపి శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కీసర డివిజన్ డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సత్యవతి, ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రాం అధికారి డాక్టర్ గీత, సూపర్‌వైజర్ భోగి ప్రకాష్, నారపల్లి పీహెచ్‌సీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రంజాన్ వేడుకలు





నవతెలంగాణ-చేవెళ్ల



రంజాన్ పండుగను చేవెళ్ల మండలంలోని చేవెళ్ల, ఆలూరు, ముడిమ్యాల్, మల్కాపూర్ గ్రామాల్లో రంజాన్ పండుగను ముస్లీం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం రంజాను పండుగను పురస్కరించుకుని ఈద్గా వద్ద ముస్లీంలు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. పండుగను పురస్కరించుకుని ఉదయం కొత్త బట్టలు వేసుకుని ఈద్గా వద్దకు వెళ్లి సామూహికంగా పలు ప్రార్ధనలు చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లీం సోదరులకు చేవెళ్ల పీఏసీఎస్ చైర్మెన్ దేవర వెంకట్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, చేవెళ్ల మాజీ ఉప సర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, నాయకులు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చేవెళ్లలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. ఈ రంజాన్ వేడుకల్లో ముస్లిసోదరులు తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌సీయూ భూముల వేలాన్ని వెంటనే నిలిపి వేయాలి

- భూముల అమ్మకం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి
- బీఆర్ఎస్ నాయకుడు రవీందర్ యాదవ్

నవతెలంగాణ-శేరిలింగంపల్లి



హెచ్‌సీయూ భూముల వేలాన్ని వెంటనే నిలిపి వేయాలని బీఆర్ఎస్ నాయకుడు రవీందర్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌సీయూ భూములను అక్రమంగా అమ్మి సొమ్ము చేసుకోవాలనుకోవడం దారుణమన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో హెచ్‌సీయూ యూనివర్సిటీ ప్రాంతంలో జీవ వైవిధ్యాన్ని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. 400 ఎకరాల భూములను వేలం వేయాలని ప్రక్రియను వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ పరిధిలోని పచ్చని చెట్లను నరికివేయడానికి ప్రభుత్వం పాల్పడటం సరికాదన్నారు. ఆదివారం వర్సిటీ ప్రాగణంలో జేసీబీలతో చెట్లను కూల్చివేసి నేలను చదును చేసేందుకు పాల్పడ్డారని, అడ్డు వచ్చిన విద్యార్థులపై ఇష్టారాజ్యంగా దాడులు చేయడం దారుణమన్నారు. విద్యార్థులతో ఆటలు ఆడోద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పోలీసుల ద్వారా భయపెట్టాలని చూడొద్దన్నారు. ప్రతిష్టాత్మకమైన సెంట్రల్ యూనివర్సిటీని కాంగ్రెస్ ప్రభుత్వం భ్రష్టు పట్టించాలనే కుట్రలు పన్నుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 400 ఎకరాలను వేలం వేయాలనుకున్న నిర్ణయాన్ని వెంటనే నిలిపివేయాలని, లేదంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని రవీందర్ యాదవ్ హెచ్చరించారు.

త్యాగానికి ప్రతీక రంజాన్

- కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్



నవతెలంగాణ-మియాపూర్

త్యాగానికి ప్రతీక రంజాన్ అని మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. త్యాగం, దయ, సానుభూతి, క్రమశిక్షణ, దానాగుణాలను నేర్పే పవిత్ర రంజాన్ మాసం చివరి రోజు ఈద్ - ఉల్- ఫితర్ సందర్భంగా మియాపూర్ డివిజన్ పరిధిలోని నడిగడ్డ తండాలో గల సీనియర్ నాయకులు మహమ్మద్ సలీం, మక్త మహబూబ్ పేట్ విలేజ్‌లో గల సీనియర్ నాయకులు మహమ్మద్ సద్దాం నివాసాలకు స్థానిక నాయకులతో కలిసి వెళ్లి పవిత్ర మాస రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నడిగడ్డ తండా నాయకులు స్వామి నాయక్, అబ్రహాం, సుధాకర్, కమలాకర్, శ్రీను, సంపత్, ఇలియాస్, అబ్బాస్, అసిసోద్దిన్, గరీబ్, జాఫర్, రవి నాయక్, మక్త మహబూబ్‌పేట్ వాసులు సలీం, షేక్ మహబూబ్, ఆలీం, అఫ్రోజ్, రుక్మద్దీన్, అలీఫ్, నరేష్, శివ, అవినాష్, చందు ముస్లిం తదితరులు పాల్గొన్నారు.

'గ్రామానికి రోడ్డును వేయాలి'



నవతెలంగాణ-షాబాద్

మండల పరిధిలోని నరెడ్లగూడ గ్రామానికి బీటీ రోడ్డు వేసి గ్రామస్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్కత్ కృష్ణ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని నరేడ్లగూడలో గ్రామస్తులతో కలిసి మాట్లాడారు. ప్రభుత్వాలు మారినా తమ గ్రామానికి రోడ్డు అసంపూర్తిగా ఉందని, దీన్ని పూర్తి చేయాలని కోరారు. లేని యెడల షాబాద్ మండల కేంద్రంలో రిలే నిరహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు విశ్వం మాదిగ, మాలమహానాడు జిల్లా నాయకుడు చందు, గ్రామస్తులు జంగయ్య కృష్ణయ్య, రాములు, కృష్ణ, శంకర్, అంజయ్య, మహేందర్, రాజు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో కూచిపూడి నృత్య ప్రదర్శన



నవతెలంగాణ-శేరిలింగంపల్లి

మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న ఉగాది వసంతోత్సవాల్లో భాగంగా మూడవ రోజు సందర్భంగా నాట్య గురువులు శ్రీ శీనయ్య శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. బ్రహ్మాంజలి, ప్రణమామ్యహం, జతిస్వరం, శ్రీ విఘ్నరాజం భజే, దశావతార శబ్దం, జనుత శబ్దం, గణపతి కౌతం, హిందోళం తిల్లాన అంశాలను భవిష్య, హ్రితిక, వార్షిత, హంసిని, సిద్ధి, మేఘన, శాన్వి, ఈషా కృష్ణ, సాన్విక, గౌరీ, రుషిక, ఇందీవరా, సమీనా, ధ్రువి, జాన్వీ రిద్ధి, దీప్సిక మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.



ముస్లిం సోదరులకు రంజాన్ వేడుకల సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్. కార్యక్రమంలో ముస్లిం సోదరులు, తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-గండిపేట్



రంజాన్ పండుగ మత సామరస్యానికి ప్రతీక అని హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు అన్నారు. ముస్లింల పవిత్ర పండుగ రంజాన్ పండుగ పర్వదినం సందర్భంగా సోమవారం హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని హైదర్ నగర్ మెయిన్ రోడ్డులో ఉన్న మస్జిద్ - ఈ - నూర్ - ఈ - మహమ్మది వద్ద నిర్వహించిన రంజాన్ వేడుకలకు కార్పొరేటర్ పాల్గొని, మసీదు కమిటీ సభ్యులు, ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం సోదరులకు కార్పొరేటర్ ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలియజేశారు.

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని మేడ్చల్ జిల్లా డీఎఫ్‌సీఎస్ చైర్మెన్ మన్నె రాజు అన్నారు. సోమవారం రంజాన్ పండుగ సందర్భంగా 130 డివిజన్‌లోని సాయిబాబా నగర్ పెద్ద మసీదులో ముస్లిం మత పెద్దలతో కలిసి ప్రార్థనలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎఫ్‌పీఎస్ చైర్మెన్ రాజు మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో నిర్వహించే ఉపవాస దీక్షలు, దైవ ప్రార్థనలతో మతసామరస్యం, ఆనందం వెల్లివిరిశాయని అన్నారు. సేవా దృక్పథానికి, సహనానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకుంటారని తెలిపారు. మేడ్చల్ జిల్లా ముస్లిం ప్రజలందరికీ ఆయన రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

బ్రిడ్జిపై రైలింగ్ ఫెన్సింగ్ ధ్వంసం

- ఓపెన్‌గా ప్రమాదకరంగా మారిన నాలా
- నాలాలో పేరుకుపోతున్న చెత్తా చెదారం
- వాహనదారులు అజాగ్రత్తగా డ్రైవ్ చేస్తే అంతే సంగతులు
- ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించాలి
- నాలా బ్రిడ్జిపై రైలింగ్, ఫెన్సింగ్‌లను వెంటనే మరమ్మతు చేయాలి: స్థానికుల డిమాండ్





నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని, ఆల్విన్ కాలని, కేపీహెచ్‌బీ ప్రధాన రహదారిలో ఉన్న నాలా పైబ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. పీఏసీ చైర్మెన్ నివాసానికి అత్యంత సమీపంలో ఉన్న, నాలా పైన రైలింగ్,ఫెన్సింగ్ పూర్తిగా డ్యామేజ్ అయి విరిగిపోయింది. నాలాకి ఒక పక్కన ఓపెన్ అవడంతో, ప్రమాదకరంగా తయారయ్యింది. నెలలు గడుస్తున్నప్పటికీ సంబంధిత జీహెచ్‌ఎంసీ అధికారులు, ఇరిగేషన్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా ఉన్నారు. నాలా రైలింగ్ లేకపోవడంతో అటుగా ప్రయాణించే వాహనదారులు భయానికి లోనవుతున్నారు. ప్రతి రోజు ఆ నాలా బ్రిడ్జి పై నుంచి, జగద్గిరిగుట్ట, కేపీహెచ్‌బీ నుంచి జగద్గిరిగుట్టకు వేల సంఖ్యలో వాహనదారులు ప్రయాణిస్తుంటారు. అందులో పిల్లల పాఠశాల వాహనాలు, వాణిజ్య వాహనాలు, విద్యార్థులు, మహిళలు ఇలా అనేక రకాల వాహనదారులు ప్రయాణించే ఈ మార్గంలో ప్రయాణిస్తుంటారు. నాలా బ్రిడ్జిపై రక్షణగా ఉండాల్సిన రైలింగ్, కంచెలు, బ్రిడ్జి పైన సగభాగం వరకు పూర్తిగా విరిగి పోయి, నాలా ఓపెన్ అవడంతో ప్రమాదకరంగా మారింది. అందుకు వాహనదారులు బ్రిడ్జి పై నుంచి ప్రయాణం చేయాలంటే భయపడుతూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. వాహనదారులు ఏ మాత్రం అజాగ్రత్తగా నడిపినా వాహనంతో సహా నేరుగా నాలాలోకి దూసుకెళ్ళే దుస్థితిలో ఉంది. కాబట్టి ఏ ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి, బ్రిడ్జి పైన రైలింగ్,ఫెన్సింగ్ పనులు చేపట్టి త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని స్థానికులు కోరారు.

నాలా పైన పేరుకుపోతున్న చెత్త..



అలాగే బ్రిడ్జి పైన నాలా ఓపెన్ ఉన్న చోట చెత్త వేయడంతో ,చెత్తా చెదారం పూర్తిగా నాలాలో పడి గుట్టలుగా పేరుకు పోయింది. అక్కడ వెలువడే దుర్వాసనతో ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థి నెలకొంది. అటుగా వెళ్ళే వాహనదారులు సైతం ఇబ్బందులు పడుతూ పారిశుధ్య సిబ్బందిపై, అలాగే సంబంధిత అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాబట్టి అక్కడ చెత్త వేయకుండా నియంత్రించాలని, అలాగే ఏ ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి, బ్రిడ్జి పైన రైలింగ్, ఫెన్సింగ్ పనులు చేపట్టి త్వరగా పనులు పూర్తి చేయాలి.

-కుమార్ యాదవ్

నాలా బ్రిడ్జి పై రైలింగ్ ఫెన్సింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి..



ఆల్విన్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి నాలాపై నిర్మించిన బ్రిడ్జిపై పాడైపోయింది. పీఏసీ చైర్మెన్ అరికెపూడి గాంధీ నివాసము వెనుకాల, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పాత నివాసము ప్రక్కన, దాదాపు రెండు నెలలకు పైబడి, నాలా బ్రిడ్జ్ రేయిలింగ్, పాడైనప్పటికీ పట్టించుకున్న నాధుడే లేకపోవడం దురదృష్టకరం.రెయిలింగ్‌తో పాటు కంచె కూడా డ్యామేజీ అయి పూర్తిగా పైప్ లైన్ పైన ఒరిగిపోవడంతో.. నాలా వద్ద చెత్తా, చెదారం వేయడం వలన ఒక డంపింగ్ యార్డ్ లాగా ఆ ప్రాంత మంతా మారిపోయింది. ఏవైన వాహనాలు అదుపుతప్పి నాలా లో పడే అవకాశం ఉంది. ప్రజా ప్రతినిధులు చూడలేని దుస్థితి లో ఉన్న, కనీసం జీహెచ్‌ఎంసీ అలాగే వాటర్ వర్క్స్ సిబ్బంది అయినా చూసి ప్రమాదకరంగా ఉన్న పనులు చేయాలి. గతంలోను ఇదే వార్త పత్రికలో వచ్చినప్పుడు, జీహెచ్‌ఎంసీ అధికారులు వచ్చి తూతూ మంత్రంగా పని చేసి వెళ్లిపోయారే తప్ప. శాశ్వత పరిష్కారం చూపించకపోవడం శోచనీయం. ఇప్పటికైనా వెంటనే సంబంధిత అధికారులు, సిబ్బంది, చొరవ తీసుకొని శాశ్వత పరిష్కారం చూపాలి.

-రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ..సురభి రవీందర్ రావు

రాజీవ్ యువ వికాస పథకానికి
జిల్లాలో 15,500కుపైగా దరఖాస్తులు

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం
- డీప్యూటీ సీఎంతో వీసీలో పాల్గొన్న కలెక్టర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాజీవ్ యువ వికాస పథకానికి జిల్లాలో ఇప్పటి వరకు 15,500పైగా 15,500పైగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు రిజిస్టర్ అయినట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకం పై హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి ఆయా జిల్లాల కలెక్టర్లు, అధికారులతో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీలో కూకట్‌పల్లి తహశీల్దార్ కార్యాలయం నుంచి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం పాల్గొని మాట్లాడారు. రాజీవ్ యువ వికాసం పథకానికి వీలైనంత ఎక్కువమంది అర్హులు దరఖాస్తులు చేసుకునే విధంగా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో వార్డుల వారీగా ప్రజా పాలన కేంద్రం ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. మూడు రోజులు వరుస సెలవులు వచ్చినందున గడువు ముగింపు తేదీ పెంచాలని కలెక్టర్ కోరారు. ఇప్పటికే ఆయా శాఖల ద్వారా పలుమార్లు పత్రిక ప్రకటనలు కూడా ఇచ్చామని తెలిపారు. గ్రామీణ స్థాయిలో ఎక్కువ మంది దరఖాస్తులు చేసుకునే విధంగా యువతను ప్రోత్సహించే విధంగా అధికారులను ఆదేశించామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తుల వివరాలను అధికారులకు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కూకట్‌పల్లి తహశీల్దార్ స్వామి, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి వినోద్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోజెస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలను తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో తల్లిదండ్రుల మందలింపుతో 9వ, 4వ తరగతి చదువుతున్న అన్నదమ్ములు ఇంటి నుంచి వెళ్లిపోయారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు వారి ఫోటోలు స్థానిక సోషల్ మీడియా గ్రూపులలో షేర్ చేయగా.. గంటలోపే పిల్లలను పోలీసులు పట్టుకొని తల్లిదండ్రులకు అప్పగించారు. అనంతరం కుటుంబ సభ్యులు పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ గడ్డం మల్లేష్ మాట్లాడుతూ... తల్లిదండ్రులు పిల్లల పట్ల తమకున్న ప్రేమను, ఇష్టాన్ని మాటల్లో కాకుండా చేతల్లో ప్రదర్శిస్తే చిన్నారులు ఎంతో సంతోషిస్తారని తెలిపారు. పేరెంట్స్ పిల్లలను తరచూ దగ్గరకు తీసుకుంటూ తమ స్పర్శతో వాళ్లకి భరోసా ఇవ్వాలన్నారు. ఇలా చేయడం వల్ల తల్లిదండ్రులతో పిల్లలు స్నేహితులుగా మెలుగుతారని పేర్కొన్నారు. 'మీ క్షేమమే మాకు ముఖ్యం, ఎప్పుడూ మీ వెన్నంటే మేం ఉంటాం' అన్న ఆత్మస్థైర్యాన్ని తమ చేతల ద్వారా పిల్లల్లో కలిగించాలి. తల్లిదండ్రులు ఉద్యోగాలు చేస్తుండడం, ఇతర పని ఒత్తిళ్ల వల్ల పిల్లలతో మాట్లాడడానికి తగినంత సమయాన్ని కేటాయించలేకపోతున్నారు. పిల్లలకు ఎలాంటి విషయాల పట్ల ఆసక్తి ఉందో తల్లిదండ్రులు తెలుసుకోవాలి. ఆ రంగంలో వారిని ప్రోత్సహించాలి. ప్రేమతో మార్చాలి కానీ , భయపెట్టి మార్చాలనుకోవడం పొరపాటు అన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్

- కాంగ్రెస్ సీనియర్ నేత రామచంద్రనాయక్



నవతెలంగాణ-నిజాంపేట్

పేదలకు సన్న బియ్యం ఇస్తున్న ఘనత తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని నిజాంపేట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాష్ట్ర సేవాలాల్ సేన ప్రధాన కార్యదర్శి రామచంద్రనాయక్ అన్నారు. నేటి నుంచి రాష్ట్రంలో సివిల్ సప్లై ద్వారా పేదలకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అందరూ ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సానుకూల ప్రభావాన్ని చూపేటట్టుగా వ్యవహరించాలని ఆయన సూచించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో సుమారు 5, 32,938 తెలుపు రేషన్ కార్డులు కలిగిన వారికి లబ్ది చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా బాచుపల్లి మండలంలో 10 రేషన్ డీలర్ షాపులలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో అభ్యుదయ కార్డులు కలిగి వారు కూడా లబ్దిదారులేనని తెలిపారు. సన్న బియ్యం పంపిణీలో లోపాలు ఉన్నట్లయితే సంబంధిత సివిల్ సప్లై అధికారులకు, లేదా కాంగ్రెస్ కార్యకర్తలకు ఫిర్యాదులు ఇవ్వాలని తెల్ల రేషన్ కార్డుదారులకు పిలుపునిచ్చారు.

త్యాగానికి ప్రతీక రంజాన్ పండుగ



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

త్యాగానికి ప్రతీక రంజాన్ పండుగని సుభాష్ నగర్ 130 డివిజన్ మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని, సూరారం కాలనీ 60 యార్డు మస్జిద్‌లో జరిగిన ప్రత్యేక రంజాన్ ప్రార్థనల్లో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి ముస్లిం మత పెద్దలతో కలిసి రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మాట్లాడుతూ..రంజాన్ మాసంలో నిర్వహించే ఉపవాస దీక్షలు, దైవ ప్రార్థనలతో మతసామరస్యం, ఆనందం వెల్లి విరిశాయన్నారు. క్రమశిక్షణ దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం విశిష్టత అని చెప్పారు. సేవా దృక్పథానికి, సహనానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకుంటారని తెలిపారు. 130 డివిజన్ పరిధిలోని ముస్లిం ప్రజలందరికీ సురేష్ రెడ్డి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, మజీద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిజాంపేట్‌లో ఘనంగా రంజాన్ వేడుకలు



నవతెలంగాణ-నిజాంపేట్

నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్‌లో రంజాన్ పండుగ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హనుమంత రెడ్డి సోమవారం రంజాన్ పండుగను పురస్కరించుకుని నిజాంపేట ఈద్గా వేడుకలలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొలను మాట్లాడుతూ ప్రేమ, దయ, సహనం, సంతోషాల కలయికనే రంజాన్ పండుగ ప్రత్యేకత అని కొనియాడారు. ఈ సందర్భంగా ఈద్- ఉల్- ఫితర్ శుభాకాంక్షలు ప్రార్థనలో వారందరికీ తెలిపారు. నిజాంపేట ఈద్గా వేడుకల చైర్మెన్ సయ్యద్ సలీం, అధ్యక్షులు ఖాన్, ఉపాధ్యక్షులు ఎండీ.అంజాద్‌ల ఆహ్వానం మేరకు కొలను పాల్గొన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య వారు పలు ప్రధాన రోడ్లను శుభ్రపరిచి శానిటేషన్ పనులను చేపట్టారు. ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొని ఒకరికి ఒకరు పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు కొలను రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి, కొలను జీవన్ రెడ్డి సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

శ్రీ సీతారాముల కల్యాణానికి ఆహ్వానం..



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని ఏప్రిల్ నెల 6న ఆదివారం శివకేశవ పంచముఖ ఆలయ ప్రాంగణం లో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకలు అం గరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు సోమవారం గాజులరామారం డివిజన్ కార్పొరేటర్,గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు రావుల శేషగిరి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డిలను వేరువేరుగా కలిసి సోమవారం ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఏం.అశోక్ చారి, బి.సూర్యరాజు, కూరపాటి కరుణాకర్ రాజు, పాడిచేటి రాములు గౌడ్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, కూరపాటి శ్రీరామరాజు, శంకర్‌లు పాల్గొన్నారు.

సోదర భావానికి ప్రతీక రంజాన్..



- కార్పొరేటర్ బి.విజయశేఖర్ గౌడ్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో పలు ప్రాంతాల్లో సోమవారం రంజాన్ పర్వదిన వేడుకలు ఘనంగా జరిగాయి.. సోదరభావానికి ప్రతీకాగా రంజాన్ పండగ నిలుస్తుందని రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ బి.విజయశేఖర్ గౌడ్ అన్నారు. డివిజన్ పరిధి హెచ్‌ఎంటి కాలనీలోని జిందేషా మదర్స దర్గా వద్ద, గురుమూర్తినగర్, రంగారెడ్డినగర్‌లోని ఈద్గాల వద్ద ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకమత్యంతోనే శాంతి సమాజం నెలకొల్పవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు మహమ్మద్ ఖాజా, ఎండీ.అబ్దుల్ ఖాదర్, ఎండీ.వాజిద్, ఎండీ.ఆన్సర్, ఎండీ.జలీల్, ఎండీ.జహీర్, షేక్ బాబుమియా, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు. అనంతరం రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

రంగారెడ్డినగర్ ప్రాంతంలోనిలోని సీనియర్ మైనార్టీ నాయకులు మొహమ్మద్ గౌసుద్దీన్ ఆధ్వర్యంలో ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన రంజాన్ వేడుకలకు స్థానిక కార్పొరేటర్ బి.విజయ శేఖర్ గౌడ్ హాజరై కుటుంబ సభ్యులు, ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో మొహమ్మద్ నిజాముద్దీన్, మొహమ్మద్ ఇబ్రహీం, ఎండీ.రహమత్, ఎండీ.రియాజ్, బీఆర్‌ఎస్ నాయకులు కార్తీక్ గౌడ్, తేజయాదవ్, రాజేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.



రంగారెడ్డినగర్ డివిజన్ పరిది వెంకట్రామ్ రెడ్డి నగర్‌లో గల ఈద్గా ఏ ఉమర్ దర్గా వద్ద రంజాన్ వేడుకలు స్థానిక ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు ఎండీ.షాబుద్దీన్, ఎండీ.రషీద్, అక్బర్, సయ్యద్ సాదక్, ఎండీ.హాఫీజ్ పాల్గొన్నారు. అనంతరం అలై బాలైతో రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.



యువత స్వయం ఉపాధిలో రాణించాలి



- బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తూ సమయాన్ని వృధా చేయకుండా స్వయం ఉపాధి రంగాలపై దృష్టి పెట్టాలని 129 సూరారం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ సూచించారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని, సుచిత్ర సర్కిల్, బ్యాంక్ కాలనీ మెయిన్ రోడ్డుపై నూతనంగా ఏర్పాటు చేసిన "నవాబి చాయ్ హెూటల్" ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా పుప్పాల భాస్కర్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ... యువత ప్రభుత్వ ఉద్యోగులపై ఆధారపడకుండా వ్యాపార రంగంలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. అలాగే మరికొందరికి ఉపాధి కల్పించాలని, యువత యొక్క స్వయం ఉపాధి ద్వారా దేశ అభివృద్ధి తోడ్పడుతుందని తెలిపారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు యువత స్వయం ఉపాధికై రుణాలు రూపేనా సహాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి పోలే శ్రీకాంత్, సిద్ధిరాములు, గణేశ్వర్, సమన్న, ముకుంద రావు, యాదగిరి, నాగేష్, శ్రీకాంత్ ఉన్నారు.

ఆలయ నూతన కమిటీ నియామకం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

గాజులరామారం డివిజన్ పరిధి,ఉమాదేవినగర్‌లోగల శ్రీ శివకేశవ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధి నూతన కమిటీని ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు వారు ప్రకటించారు. ముఖ్య సలహా దారులుగా స్థానిక ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, కార్పొరేటర్ రావుల శేషగిరి సలహాదారులుగా పేరవైన సమ్మయ్యయా దవ్, కూరపాటి కరుణాకర్ రాజు, శెర్విరాల కృష్ణమూర్తి గుప్తా, పాడిచేటి రాములు గౌడ్‌లను ఎన్నుకున్నారు. చైర్మెన్‌గా మహంకాళి అశోక్ చారి, బి.సూర్యరాజు, అధ్య క్షులుగా ఆత్మకూరి సంతోష్, ఉపాధ్యక్షులుగా తుమ్మ నగే ష్, జె.బాజారావు, చేపూరి క్రాంతి కుమార్, ప్రధాన కార్య దర్శిగా మోక్లా శంకర్, కోశాధికారిగా గెల్లు శ్రీనివాస్ యాదవ్, సంయుక్త కార్య దర్శులుగా కే.ఆనంద్ రెడ్డి, కోత శివకుమార్, కార్యనిర్వహక కార్యదర్శులుగా గెల్లు మల్లికార్జున యాదవ్, బి.తరుణ్ గౌడ్, కార్యనిర్వహక సభ్యులుగా మారబోయిన రమేష్ యాదవ్, జె.శంకర్, గోండ్ల నవీన్ కుమార్, పేరవైన రమేష్ యాదవ్, దాసరి ప్రవీణ్, ప్రచార, పౌర సంబంధాల కోఆర్డినేటర్‌గా కూరపాటి శ్రీరామరాజును నియమిస్తున్నట్టు తీర్మానిం చారు. ఈ సందర్భంగా ఆలయ నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ వర్గ విభేదాలకు తావివ్వకుండా ప్రతి ఒక్క రిని కలుపుకుపోతూ ఆలయ అభివృద్ధికి కంకణ బద్ధుల మై పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కూకట్‌పల్లిలో రంజాన్ వేడుకలు

కూకట్‌పల్లిలోని ఏండ్ల చరిత్ర గల జామా మసీద్..



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లిలో రంజాన్ వేడుకలు ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. పవిత్ర రంజాన్ నెల ప్రారంభం నుంచి 30 రోజుల కఠిన ఉపవాస దీక్ష పూర్తి చేసుకున్న అనంతరం ఆదివారం ఆకాశంలో నెలవంక దర్శనమీయడంతో, సోమవారం రోజున పవిత్రమైన రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. కూకట్ పల్లిలోని,4 వందల చరిత్ర గల జామా మసీదు కులీ కుతుబ్షా మజీద్‌లో అలాగే మూసాపేట్‌లోని జామా మజీద్‌లో ముస్లిం సోదరులు అందరూ కలిసి భక్తితో అల్లాహ్‌ను వేడుకుంటూ ప్రార్థనలు జరుపుకున్నారు. అనంతరం ఈద్ ముబారక్ తెలిపారు.



అలయ్ బలయ్ తీసుకుంటున్న ముస్లిం పెద్దలు

మానసిక ఆరోగ్యం కోసం

ప్రతి ఒక్కరికి ఏదొక బలహీనత ఉంటుంది. వాటిని జయించి మానసికంగా మరింత బలోపేతంగా మారటమే మనల్ని విజయానికి చేరువ చేస్తుంది. మనం కొన్ని అలవాట్లను మార్చుకుంటే.. మరింత పటిష్టంగా తయారవుతారు. మానసికంగా ఆరోగ్యంగా ఉండాలంటే ఏం చేయాలో చూద్దాం...

నెగటివ్ ఆలోచనలకు దూరం..

మానసిక బలహీనతలలో ప్రధానమైనది ఆత్మన్యూనత భావన. వీలైనంత త్వరగా దీనిని తొలగించుకోవాలి. ఈ ప్రపంచంలో ప్రతీ సమస్యకు పరిష్కారం ఉంటుందని.. పరిష్కారం లేని సమస్య అంటూ లేదని తెలుసుకోండి.. "నేను చేయగలను" అనే ధైర్యాన్ని కలిగించుకునేలా ప్రతిరోజూ సానుకూల ఆలోచనలతో ముందుకు సాగండి.

భయాలను ఎదుర్కోండి..

ఎంతటి సమస్య ఎదురైనా భయానికి లోనుకాకండి, భయాన్ని ఎదుర్కొండి. ఏదైనా కొత్త పని మొదలుపెట్టాలనుకునే సమయంలో భయం వస్తే, ఆ పనినే పక్కాగా ప్రారంభించండి.

క్రమశిక్షణ -సంకల్పం

విజయానికి మొదటి మెట్టు క్రమశిక్షణ.. క్రమశిక్షణ పాటించే వ్యక్తులే విజయ శిఖరాలను అధిరోహిస్తారు. ఎదురుకాబోయే కఠిన పరిస్థితులలో నిలబడే శక్తి కోసం నిశ్చయాన్ని పెంపొందించుకోండి.

ఇతరులతో పోల్చుకోవద్దు..

ప్రయాణం.. గమ్యం.. మీది మాత్రమే.. ఇతరులతో పోల్చుకోవడం మనలో మానసిక బలహీనతను పెంచుతుంది. మీ గతాన్ని.. మీ ప్రామాణికంగా ఉంచుకోండి. నిన్నటి కంటే ఈరోజు మీరు మెరుగ్గా ఉన్నారా..? లేదా..? అన్నదే ముఖ్యం. ■

యువ ఐపీఎస్ అంకిత



చిన్నప్పుడు అందరిలా ఆమే ఓ సాధారణ అమ్మాయి. చదువు, ఆటపాటలే లోకం. డిగ్రీ చదువుతున్న రోజుల్లో సమాజంలో తన పాత్ర ఏమిటో అర్థం చేసుకుంది. సమాజం కోసం ఏమైనా చేయాలంటే అందునా మహిళలు, అమ్మాయిల అభివృద్ధి కోసం సహకరించాలంటే ఏం చేయాలనే ఆలోచన ఆమె మెదడును తొలిచేసింది. ఆ సంఘర్షణ నుండి పుట్టిందే ఐపీఎస్ అనే లక్ష్యం. ఆమే నేడు యువ ఐపీఎస్ అధికారిగా ఆంధ్రప్రదేశ్‌లోని పార్వతీపురం ఏఎస్పీగా బాధ్యతలు చూస్తున్న అంకిత సురాన. భద్రత విషయంలోనే కాదు బాలికలకు కెరీర్‌పై కూడా అవగాహన కల్పిస్తున్న ఆమె ఇటీవలె ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూ విశేషాలు మానవి పాఠకుల కోసం...

అంకిత సొంతూరు మహారాష్ట్ర. తల్లి కౌసల్య, తండ్రి మహవీర్ సురానా. వ్యాపారస్తుల కుటుంబం వీరిది. పదో తరగతి వరకు అంకిత తన రాష్ట్రంలోనే చదువుకున్నారు. తర్వాత కుటుంబం హైదరాబాద్‌లో స్థిరపడింది. ఇంటర్ (బైపీపీ) పూర్తి చేసిన తర్వాత ఉస్మానియా యూనివర్సిటీలో బీఎస్సీ బయోకెమిస్ట్రీ, నల్సార్ యూనివర్సిటీలో క్రిమినల్ జస్టిస్ మేనేజ్‌మెంట్‌లో పీజీ పూర్తి చేశారు. అప్పటి వరకు ఆ కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగస్తులు ఎవరూ లేరు. తన కుటుంబం నుండి ఆమే మొదటి పోలీస్ అధికారి. దీనికి ఆమె కుటుంబ సభ్యులు ఎంతో సంతోషిస్తున్నారు.

ప్రజలకు దగ్గరగా వుండాలని

అంకిత డిగ్రీ చదువుతున్నపుడే కెరీర్ గురించి ఆలోచించడం మొదలుపెట్టారు. సమాజానికి సేవ చేయాలని, ప్రజలకు దగ్గరగా ఉండే వృత్తిలో చేరాలని కలలు కన్నారు. ఆ క్రమంలోనే సివిల్స్ వైపు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. డిగ్రీ చదువుతూనే సివిల్స్ ప్రిపరేషన్ ప్రారంభించారు. లక్ష్యంపైనే గురి పెట్టారు. మూడు సార్లు ప్రయత్నించినా విజయం సాధించలేకపోయారు. అయినా నిరుత్సాహపడలేదు. ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. నాలుగో ప్రయత్నంలో అనుకున్నది సాధించారు. సివిల్స్‌లో 398వ ర్యాంక్ వచ్చింది. ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. 2021 బ్యాచ్ వీరిది.

మహిళల రక్షణ కోసం

సివిల్స్‌లో ర్యాంక్ సాధించి శిక్షణ పూర్తయ్యాక అంకితలో చాలా మార్పు వచ్చింది. పట్టుదల పెరిగింది. ప్రజలకు సేవ చేయడాన్ని స్ఫూర్తిగా తీసుకున్నారు. మహిళల రక్షణ కోసం పని చేయాలనే నిర్ణయానికి వచ్చారు. ఈ రంగంలో ఈమె తన ప్రయాణం కొనసాగించడానికి తల్లిదండ్రులు కూడా ఎంతో ప్రోత్సహించారు. 2013లో గ్రేహౌండ్స్‌లో విశాఖలో మొదటి సారి తన విధుల్లో చేరారు. తర్వాత పార్వతీపురం ఏఎస్పీగా వెళ్లారు. ఓ పోలీస్ అధికారిగా ఉన్న ఆమె తన విధి నిర్వహణలో ఫ్రెండ్లీ పోలీస్ అన్న పదానికి అసలైన నిర్వచనం చెబుతూ, క్లిష్టమైన కేసుల్లోనూ తన మార్పు చూపిస్తున్నారు.



పరేడ్ కమాండర్‌గా

విజయవంతమైన అధికారిణిగా గుర్తింపు పొందారు. రాష్ట్రానికి మారుమూల ఉన్న పార్వతీపురం మన్యం జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, యువతకు దిశానిర్దేశం చేయడంలో ముందుంటున్నారు. రాష్ట్రస్థాయి రిపబ్లిక్‌డే వేడుకల్లో పరేడ్ కమాండర్‌గా వ్యవహరించడం మరిచిపోలేని అనుభూతిగా ఆమె చెబుతున్నారు. ఇది తాను గర్వపడే సందర్భంగా భావిస్తున్నారు. వారం శిక్షణ పొంది విజయవంతంగా పరేడ్ పూర్తి చేశారు. తనకు ఈ అవకాశమిచ్చిన అందరికీ కృతజ్ఞతలు చెబుతున్నారు.

న్యాయం చేయడమే లక్ష్యంగా...

అంకిత ఎక్కడ పని చేసినా మహిళలు, బాలికల రక్షణపై దృష్టి పెడుతున్నారు. ప్రత్యేకించి మహిళలు, చిన్నారులకు పోలీసులపై నమ్మకం పెంచేలా పని చేసే ప్రయత్నం చేస్తున్నారు. విధి నిర్వహణలో ప్రతి కేసును సవాల్‌గా తీసుకుంటారు. పోక్సో కేసులు, వరకట్నం, ఎస్సీ, ఎస్టీ కేసులు, శాంతి భద్రతలు ఇలా ఏదైనా బాధితులకు న్యాయం చేయడమే తన లక్ష్యంగా పెట్టుకున్నారు.

గొప్ప అనుభూతి

పార్వతీపురం మన్యం జిల్లా లాంటి ఏజెన్సీ ప్రాంతంలో పని చేయడం గొప్ప అనుభూతినిస్తోంది. ఇక్కడ గిరిజన జనాభా అధికం. నిరక్షరాస్యత కూడా ఉంది. గత కొన్నేళ్లుగా కొంత మార్పు కనిపిస్తోంది. బాలికలు విద్య, క్రీడలు, ఇతర రంగాల్లో ప్రావీణ్యం పొందుతున్నారు. వారిలో మరింత చైతన్యం తీసుకొచ్చేందుకు నా వంతుగా ప్రయత్నిస్తున్నా. పాఠశాలలు, కళాశాలలు స్వయంగా వెళ్లి వివిధ అంశాలపై వివరిస్తున్నాను. కేవలం భద్రతనే కాదు కెరీర్ పట్ల కూడా వారిలో అవగాహన కల్పించడం చాలా సంతృప్తిగా ఉంది' అంటూ ఆమె సంతోషంగా పంచుకున్నారు. ■

పోలీసులంటే భయం పోవాలి

ప్రజలను సురక్షితంగా ఉంచడం మా బాధ్యత. అయితే శాంతి భద్రతల కోసం పోలీస్ శాఖ ఎంత చేసినా ప్రజల నుండీ సహకారం అవసరం. ట్రాఫిక్ రూల్స్ పాటించడం, ప్రయాణ సమయంలో హెల్మెట్ పెట్టుకోవడం వంటివి ఎవరికి వారు తమ బాధ్యతగా భావించాలి. పిల్లలు తప్పుడు దారిలో వెళ్లకుండా తల్లిదండ్రులు పర్యవేక్షించాలి. సమాజంలో ప్రధానంగా పోలీసులంటే భయం పోవాలి. 24 గంటలూ పోలీసులు అందుబాటులో ఉంటారు. ఏ సమయంలోనైనా ధైర్యంగా ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావాలి. చుట్టుపక్కల అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే యాప్ ద్వారా ఫిర్యాదు ఇవ్వొచ్చు, టోల్ ఫ్రీ నెంబర్‌నూ వినియోగించుకోవచ్చు. ముఖ్యంగా వీటిని మహిళలందరూ ఉపయోగించుకోవాలి.

వెన్నుతట్టి ప్రోత్సహిస్తే

నేటి తరం అమ్మాయిలకు, బాలికలకు నేను చెప్పేది ఒక్కటే. మహిళలు ఎందులోనూ తక్కువ కాదు. విద్యార్థి దశలోనే చదువు, కెరియర్‌పై దృష్టి పెట్టాలి. మీరు ఏ రంగంలో రాణించాలనుకుంటున్నారో గట్టిగా నిర్ణయించుకోవాలి. దాని సాధన దిశగా సాగాలి. పదో తరగతి తర్వాత కెరియర్ కౌన్సెలింగ్ చాలా ముఖ్యం. ఈ దశలో అనవసరంగా సమయం వృథా చేయకుండా భవిష్యత్తు కోసం ఆలోచిస్తే మంచి జీవితం లభిస్తుంది. లక్ష్యం కోసం నిరంతరం శ్రమిస్తే విజయం సులువే. ముఖ్యంగా మహిళలను వెన్నుతట్టి ప్రోత్సహిస్తే ఏ రంగంలోనైనా విజేతలవుతారు. అమ్మాయిలు ఇష్టమైన రంగాన్ని ఎంచుకోవాలి. డాక్టర్, ఇంజనీర్, లాయర్, ఐఏఎస్, ఐపీఎస్... ఇలా ఏదైనా సరే.. దాన్ని సాధించేందుకు ఎదురైన ప్రతి సవాల్‌ను చాలెంజ్‌గా తీసుకోవాలి' అంటారు ఆమె. ■



ఇది ప్రజా పాలన కాదు

(మొదటిపేజీ తరువాయి)

బుల్డోజర్లతో ప్రవేశించి.. ప్రభుత్వం ఎంపిక చేసిన 400 ఎకరాల స్థలం దాటి క్యాంపస్ స్థలంలో కూడా చదును చేయడం మొదలు పెట్టారన్నారని చెప్పారు. ఇది సరైనది కాదని ప్రశ్నించిన విద్యార్థినీ విద్యార్థులు 60 మందిని అరెస్టు చేసి రాత్రి 10 గంటల వరకు మాదాపూర్, రాయ్‌దుర్గం, గచ్చిబౌలి పోలీస్ స్టేషన్లల్లో నిర్బంధించడం ప్రజాపాలన ప్రభుత్వం ఎలా అవుతుందో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. పోలీసుల దాడిలో ఒక విద్యార్థి తల పగిలిందని, అమ్మాయిల బట్టలు చింపారని, రక్తం కారేలా గీరడం, దూషించడం.. పైగా మరోసారి ఆందోళన చేయబోమంటూ వీడియో చేస్తేనే విడుదల చేస్తామని ఒత్తిడి చేయడం అభ్యంతర కరమని, అప్రజాస్వామికమని అన్నారు. ఓయూలో కూడా నియంతృత్వ విధానంలో ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. విద్యార్థులపైన, యూనియన్ నాయకులపైన పోలీసుల నిర్బంధాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని చెప్పారు. అరెస్టు చేసిన విద్యార్థి నాయకులు ఎర్రం నవీన్‌తో పాటు మిగతావారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 400 ఎకరాల భూమి అమ్మకం ప్రయత్నాలపై ప్రభుత్వం పునరాలోచించి వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 11 గంటలకు హెచ్‌సీయూ ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేస్తామని తెలిపారు. ఈ ధర్నాలో పెద్దఎత్తున ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు పాల్గొనాలని కోరారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య మాట్లాడుతూ.. 400 ఎకరాల భూమి ఏ రకంగా చూసినా వివాదాస్పదంగానే ఉందన్నారు. అలాంటిది పోలీసులు యూనివర్సిటీ తూర్పు క్యాంపస్‌లోకి బుల్డోజర్లతో ప్రవేశించి చదును చేయడమేంటని ప్రశ్నించారు. అమ్మాయిలను అరెస్టు చేసి సాయంత్రం 6 గంటల తర్వాత పోలీస్ స్టేషన్లలో పెట్టడం అప్రజాస్వామికమన్నారు. ప్రజాస్వామ్య పునరుద్ధరణ తన ఏడో గ్యారంటీగా ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంత అప్రజాస్వామికంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. 400 ఎకరాల భూమి వేలంపాట ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, ఎండీ అబ్బాస్ పాల్గొన్నారు.

ఆ 400 ఎకరాల భూమి ప్రభుత్వానిదే

(మొదటిపేజీ తరువాయి)

తేల్చింది. ఐటీ, ఇతర ప్రాజెక్టుల ఏర్పాటుకు ఆ 400 ఎకరాలు కేటాయించాలని టీజీఐఐసీ 2024, జూన్ 19న ప్రతిపాదనలు సమర్పించింది. ఆ భూమిని స్వాధీనం చేసుకునేందుకు అనుమతించాలని విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి ఆ భూమి హక్కులను టీజీఐఐసీకి బదలాయిస్తూ 2024, జూన్ 24న ఉత్తర్వులు జారీ చేశారు. శేరిలింగంపల్లి మండల రెవెన్యూ అధికారులు భూమికి సంబంధించి పంచనామా నిర్వహించి 2024, జులై 1న టీజీఐఐసీకి అప్పగించారు" అని వివరించింది. వాస్తవం ఈ విధంగా ఉంటే, కొన్ని మీడియాల్లో అటవీ భూమనీ, బఫెల్లో లేక్, పీకాక్ లేక్ ఉన్నాయంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నాయని పేర్కొంది. ఉమ్మడి సరిహద్దులకు సంబంధించి సహకరించాలని టీజీఐఐసీ సైబరాబాద్ జోనల్ మేనేజర్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ రిజిస్ట్రార్‌కు 2024, జులై 04వ తేదీన లేఖ రాశారని తెలిపింది. వారి సమ్మతితోనే 2024, జులై 19న రెవెన్యూ అధికారులు హద్దులు నిర్ధారించారని పేర్కొంది.

అమ్మకాలు నిలిపేయండి

విద్యార్థుల ఆందోళనపై నిర్బంధం ఆపాలి

సీఐటీయూ రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమి వేలాన్ని వెంటనే ఆపాలని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు అ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశ్వవిద్యాలయాల భూములను పరిరక్షించి మానవ వనరులను పెంచేందుకు శ్రద్ధ పెట్టాల్సిన ప్రభుత్వం ఆదాయాన్ని సమకూర్చుకునే పేరిట భూములమ్మడాన్ని వారు తప్పు పట్టారు. వాటి పరిరక్షణకు శాంతి యుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై విచక్షణారహితంగా పోలీసులు లాఠీచార్జి చేయడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. అరెస్టు చేసిన విద్యార్థుల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు అభ్యంతరకరమని విమర్శించారు.

రేపే సుంకాల పిడుగు!

(మొదటిపేజీ తరువాయి)

మాత్రం ట్రంప్ ప్రభుత్వాన్ని శాంతపరచేందుకు శతవిధాలా ప్రయత్నిస్తోంది. అమెరికా నుండి దిగుమతి అవుతున్న సగానికి పైగా ఉత్పత్తులపై సుంకాలు తగ్గించేందుకు సంసిద్ధత వ్యక్తపరచింది. వాటి విలువ 23 బిలియన్ డాలర్లు ఉండవచ్చునని రాయిటర్స్ గత వారమే చెప్పింది. బాదం, క్రాన్‌బెర్రీస్ వంటి అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై విధిస్తున్న సుంకాలలో కోత విధిస్తామని భారత్ తెలిపింది. దక్షిణ, మధ్య ఆసియా ప్రాంతాలకు అమెరికా వాణిజ్య సహాయ ప్రతినిధిగా వ్యవహరిస్తున్న బ్రెండాన్ లించ్‌తో కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో పలు దఫాలుగా సంప్రదింపులు జరిపింది. బాదం, వాల్‌నట్స్, క్రాన్‌బెర్రీస్, పిస్తాచియోస్, పప్పులు వంటి వ్యవసాయ ఉత్పత్తులతో పాటు విస్కీ దిగుమతులపై సుంకాలు తగ్గించేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. అయితే ఈ బుజ్జగింపు చర్యలు ఏ మేరకు ఫలితాన్ని ఇస్తాయో వేచి చూడాల్సి ఉంది. భారత్ గత నెలలోనే కొన్ని అమెరికా ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను తగ్గించింది. బర్బన్ విస్కీపై సుంకాన్ని 150 శాతం నుండి 100 శాతానికి, వ్యవసాయోత్పత్తులపై సుంకాలను 30-100 శాతానికి తగ్గించింది. పప్పులపై కూడా సుంకాలు 10 శాతం మేర తగ్గాయి. అంతేకాదు...ఆన్‌లైన్ యాడ్స్‌పై గూగుల్ ట్యాక్స్‌ను 6 శాతం తగ్గించడం అంతర్జాతీయ టెక్ కంపెనీలకు ఊరట కలిగించింది.

పురోగతిలో వాణిజ్య చర్చలు

భారత్, అమెరికా ఇప్పటికే తొలి విడత వాణిజ్య చర్చలు కూడా పూర్తి చేశాయి. ఈ చర్చలలో 'గణనీయమైన సానుకూల ఫలితాలు' వచ్చాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రేపు అమెరికా ప్రకటించే ప్రతీకార సుంకాల నుండి మన దేశానికి కొన్ని మినహాయింపులు లభించవచ్చునన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. బుధవారం ప్రారంభమైన చర్చలు ఆదివారం వరకూ కొనసాగాయి. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ)పై చర్చలకు సంబంధించి ఇరు పక్షాలు ఓ రూపాన్ని ఇచ్చాయి. చర్చల నుండి అనేక సానుకూల సంకేతాలు వెలువడ్డాయని అధికారులు తెలిపారు. 'చర్చలను మరో రోజు పొడిగించి ఆదివారం వరకూ కొనసాగించారు. రెండో దఫా చర్చలు జరిపేందుకు ఇరు దేశాలు అంగీకరించాయి. అమెరికాతో పరస్పర ప్రయోజనకరమైన బీటీఏపై సంతకం చేసేందుకు ముందుకు వచ్చిన ఏకైక దేశం భారతదేశమే. చైనా, కెనడా, మెక్సికో, జర్మనీ, యూరోపియన్ యూనియన్ వంటివి ప్రతీకార చర్యలకు దిగుతున్నాయి. ముఖ్యంగా భారత్ విషయంలో ట్రంప్ సానుకూలంగా వ్యవహరిస్తున్నారు' అని వారు వివరించారు. ప్రధాని మోడీ మంచి స్నేహితుడంటూ శ్వేతసౌధంలో ట్రంప్ చేసిన ప్రకటనను వారు గుర్తు చేశారు. రెండు దేశాల మధ్య స్నేహపూర్వక, సుహృద్భావ వాతావరణంలో చర్చలు జరిగాయని, సెప్టెంబర్ నాటికి ఒప్పందం కుదురుతుందని అన్నారు.

హైదరాబాద్‌లో వాన్‌గార్డ్ జీసీసీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రపంచంలోని అత్యంత ప్రతిష్టాత్మక సంస్థల్లో ఒకటైన వాన్‌గార్డ్ కంపెనీ హైదరాబాద్‌లో గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది. ఆ సంస్థ సీఈవో సలీం రాంజీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సోమవారం హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో భేటీ అయ్యింది. ఈ సందర్భంగా జరిగిన చర్చల అనంతరం 2025 చివరి నాటికి హైదరాబాద్‌లో జీసీసీ ఏర్పాటు నిర్ణయాన్ని ఆ వాన్‌గార్డ్ ప్రకటించింది. రాబోయే నాలుగేండ్లలో 2,300 మంది ఉద్యోగులను నియమించుకోవాలని లక్ష్యంగా నిర్ణయించింది. హైదరాబాద్‌లో వాన్ గార్డ్ సంస్థ జీసీసీ ఏర్పాటుకు ముందుకు రావటం ఆనందంగా ఉందని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్‌లో భాగంగా హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి జీసీసీ గమ్యస్థానంగా తీర్చిదిద్దుతు న్నామని చెప్పారు. వాన్‌గార్డ్ రాకతో జీసీసీ రంగంలో హైదరాబాద్ మరింత బలపడుతుందని అన్నారు. దేశంలోని ప్రతిభను ఉపయోగించుకోవడానికి, సాంకేతిక నిపుణులకు ఉద్యోగ అవకాశాలను మెరుగుపరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుందని కంపెనీ ప్రతినిధులకు సీఎం భరోసా ఇచ్చారు. హైదరాబాద్‌లో వైవిధ్యమైన ప్రతిభతో పాటు, జీవన నాణ్యత, సాంకేతిక నైపుణ్యం, ఆవిష్కరణలకు అనుకూలమైన వాతావరణముందని కంపెనీ సీఈవో సలీం రాంజీ అభిప్రాయపడ్డారు. వీటికి తోడు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలతో హైదరాబాద్‌ను తమకు అనువైన చోటుగా ఎంచుకున్నామని చెప్పారు. తమ వినియోగదారులకు ప్రపంచస్థాయి సేవలను అందించటంతో పాటు ఏఐ, మొబైల్, క్లౌడ్ టెక్నాలజీలో ప్రతిభావంతులైన ఇంజినీర్లకు అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ప్రపంచంలో పేరొందిన పెట్టుబడి సంస్థగా గుర్తింపు పొందామనీ, 10 ట్రిలియన్ డాలర్ల విలువైన ఆస్తులను ఈ కంపెనీ నిర్వహిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వాన్‌గార్డ్ ఐటీ డివిజన్ సీఐఓ, ఎండీ నితిన్ టాండన్, చీఫ్ హెచ్‌ఆర్ ఆఫీసర్ జాన్ కౌచర్, జీసీసీ-వాన్‌గార్డ్ ఇండియా హెడ్ వెంకటేష్ నటరాజన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

'రాజీవ్ యువ వికాసం' విజయవంతం చేయండి

పొరపాట్లకు తావు లేకుండా ఎంపిక

ఏప్రిల్ 14 వరకు దరఖాస్తుల స్వీకరణ పొడిగింపు

వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పథకం అమలుపై వారికి పలు సూచనలు చేశారు. నిరుద్యోగ యువత వారి కాళ్లపై వారు నిలబడాలన్న లక్ష్యంతో ప్రభుత్వం యువ వికాసానికి రూ. పదివేల కోట్లు ఖర్చు చేస్తున్నదనీ, అధికారులు మనసుపెట్టి పనిచేయాలని సూచించారు. గడిచిన పదేండ్ల కాలంలో నిరుద్యోగ యువతపై ఇంత పెద్ద మొత్తంలో ఎప్పుడూ నిధులు ఖర్చు చేయలేదని పేర్కొన్నారు. ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్ తదితర అన్ని వర్గాల గురించి ఆలోచించి మొదటిసారి చేస్తున్న స్వయం ఉపాధి పథకమని గుర్తు చేశారు. దరఖాస్తుదారులు ఎంపీడీఓ కార్యాలయాలు, మున్సిపాల్టీల్లో నేరుగా దరఖాస్తు చేసుకునేలా యువతకు అవగాహన కల్పించాలన్నారు. మంత్రులు జిల్లాలకు వచ్చినప్పుడు పథకానికి సంబంధించిన ప్రగతి సమాచారం అందించి వారి నుంచి సలహాలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యేలకు పథకానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందించాలని ఆదేశించారు. వరుస సెలవుల నేపథ్యంలో ఏప్రిల్ 14 వరకు దరఖాస్తు గడువు పెంచాలని అధికారులను ఆదేశించారు. జూన్ 2న అర్హులకు శాంక్షన్ లెటర్లు ఇవ్వాలని అన్నారు. దరఖాస్తుల స్వీకరణ మొదలు గ్రౌండింగ్ వరకు నిరుద్యోగ యువత ఇబ్బందులు ఎదుర్కోకుండా ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి జిల్లాలో ఒక యువ అధికారిని నియమించాలని భట్టి ఆదేశించారు.

వేధిస్తే కఠిన చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

సీజన్‌లో ఉప్పల్‌లో జరుగబోయే ఇతర మ్యాచులకు టికెట్ల అంశంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో హెచ్‌సీఏ సఖ్యతతో నడుచుకోవాలని, అధిక టికెట్లను హెచ్‌సీఏ సహా ఎవరూ అడిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో సిట్ ఏర్పాటు చేసిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ త్వరలోనే ఈ అంశంపై నివేదిక ఇవ్వనున్నట్టు సమాచారం.

అసలు వివాదం ఏంటీ? :

సన్‌రైజర్స్ హైదరాబాద్, హైదరాబాద్ క్రికెట్ అసోయేషన్ నడుమ 20 కార్పోరేట్ బాక్స్ కాంప్లిమెంటరీ టికెట్ల కోసం ఘర్షణ మొదలైంది. సౌత్ పెవిలియన్‌లోని తొలి అంతస్తులో ఎఫ్12-ఏ బాక్స్‌లో తొలి నుంచి సన్‌రైజర్స్ 50 టికెట్లను జారీ చేస్తోంది. కానీ ఆ బాక్స్ సామర్థ్యం 20 మాత్రమేనని, మరో 10 టికెట్లు అక్కడే కేటాయించినా మిగిలిన 20 టికెట్లను ఇతర బాక్స్‌ల్లో సర్దుబాటు చేయాలని హెచ్‌సీఏ కోరింది.

ఐపీఎల్ సీజన్ ఆరంభానికి ముందు జరిగిన సంయుక్త సమావేశంలో సన్‌రైజర్స్ ప్రతినిధులు ఈ ప్రతిపాదనకు అంగీకారం తెలిపినా.. తొలి రెండు మ్యాచులకు 50 టికెట్లను ఆ బాక్స్‌లోనే కేటాయించారు. ఈ చర్య హెచ్‌సీఏ ఆఫీస్ బేరర్లకు ఆగ్రహం తెప్పించినట్టు తెలుస్తోంది. గురువారం లక్నో సూపర్‌జెయింట్స్‌తో మ్యాచ్‌కు ఎఫ్12-ఏ బాక్స్‌లోని 20 టికెట్లను వెనక్కి ఇచ్చిన హెచ్‌సీఏ మరో బాక్స్‌లో జారీ చేయాలని కోరింది. అందుకు సన్‌రైజర్స్ విముఖత చూపటంతో ఫస్ట్ ఫ్లోర్‌లో సూపర్‌జెయింట్స్ ఫ్రాంచైజీ యజమాని సంజీవ్ గోయెంకాకు కేటాయించిన ఎఫ్3 కార్పోరేట్ బాక్స్‌కు హెచ్‌సీఏ తాళం వేసింది. ఈ చర్యను సీరియస్‌గా తీసుకున్న సన్‌రైజర్స్ యాజమాన్యం హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని కోరటంతో పాటు అవసరమైతే మరో స్టేడియంలో ఆడేందుకు సిద్ధమంటూ ఘాటుగా ఈమెయిల్ అస్త్రం సంధించింది. ఇక్కడ్నుంచి సన్‌రైజర్స్, హెచ్‌సీఏ నడుమ ఈమెయిల్స్ యుద్ధం నడువగా.. పలు ఆసక్తికర విషయాలు బయటకొచ్చాయి. విజిలెన్స్ విచారణలో హెచ్‌సీఏ, సన్‌రైజర్స్ పరస్పర ఈమెయిల్స్, సంయుక్త సమావేశాల మీటింగ్ మినిట్స్ కీలకం కానున్నాయి.

ఇదే అసలు కారణమా?


3900 ఉచిత పాస్‌లతో పాటు 3900 టికెట్లను బ్లాక్ చేసి, కొనుగోలు చేసేందుకు ప్రత్యేక పేమెంట్ లింక్ క్రియేట్ చేయాలని హెచ్‌సీఏ కోరింది. అపెక్స్ కౌన్సిల్ సభ్యులతో పాటు ఇతర క్లబ్ కార్యదర్శులు వ్యక్తిగతంగా ఈ టికెట్లను కొనుగోలు చేస్తారని, అందుకు భిన్నమైన పేమెంట్ లింక్స్ పంపాలని సూచించింది. ఇందుకు సన్‌రైజర్స్ యాజమాన్యం నిరాకరించింది. పలు స్టాండ్స్‌లో 2000 టికెట్లను ఇస్తామని, అందుకు ఒకే పేమెంట్ లింక్ పంపుతామని.. హెచ్‌సీఏ అధికారిక బ్యాంక్ నుంచే కొనుగోలు చేయాలని అప్పుడే టికెట్ల అమ్మకంలో పారదర్శకత పాటించినట్టు అవుతుందని తెలిపింది. హెచ్‌సీఏ పెద్దలు ఈ అంశంలో మళ్లీ సన్‌రైజర్స్‌ను సంప్రదించలేదు. ఈ అంశంలో విభేదాల కారణంగానే ఎఫ్12-ఏ బాక్స్ కాంప్లిమెంటరీ టికెట్లు వెనక్కి ఇవ్వటం, ఎఫ్3 బాక్స్‌కు తాళం వేసేందుకు పరిస్థితులు దారితీశాయని తెలుస్తోంది.

ఇక భేటీలకు అధ్యక్షుడు దూరం

సన్‌రైజర్స్ హైదరాబాద్ తాజాగా రాసిన మరో ఈమెయిల్‌లో హెచ్‌సీఏ అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావుపై తీవ్ర ఆరోపణలు చేసింది. ఉప్పల్ స్టేడియం ఆధునీకరణ పనులు సన్‌రైజర్స్ నిధులతో చేసినా.. సోషల్ మీడియా ప్రచారంలో అధ్యక్షుడు ఎక్కడా తమ పేరు ప్రస్తావించలేదని, స్టేడియం ఆవరణలో మల్టీలెవల్ పార్కింగ్ సదుపాయాన్ని సైతం తమ నిధులతో నిర్మించాలని కోరినట్టు సన్‌రైజర్స్ ఈమెయిల్‌లో తెలిపింది. వ్యక్తిగతంగా ఆరోపణలు రావటంతో సన్‌రైజర్స్ ప్రతినిధులతో ఇక నుంచి జరుగబోయే ఏ సమావేశంలో తను పాల్గొనబోనని జగన్‌మోహన్ రావు సహచర అపెక్స్ కౌన్సిల్ సభ్యులకు తెలిపాడు. దీంతో అపెక్స్ కౌన్సిల్‌తో సమావేశంలో సన్‌రైజర్స్ ప్రతినిధులు తమ అభిప్రాయాలు, ఇతర అంశాలను పంచుకుని విభేదాలకు ముగింపు పలకాలని హెచ్‌సీఏ తాజాగా రాసిన మరో ఈమెయిల్‌లో కోరింది.

ఏ పుస్తకమైన చదవాలని ఉండి పూర్తి చేయలేదంటే అది వ్యక్తిగత బలహీనతే. ఆ పుస్తకం పూర్తి చేయాలంటే అది పూర్తయ్యే వరకూ మనతోనే ఉంచుకోవాలి. దానిని పూర్తి చేయాలనే తపనా, ఆసక్తి ఉంటే అది సాధ్యమవుతుంది. భారతీయ రచయితల్లో మార్క్సిస్ట్ ఫిలాసఫర్‌గా చెప్పుకునే దేవీప్రసాద్ చటోపాధ్యాయ అముద్రిత రచనలను ఇటీవలే ముద్రించారు. వాటిని చదవడం రెండు నెలల క్రితం మొదలెట్టాను. పూర్తి చేయడం కోసం నా వెంటే ఉంచుకుంటున్నాను. ఆసక్తికరంగా ఉన్న పుస్తకం చదివేప్పుడు ఆకస్మికంగా వేరే పనులేవో తగిలితే స్వల్పంగా చికాకు కలుగుతుంది. నిభాయించుకుని తక్షణావశ్యమైన పనికి దిగుతుంటాను.

ఎప్పుడూ చిరునవ్వుతో కనబడే **సీతారాం ఏచూరి** నిరంతర అధ్యయనశీలి. జేఎన్‌యూ నాయకుడి నుంచి సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి వరకు సాగిన ఆయన ప్రస్థానంలో అధ్యయనం ప్రాధాన్యతపై ఇంటర్వ్యూ...



"ఆ వాక్యమే అధ్యయనానికి పురికొల్పింది"



కామ్రేడ్, మార్క్సిస్టులకు అధ్యయనం ఆవశ్యకత ఎంత వరకు ఉంది?

మార్క్సిస్టు అంటేనే అధ్యయనశీలి. అధ్యయనం లేకుండా మార్క్సిస్టు ఎన్నటికీ మనలేడు. మార్క్సిస్టుకు అధ్యయనం అనేది స్వాభావికంగా ఉంటుంది. ఉండాలి. అది కమ్యూనిస్టులో అంతర్భాగంగా ఉండాలి. లెనిన్ చెప్పినట్టు నిర్దిష్ట పరిస్థితిని నిర్దిష్టంగా అధ్యయనం చేయడమే మార్క్సిజం. అధ్యయనం జీవితాంతం ఉండాలి. దీన్ని గుర్తించకపోతే మెదడు క్షీణించి తద్వారా పెడధోరణులకు గురవుతాము. తప్పుదారి పడతాము. ఈ రెండింటినీ సరి చేసుకోవాలి. మరోవైపు ప్రజలు ఎందుకు మార్క్సిజం వైపు ఆకర్షితులవుతున్నారు అని చూస్తే ఇప్పటి వరకు ప్రపంచంలో మార్క్సిజం ఒక్కటే శాస్త్రీయం. లెనిన్ మాటలనే చూస్తే మార్క్సిజంలో రెండు అంశాలు ఉన్నాయి. ఒకటి విప్లవకర స్వభావం. రెండు శాస్త్రీయత. ఈ రెండింటిలో ఏ ఒక్కటి లేకున్నా వక్రీకరణలు ప్రారంభమవుతాయి.



శాస్త్రీయ అధ్యయనాన్ని ఎలా నిర్వచించవచ్చు? సమగ్ర అధ్యయనం ఎలా ఉండాలి?

అధ్యయనానికి చదవడం మౌలిక అవసరమే కానీ, చదవడంతోనే అధ్యయనం పూర్తికాదు. అధ్యయనం అనుభవాల మీద కూడా ఆధారపడుతుంది. మార్క్సిస్టుకు అనుభవాలు ఉద్యమాల ద్వారా వస్తాయి. ఉద్యమాలంటే ప్రజానీకంతో కలసి ఉండటం, పోరాడటం, చదవడం, అధ్యయనం, ఉద్యమాలలో పని చేసిన అనుభవం. ఇవన్నీ కలుపుకుంటేనే సమగ్ర అధ్యయనం అవుతుంది. పుస్తక అధ్యయనం.. సామాజిక అధ్యయనం.. ఉద్యమాల అధ్యయనం.. మూడింటి కలయికే సమగ్ర అధ్యయనం.

ఒక సామాన్య కార్యకర్త అధ్యయనాన్ని ఎక్కడ నుంచి ప్రారంభించాలి. మీ అనుభవాల నుంచి చెప్పండి?

ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత అనుభవాలుంటాయి. వాటిని జనరలైజ్ చేయడం కష్టం. సాధ్యం కూడా కాదు. సామాజికంగా పరిస్థితులు ఏవి, ఎలా మారుతున్నాయి? ఈ విధంగా ఎందుకు జరుగుతోంది? అనే సందేహాలు వస్తాయి. ఆ ప్రశ్న నుంచే అధ్యయనం చేయాలన్న అవసరం, ఆసక్తి మొదలవుతాయి. మార్క్స్ కూడా 'డౌట్ ఎవ్రీ థింగ్' అన్నారు. జిజ్ఞాస, ప్రశ్న అధ్యయనానికి పురిగొల్పుతుంది. ఆ సందేహం ఎక్కడ నుంచి మొదలవుతుందో అక్కడి నుంచే అధ్యయనం ప్రారంభించాలి. నేను ఎకనమిక్స్ గ్రాడ్యుయేషన్ చదువుతున్నప్పుడు అర్థశాస్త్రంలో మార్క్సిస్టు అవగాహన మొదట పరిచయమైంది. మార్క్స్ ఒక చోట 'ప్రిన్సిపుల్స్ ఆఫ్ ఎకనమిక్ జస్టిస్ కెన్ నెవర్ రైజ్ అబౌ ది సోషల్ కండిషన్స్' అని చెప్తారు. ఈ వాక్యమే నన్ను అధ్యయనానికి పురికొల్పింది.

న్యాయం అనేది సామాజిక పరిస్థితులకు సంబంధం కలిగి ఉంటుంది. నేటి ఆధునిక నాగరిక సమాజంలో న్యాయం సాధ్యమా?

(న్యాయమనేది సాపేక్షమైనది...సామాజిక పరిస్థితులు మారుతుంటాయి. ఎకడమిక్ స్టడీలో నుంచి ఆసక్తి మొదలవడం ఒక భాగమైతే, రెండో వైపు నుంచి మన సామాజిక పరిస్థితులు కూడా కారణమయ్యాయి. (నేను స్కూలు, కాలేజీ హైదరాబాద్‌లో చదివాను. 1967-68లో నక్సలైట్లు, ఆ తర్వాత ప్రత్యేక తెలంగాణ ఉద్యమం చూశాను. ప్రత్యేక తెలంగాణ వల్ల హైదరాబాద్ వదిలి వెళ్ళాల్సి వచ్చింది. ఆ సమయంలో ఏడాది చదువు పోయింది. వీటన్నింటికీ కారణాలు ఏమిటి? ఎందుకు జరుగుతున్నాయి ఈ ఆందోళనలు? అని వాటి నుంచి కూడా ఆలోచించాను.) మన సమాజంలో పరిణామాలను విశ్లేషిస్తూ.. వచ్చే సందేహాలన్నింటికీ పరిష్కారమేమిటి? అని ఆలోచించడం అలవర్చుకున్నాను. చుట్టూ పరిస్థితులు, పరిణామాలకు కారణాలేమిటి?.. వాటికి పరిష్కార మేమిటి విశ్లేషించుకుంటూ నేను వామపక్షం వైపు రావటం జరిగింది. కాబట్టి అసలు అధ్యయనం మొదలెట్టాల్సింది ఒక పుస్తకం నుంచి కాదు అనుభావాల నుంచి.

మార్క్సిస్టు సాహిత్యం పరిచయమయ్యాక పూర్తిస్థాయి ప్రణాళికాబద్ధంగా చదవడం ఎప్పుడు ప్రారంభమైంది?

ఒకసారి మొదలెట్టాక ఇక అది నిరంతర కార్యక్రమంగా కొనసాగింది. గ్రాడ్యుయేషన్ కాలమంతా ఇలా చదివినా, పరిణతి వచ్చిందనుకున్న దశ మాత్రం ఢిల్లీ జేఎన్‌యూలో ఉన్నప్పుడే. అక్కడ రెగ్యులర్‌గా స్టడీ గ్రూప్స్ నిర్వహించుకునే వాళ్ళం. ఒక గెస్ట్‌ని పిలిచి లెక్చర్ ఇప్పించుకోవడం, పుస్తకాలపై స్టడీ గ్రూప్స్ నిర్వహించుకోవడం ఆరేడుగురం స్వచ్ఛందంగా చేసే వాళ్ళం. క్యాపిటల్ మూడు సంపుటాలూ అప్పుడే అలా చదివాం.. ప్రతి శనివారం సాయంత్రం. మార్క్సిస్టు క్లాసిక్స్‌ని అలా చదివేశాం.

విద్యార్థి దశ కాబట్టి...చదవడం కోసం స్టడీ గ్రూపులు నిర్వహించుకునే వాళ్ళా? స్టడీ గ్రూపు కోసం చదివే వాళ్లా?

రెండూ కాదు.. చదివింది అర్థం చేసుకోవడం కోసం. చదివేది ఒక్కొక్కరికి ఒక్కొక్క విధంగా అర్థమయ్యేది. స్టడీ గ్రూపులో ఇలా పంచుకున్న అవగాహన నుంచి ప్రామాణిక అవగాహనకొచ్చేవాళ్ళం.



మొదలుపెట్టిన పుస్తకం అనేక కారణాలతో మధ్యలోనే ఆపేస్తుంటారు. ఈ సమస్య మీరు ఎలా అధిగమిస్తుంటారు?

ఏ పుస్తకమైన చదవాలని ఉండి పూర్తి చేయలేదంటే అది వ్యక్తిగత బలహీనతే. ఆ పుస్తకం పూర్తి చేయాలంటే అది పూర్తయ్యే వరకూ మనతోనే ఉంచుకోవాలి. దానిని పూర్తి చేయాలనే తపనా, ఆసక్తి ఉంటే అది సాధ్యమవుతుంది. భారతీయ రచయితల్లో మార్క్సిస్ట్ ఫిలాసఫర్‌గా చెప్పుకునే దేవీప్రసాద్ చటోపాధ్యాయ అముద్రిత రచనలను ఇటీవలే ముద్రించారు. వాటిని చదవడం రెండు నెలల క్రితం మొదలెట్టాను. పూర్తి చేయడం కోసం నా వెంటే ఉంచుకుంటున్నాను. ఆసక్తికరంగా ఉన్న పుస్తకం చదివేప్పుడు ఆకస్మికంగా వేరే పనులేవో తగిలితే స్వల్పంగా చికాకు కలుగుతుంది. నిభాయించుకుని తక్షణావశ్యమైన పనికి దిగుతుంటాను.

మార్క్సిస్టు సాహిత్యం చదవడానికి ముందు ఇతర సాహిత్యం చదివే అలవాటుండేదా? లేక నేరుగా ఇవే చదివారా?

చిన్నప్పటి నుంచీ సాహిత్యం చదివే అలవాటుండేది. దానికి ముఖ్య కారణం మా తాతగారు (అమ్మ తండ్రి). ఆయన హైకోర్టు జడ్జిగా ఉండేవారు. ఇల్లే పెద్ద లైబ్రరీగా ఉండేది. ఆయన ద్వారా చిన్నప్పటి నుంచీ చదవడం అలవడింది. ఆ అలవాటు తర్వాత కాలంలో చాలా ఉపయోగపడింది. అసలు చదవడానికి ఒక ఇంటలెక్చువల్ డిసిప్లిన్ అవసరం. అది ఎంత ముఖ్యమో ఇప్పటికీ అనిపిస్తుంటుంది. అనుభవంలో తెలుస్తుంటుంది. తరచూ ప్రయాణాల వల్ల చదవడం ఈ మధ్య సరిగ్గా సాగటం లేదు. కానీ ప్రయాణాలనే చదవడానికి ఉపయోగించుకుంటాను.

ఆ కాలంలో ఏయే పుస్తకాలు చదివారు?

ఆ రోజుల్లో కొత్తగా వస్తున్న భారతీయ ఆంగ్ల రచయితల పుస్తకాలు చదివేవాణ్ణి. ఆర్.కె. నారాయణన్ అప్పుడే పాపులర్ అవుతున్న రచయిత. భారత పరిస్థితుల్లోని వాస్తవికతను వీరు ఎలా అర్థం చేసుకుంటున్నారు.. అని తెలుసు కోవడానికి కూడా చదివేవాణ్ణి. మరోవైపు మరో తాతగారి (నాన్న తండ్రి)కి మత సంబంధ పురాణేతిహాసాల పట్ల ఆసక్తి ఉండేది. ఆయన మూలంగా రామాయణ, భారత, భాగవతాలు చదివాను. వాటిల్లో నుంచి కూడా చాలా నేర్చుకున్నాను. వాటిని నిరాకరించాల్సిన అవసరం లేదు. ఆ అభూతకల్పన నుండి రియాలిటీని గ్రహించడం కోసం అనేక ప్రశ్నలు తలెత్తేవి. అడుగుతుండే వాణ్ణి కానీ ఆయన చెప్పగలిగేవారు కారు.



రామాయణంలో దక్షిణాది రాజులను.. రాముడి మిత్రులు, భక్తులు సైతం జంతువులుగా చిత్రించడంలోని అంతరార్థం ఏమిటి? ఎందువల్ల అలా చిత్రీకరిం చారు? అనేది నా నందేహాలలో ఒకటి. రామాయణం కథ వచ్చిన రోజుల్లో ద్రావిడులపై ఆర్యుల అధిక్యత కారణంగా అలా రాశారని కొన్నేండ్ల తరువాత అర్థమైంది. అప్పటి సోషల్ రియాలిటీ ఆ కథలో అలా ప్రతిబింబించింది. వీటిని అధ్యయనం చేయడాన్ని అభివద్ధి నిరోధకంగా చూడకూడదు. వాస్తవికతను అర్థం చేసుకోవడానికి వాటిని చదవాలి .. ఒకవైపు సమకాలీన సాహిత్యం, మరోవైపు పురాణాలు, 'స్పార్టకస్' లాంటి పుస్తకాల్లోని తిరుగుబాట్లు.. ఇవన్నీ అభ్యుదయ సాహిత్యం వైపు రావడానికి దోహదపడతాయి

అభ్యుదయ సాహిత్యాన్ని ఎంచుకునే చదివేవారా?

అసలు చదివితే గదా ఏది అభ్యుదయ సాహిత్యమో తెలిసేది. ఇది ప్రోగ్రెసివ్ అనీ, ఇది రియాక్షనరీ అని ఎంచుకుని చదవాలనుకుంటే.. అసలు చదవడం సాగదు.

రాజకీయ పాఠశాలకు వెళ్లక ముందూ వెళ్ళిన తరువాత.. అవగాహనా, అధ్యయన వేగంలో ఏమైనా తేడా కనిపించిందా?

తొలి రాజకీయ పాఠశాలకు 1978లో అనుకుంటా వెళ్ళాను.. జలంధర్ పార్టీ కాంగ్రెస్ తరువాత ఆ పాఠశాల జరిగింది. రాజకీయ పాఠశాలలకు వెళ్ళడం చాలా ప్రధానం. నా వ్యక్తిగత అనుభవం ఏమిటంటే వాటికి వెళ్లడం వల్ల చదవడం క్రమానుగతమైంది. స్టడీ గ్రూపులకు వెళ్ళడం కూడా. ఏయే అంశాల కోసం ఏ పుస్తకాలు చదవాలి అనేది క్రమబద్ధమైంది. వేటిని ఎంచుకుని చదవాలనే ప్రాధాన్యతా క్రమం తెలిసింది.

ఆసక్తితో చదివేవి, అవసరాల కోసం చదివేవి ఉంటాయి. అధ్యయనంలో వీటిని ఎలా ప్లాన్ చేసుకోవాలి?



ఈ రెంటి మధ్య వైరుధ్యం ఉందని నేననుకోను. ఆసక్తి ఉండే వాటిలో కూడా విషయాలు, రాజకీయాలు ఉంటాయి. రిలాక్స్ కోణం డిటెక్టివ్ నవలలు కూడా చదివేవాణ్ణి.. పెట్టుబడదారులు, ఆయుధ వ్యాపారులు యుద్ధాన్ని ఎందుకు కోరుకుంటారో, వారు యుద్ధాల వల్ల ఎలా లాభపడతారో మొదటిసారి ఒక డిటెక్టివ్ నవల ద్వారానే తెలిసింది. కాబట్టి చదివే వాటి ద్వారా మనం ఏమి గ్రహిస్తామనే దానిపైనే ఇది అధారపడి ఉంటుంది తప్ప ఆసక్తి ఉన్న విషయాలను చదవకూడదని కాదు. కానీ మార్క్సిస్టు మౌలిక క్లాసిక్స్ చదవకుండా వీటి నుంచే అన్ని అర్థం చేసుకుంటామనేది, చైతన్యం పొందుతామనేది తప్పు. అలాగే క్లాసిక్స్ చదివేసి అంతా అర్థమయిందనుకోవడమూ సరి కాదు.

ఇప్పటికీ మీకు ఇన్‌స్పిరేషన్ ఇచ్చే పుస్తకం, రచయిత?

చెప్పడం కష్టం. చాలామంది ఉన్నారు. చాలా పుస్తకాలున్నాయి. అయినా నా దృష్టిలో క్లాసిక్ మాస్టర్ పీస్ మాత్రం మార్క్స్ రాసిన 'లూయీ బోనపార్టీ ఎయిటీంత్ బమెర్'. ఆలసట పోగొట్టుకోవడం కోసం తరచూ చదువుతుండే పుస్తకం అది. అందులోని ఒక వాక్యం. **'మేన్ మేక్స్ హిస్టరీ బట్ నాట్ ఆస్ ది సర్కమ్‌స్టెన్సెస్ ఛోజన్ బై హిమ్!' (మనుషులే చరిత్ర నిర్మాతలు. అయితే వాళ్లనుకున్న పరిస్థితుల ఆధారంగా కాదు).**

అనేక పుస్తకాలు చదువుతాము కదా! అందులోంచి విషయాలను డ్రా చేయడం గుర్తుంచుకోవడం, నిక్షిప్తం చేసుకోవడం మీరు ఎలా చేస్తారు?

ఎందుకు చదువుతున్నామనే స్పృహ మనకు ఉండాలి. మన జీవితంలోని అనుభవాల కంటే మించి ఇంకా అనేక అనుభవాలున్నాయి. వాటిని మనం అనుభవించే అవకాశం లేదు ఆ అనుభవాల్లోంచి.. మానవ సంబంధాలు.. అనుభూ తులు ఎలా వుంటాయనేది చదవడం వల్లే తెలుసుకోగలం. అవసరమైతే చదివేప్పుడు నోట్సు తీసుకోవాలి. మననం చేసుకోవడం, రాసుకోవడం చేయాలి. నా జేబులో ఎప్పుడూ చిన్న కాగితాలుంటాయి. ముఖ్యమైన విషయాలు తెలుసుకున్నా, చదివినా.. ఏ విధంగా గ్రహించినా వెంటనే రాసుకుంటాను.

ఆత్మవిమర్శతో చెప్పాలంటే.. ఈ పనిని నేను కూడా చేయాల్సినంత చేయలేక పోతున్నాను చదివినదీ తెలుసుకున్నదీ, నేర్చుకున్నవీ సహచరులతో పంచుకోవాలి. ఇది క్రమబద్ధంగా జరగాలి. అప్పుడే ఆ జ్ఞానం ఉపయోగపడుతుంది. కొందరు చాలా చదువుతారు. బాగా జ్ఞానం సంపాదిస్తారు. కానీ అది వారికే పరిమితం చేసుకుం టారు. ఇందువల్ల ఉద్యమాలకు లాభం జరగటం లేదు. ఇందుకోసం మానసిక క్రమశిక్షణ అవసరం. అలాగే, ఎంత సాధికారత ఉన్న అంశమైనా సభలు, పాఠశాలల కు వెళ్ళేప్పుడు ప్రిపరేషన్ ఉండాలి. ప్రిపరేషన్ ఉంటే విషయం, క్రమం, పద్ధతీ బాగా ఉంటాయి. చెప్పాలనుకున్నది అవతలి వారికి చేరుతుంది.

అంత బిజీ షెడ్యూల్‌లో అధ్యయనానికి సమయం ఎలా కేటాయిస్తున్నారు?

దీనికి మానసిక క్రమశిక్షణ అవసరం. ఎక్కువగా ప్రయాణాల్లో గడుపు తూంటాను. చదవడం, రాయడం కూడా ప్రయాణాల్లోనే చేస్తుంటాను. సాంకేతిక అభివద్ధి వల్ల రాసింది పంపించడమూ సాధ్యమవుతున్నది. ప్రాథమికంగా ప్రతి రోజూ కొంత సమయం అధ్యయనానికి కేటాయించడం అవసరం. కామ్రేడ్ ఇ.ఎం.ఎస్ నుంచి ఇది నేను నేర్చుకున్నాను. ఆయన రోజు ఉదయాన్నే రెండు మూడు గంటలు చదివేవారు. ఆ సమయానికి ఆటంకం ఏర్పడితే ఆ రోజులో ఏదో ఒక సమయాన్ని అందుకోసం సర్దుబాటు చేసుకునేవారు. నేనూ ఉదయాన్నే అలా కేటాయిస్తాను. ఆటంకం ఏర్పడితే సర్దుబాటు చేసుకునేందుకు ప్రయత్నిస్తాను.

అధ్యయనంలో అప్పటికీ.. ఇప్పటికీ తేడా? ఆ రోజులే బాగున్నాయి.. ఈ రోజుల్లో చదవడానికి టైమ్ ఉండటం లేదు .. అనే ఫీలింగ్ వస్తుంటుందా?

తేడా ఉంది కానీ, అలాంటి ఫీలింగ్ కలుగదు. వాస్తవానికి ఇప్పుడు సమయం మిగులుతోంది. టెక్నాలజీ పెరగడం వల్ల ఇప్పుడు సమాచారం, వెంటవెంటనే తెలిసిపోతోంది. ఇప్పుడు టెక్నాలజీ, టీవీ ఛానళ్ల వల్ల సమాచారం కోసం ఎక్కువ సేపు ఎదురుచూడాల్సిన పని లేకుండా పోయింది. వీటి వల్ల గతం కంటే చదవడానికి ఎక్కువ సమయం మిగులుతోంది రోజుల్లో సమాచార సేకరణకే ఎక్కువ సమయం పట్టేది.

వేర్వేరు రంగాలు, సామాజిక వర్గాలకు సంబంధించి వస్తున్న సమకాలీన సాహిత్యం చదవాల్సిన అవసరం ఉందా?

కచ్చితంగా ఉంది. అలా వస్తున్న మంచి సాహిత్యంతో పాటు అంతకు మించి పనికిరానిది కూడా వస్తున్నది. వాటిని వేరు చేసుకుని సమకాలీన సాహిత్యం చదవాల్సిందే.

విషయాధ్యయనంలో స్పెషలైజేషన్లకు సంబంధించి..?

స్పెషలైజేషన్ అంటే మిగతా చదవకూడదని కాదు. జనరల్‌గా అన్ని విషయాల గురించిన ప్రాథమిక అవగాహన కోసం చదవడం, అలాగే పనిచేస్తున్న అంశంమీద స్పెషలైజేషన్ చేయడం అవసరం. ఒకే విషయం స్పెషలైజేషన్ చేసి, మిగతా వదిలేయడం సరికాదు. సమగ్రతా రాదు. స్పెషలైజేషన్ లేకుండా అన్ని విషయాలు చదవడం వల్ల కూడా ప్రయోజనం ఉండదు.







మదురైకి జాతాలు

తమిళనాడులోని వివిధ ప్రాంతాల నుంచి రాష్ట్ర నేతల నాయకత్వం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సీపీఐ(ఎం) 24వ అఖిల భారత మహాసభ రేపు (బుధవారం) తమిళనాడులోని మదురైలో ప్రారంభం కానుంది. అంతకు ముందే తమిళ నాడు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి బయలుదేరిన అమరవీరుల స్మారక జాతాలు నేడు (మంగళవారం) మదురైకి చేరుకోనున్నాయి. అందులో భాగంగానే జాతాలు సోమవారం ప్రారంభ మయ్యాయి. కామ్రేడ్ సింగరవేలర్ స్మారక జాతా చెన్నై నుంచి మధురైలోని పార్టీ మహాసభ వేదిక వరకు కొనసాగుతోంది. సీపీఐ(ఎం) తమిళనాడు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె. బాలభారతి జాతాకు నాయకత్వం వహిస్తున్నారు. దీనిలో వందలాది మంది కామ్రేడ్స్ ఉత్సా హంగా పాల్గొంటున్నారు. ఆ జాతా ప్రారంభం సందర్భంగా చెన్నై శివార్లలోని తాంబరంలో బహిరంగ సభ జరిగింది. విద్యార్థి అమర వీరులు సోము, సెంబు త్యాగాలను గౌరవించే జాతా తూత్తుకుడి నుంచి మధురైలోని పార్టీ మహాసభ వేదిక వరకు కొనసాగుతోంది. సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు పి. సంపత్ ఈ జాతాకు నాయకత్వం వహిస్తారు. విద్యార్థి సంఘ నేతలు, పార్టీ నాయకుల సమక్షంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు కె. జి. భాస్కరన్‌కు జ్యోతిని అందజేశారు. సేలం జైలు అమరవీరుల స్మారక జాతా సేలం సెంట్రల్ జైలు నుంచి ప్రారంభ మైంది. 1946లో ఉరితీయబడిన నలుగురు యువ వస్త్ర మిల్లు కార్మికుల జ్ఞాపకార్థం కోయంబత్తూరులోని చిన్నియంపలయం అమర వీరుల జాతా మదురైలోని పార్టీ మహాసభ వేదిక వరకు కొనసాగుతోంది. మాజీ ఎంపీ పి.ఆర్ నటరాజన్ జ్యోతిని అందజేసిన కార్యక్రమంలో వందలాది మంది కామ్రేడ్స్ పాల్గొన్నారు. కోయంబత్తూరు జిల్లా కమిటీ కార్యదర్శి సి. పద్మనాభన్, ఇతర నాయకులు హాజర య్యారు. తిరువయారు యూనియన్ కందియూర్‌లోని వెన్మణి అమర వీరుల స్మారక జాతాకు యూనియన్ కార్యదర్శి ఎ. రాజు నాయకత్వం వహించారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి చిన్నైతో పాటు పాండియన్, తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర వనంలా మదురై

సీపీఐ(ఎం) 24వ అఖిల భారత మహాసభ ఏప్రిల్ 2 నుంచి 6 వరకు మదురై పట్టణంలో జరగనుంది. దీంతో మదురై ఎర్రవనంలా ముస్తాబైంది. మదురై నలుమూలలా ఎటువైపు నుంచి వచ్చినా ఎర్ర జెండాలు, తోరణాలు స్వాగతం పలుకుతున్నాయి. ఎక్కడికక్కడ మార్క్సిస్టు ఉద్యమ నేతలు, సిద్ధాంత కర్తల విగ్రహాలు, పోరాట చిహ్నాలు చారిత్రాత్మక ఘట్టాలను గుర్తు చేస్తున్నాయి. కామ్రేడ్ కారల్‌మార్క్స్, కామ్రేడ్ ఫ్రెడరిక్ ఎంగెల్స్, కామ్రేడ్ విఐ లెనిన్, కామ్రేడ్ జోసెఫ్ స్టాలిన్ హోర్డింగ్‌లు, సీపీఐ(ఎం) నేతల హోర్డింగ్‌లతో మదురై చూడ ముచ్చటగా ఉంది. మదురై నగరంలో పార్టీ మహాసభ సందేశాన్ని సాధారణ ప్రజలకు తీసుకెళ్ళే వందలాది బ్యానర్లు ఉన్నాయి.

సీపీఐ(ఎం)కు మదురై నగరం రెండోసారి ఆతిథ్యం

అఖిల భారత మహాసభకు ముస్తాబు

ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి నగర్‌లో పూర్తైన ఏర్పాట్లు

తమిళనాడులోని మదురై నుంచి బీ.వీ.ఎన్.పద్మరాజు

ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీకి మూడో మహాసభ కోసం తొలిసారి 1953లో ... విడిపోయిన తర్వాత 1972లో సీపీఐ(ఎం) తొమ్మిదో మహాసభకు ఆతిథ్యమిచ్చిన తమిళనాడులోని మధురై నగరం ఇప్పుడు మార్క్సిస్టు పార్టీ 24వ మహాసభ కోసం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. బుధవారం నుంచి ఈనెల ఆరో తేదీ వరకు ఈ మహాసభ కొనసాగనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో స్థానిక రైల్వే స్టేషన్ నుంచి మొదలుకుని గాంధీ మ్యూజియం, జిల్లా కోర్టుల సముదాయం రోడ్, మహాసభల వేదికైన మదురై కన్వెన్షన్ సెంటర్ (తముక్కమ్ మైదానం)తదితర ప్రాంతాలన్నీ అరుణార్ణవమైనాయి. ఎర్ర జెండాలు, తోరణాలు, గోడల మీద రాతలు, ఫ్లెక్సీలతో రహదారులన్నీ ఎరుపెక్కాయి. మహాసభ వేదికైన మదురై కన్వెన్షన్ సెంటర్‌కు కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్‌గా నామకరణం చేశారు. సోమవారం సాయంత్రం సీతారాం ఏచూరి నగర్‌లో రెడ్‌షర్ట్స్ వాలంటీర్లు నిర్వహించిన కవాతు (రిహార్సిల్స్) ఆకట్టుకుంది. సీపీఐ (ఎం) మాజీ పొలిట్ బ్యూరో సభ్యులు హన్నన్ మొల్లా, సీపీఐ(ఎం) తమిళనాడు కార్యదర్శి ఎస్.షణ్ముగమ్, కేంద్ర కమిటీ సభ్యులు కె.బాలకృష్ణన్, విజ్జూ కృష్ణన్ తదితరులు మహాసభ ఏర్పాట్లను పరిశీలించారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.